


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162

GSTIN 37AMRPM5719R1ZX

ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 146 | సోమవారం 01 - 06 -2026 | పేజీలు : 12 | No: KNL/3-77(D)/2026-2028 | వెల-3


**మేం 190 పరుగులు చేసి ఉంటే మ్యాచ్ వేరేలా ఉండేది:**



# శోకసంద్రం... తుంగాతీరం

## గల్లంతైన నలుగురి మృతదేహాలు లభ్యం



**మంత్రాలయం, మే 31** కర్నూలు జిల్లా మంత్రాలయం తుంగభద్ర తీరం శోకసంద్రమైంది. శనివారం ఇక్కడ సరదాగా ఈతకు వెళ్లిన మంత్రాలయానికి చెందిన కాలప్ప ఆచారి కుమారుడు, బంధువుల్లో మొత్తం అయిదుగురు గల్లంతవగా, ఎమ్మిగనూరుకు చెందిన ధను (22) మృతదేహం ఆరోజే లభ్యమెంఎది. మిగిలిన నలుగురు.. హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సతీశ్ చంద్ర(36), ఆయన పెద్ద కుమారుడు యువన్‌చంద్ర (5), ఉరవకొండకు చెందిన సంధ్య (21), మంత్రాలయానికి చెందిన రాఘవేంద్ర ఆచారి (28) మృతదేహాలు ఆదివారం లభ్యమయ్యాయి. మంత్రాలయం పాతవీధిలో కంసాలి కాలప్ప ఆచారి కొడుకు శశిధర్, ఉరవకొండకు చెందిన పూర్ణిమతో ఇటీవల ఎంతో అట్టహాసంగా వివాహం జరిగింది. సత్యనారాయణస్వామి పూజ నిమిత్తం మళ్లీ మంత్రాలయం వచ్చిన బంధువులు ఐదుగురు గల్లంతు కావడంతో ఆ కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. మృతదేహాలను బయటికి తీయడంతో కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలతో మంత్రాలయం సమీపంలోని తుంగాతీరం కన్నీటి సంద్రంగా మారింది.

# ష్.. గప్‌చుప్!

పోలీసులకు ఏమీ చెప్పొద్దు

చెప్పారో.. వచ్చేది మా ప్రభుత్వమే

బినామీలకు కేఎన్ఆర్ వార్నింగ్!

వారి పేరిట ఉన్న ఆస్తుల్లో ఎక్కువ భాగం

వారికే ఇచ్చేస్తానంటూ వరుస ఫోన్లు

సిట్ విచారణకు ఫోన్లు

తీసుకెళ్లొద్దని సూచన

వాటిని ధ్వంసం చేసి కొత్తవి

తీసుకోవాలని సలహా

పసిగట్టిన సిట్.. బినామీలకు నోటీసులు

కేఎన్ఆర్, పుత్తా సహా నేడు

8 మంది విచారణ

బెజవాడలో హ్యుండాయ్ షోరూం

యజమానికి రూ.4.5 కోట్లు

చెల్లించినట్లు బట్టబయలు

ఇందులో 2 కోట్లు కేఎన్ఆర్ భార్య ఖాతా

నుంచి, ఇంకో 2.5 కోట్లు ఇతరుల

అకౌంట్ల నుంచి బదిలీ



అధికార దర్పంతో రూ.వందల కోట్లు అక్రమంగా పోగేసుకున్న జగన్ పీఏ కె.నాగేశ్వరరెడ్డి (కేఎన్ఆర్).. తన ఆస్తుల వివరాలు బయటపడకుండా ఉండేందుకు నానా తంటాలు పడుతున్నాడు. తన బినామీలకు తెగ ఫోన్లు చేస్తున్నాడు. ఈ విషయంలో నోరుమెదపవద్దని.. పోలీసులకు ఏదీ చెప్పవద్దని.. ఒకవేళ చెబితే.. రేపు వచ్చేది వైసీపీ ప్రభుత్వమేనంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నాడు. రూ.10 వేల జీతం తీసుకునే ఈ ఉద్యోగి.. దేశ విదేశాల్లో వందల కోట్ల రూపాయల ఆస్తులకు ఎదిగిన తీరు.. మద్యం వ్యాపారులు మొదలుకొని తాను జగన్ ప్రభుత్వంలో దోచుకున్న సొమ్ము, వైసీపీలో పలువురి నుంచి వసూలు చేసిన డబ్బుల వివరాలు వరుసగా వెలుగుచూస్తుండడంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడు. జగన్ హయాంలో జరిగిన భారీ మద్యం కుంభకోణంలో కీలక నిందితుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుటుంబంతో కేఎన్ఆర్ జరిపిన ఆర్థిక వ్యవహారాల్లో వివరణ కోసం గత వారం సిట్ అధికారులు అతడికి నోటీసిచ్చి విచారణకు పిలిచిన సంగతి తెలిసిందే.

## కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం.. ఆరుగురు కూలీల దుర్మరణం



కర్ణాటకలోని చిక్కబళ్లాపూర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం
ఆటోను ఢీకొట్టిన కంటైనర్ లారీ

## ఈసారి కూడా వాళ్లదే కప్... ఐపీఎల్-2026 ఛాంపియన్ ఆర్సీబీ..



ఐపీఎల్ 2026 ఫైనల్‌లో గుజరాత్‌పై 5 వికెట్ల తేడాతో ఆర్సీబీ విజయం

రెండోసారి ఐపీఎల్ విజేతగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు

అజేయ అర్ధశతకంతో (75వి) జట్టును గెలిపించిన విరాట్ కోహ్లీ

తొలుత గుజరాత్‌ను 155 పరుగులకే కట్టడి చేసిన ఆర్సీబీ బౌలర్లు

సిక్సర్‌తో మ్యాచ్‌ను ముగించి ఆర్సీబీకి ఘనమైన విజయాన్ని అందించిన కోహ్లీ

# జూన్ 2 నుంచి రష్యాలో నారా లోకేష్ పర్యటన...



# నంద్యాలలో వైఎస్ఆర్ విగ్రహం ధ్వంసం..

## ఆమరణ దీక్ష చేస్తానంటూ ప్రభుత్వానికి షర్మిల హెచ్చరిక



# గండిపేట భూ కుంభకోణం..

## బొల్లా బ్రహ్మనాయుడే కీలక వ్యక్తి డీసీపీ శ్రీనివాస్



గండిపేటలో రూ.1500 కోట్ల ప్రభుత్వ భూమి కబ్జాకు భారీ కుట్ర

ఈ కుంభకోణంలో వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పాత్రపై ఆధారాలు

నకిలీ జీవోల తయారీకి రూ.4 కోట్లు చెల్లించినట్లు డీసీపీ శ్రీనివాస్ వెల్లడి

ఈ కేసులో ఇప్పటివరకు ఐదుగురిని అరెస్ట్ చేసిన సైబరాబాద్ పోలీసులు

మాజీ ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు పరారీలో ఉన్నారని, గాలింపు కొనసాగుతోందని ప్రకటన

హైదరాబాద్ శివారు గండిపేటలో వెలుగు చూసిన భారీ భూ కుంభకోణం కేసులో సంచలన విషయాలు బయటకు వస్తున్నాయి. సుమారు రూ.1500 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని నకిలీ పత్రాలతో కబ్జా చేసేందుకు జరిగిన ఈ కుట్రలో కీలక వ్యక్తి వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడేనని, అందుకు తమ వద్ద పక్కా ఆధారాలున్నాయని శేరిలింగంపల్లి డీసీపీ శ్రీనివాస్ స్పష్టం చేశారు.



# డిస్కమ్‌ల ప్రైవేటీకరణకు సీఎం రేవంత్ కుట్ర

కాదని ప్రెస్‌మీట్ పెట్టి చెప్పగలరా?

ఈఆర్సీ అనుమతిస్తే.. రైతు డిస్కమ్‌ను ఆపేందుకు సుప్రీంకోర్టుకెళ్తాం: కవిత

రైతు డిస్కంను ఏర్పాటు చేసి మిగిలిన రెండు విద్యుత్ డిస్కంలను ప్రైవేటు పరం చేసేందుకు సీఎం కుట్ర చేస్తున్నారని, ఈ కారణంగానే ఆరు నెలలు రహస్యంగా ఉంచి.. నిన్న ఆ విషయం బహిర్గతం చేశారని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ఆదివారం టీఆర్ఎస్ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. 24 గంటల కరెంట్ ఎత్తివేయం, మోటార్లకు మీటర్లు పెట్టమని, అలాచేస్తే ఎన్నికలకే వెళ్లమని చెబుతున్న రేవంత్‌రెడ్డి.. ఆ రెండు డిస్కంలను ప్రైవేట్ పరం చేస్తే ఎన్నికల్లో ఓట్లు అడగమని ప్రెస్‌మీట్ పెట్టి ప్రజలకు చెప్పగలరా..? అని ప్రశ్నించారు.



అభిషేక్‌పై దాడితో టీఎంసీకి కొత్త ఊపు?

# బెంగాల్‌లో 35 ఏళ్ల నాటి సీన్ రిపీట్..

# ఇరాన్‌తో డీల్‌పై ట్రంప్ వెనకడుగు..



ఇరాన్‌తో ఒప్పందంపై ట్రంప్ అధ్యక్షతన భేటీ

ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే ముగిసిన సమావేశం

అణ్వాయుధాన్ని వదులుకోవాలి, హర్మూజ్ జలసంధిని తెరవాలని యూఎస్ షరతులు

ఒప్పందం విఫలమైతే దాడులకు సిద్ధమని ప్రకటించిన అమెరికా రక్షణ మంత్రి

చర్చలపై నమ్మకం లేదని, క్షిపణులే తమ బలమని ఇరాన్ స్పష్టీకరణ

# ష్.. గప్‌చుప్!

తిరుపతి–చిత్తూరు మధ్య చెవిరెడ్డి కుటుంబం వేసిన 47 ఎకరాల వెంచర్‌లో ఏకంగా పదెకరాలు కొనుగోలు చేసిన కేఎన్‌ఆర్‌ను ప్రశ్నించారు. అధికారికంగా రూ.81 లక్షలు చెల్లించి కొనుగోలు చేసిన ఆ స్థిరాస్తి అసలు విలువఎంత.? అధికారికంగా చూపిన డబ్బు ఆ రూ.81 లక్షలు ఎలా సంపాదించారని అడిగారు. ఈ విచారణలో రోజుకొక కొత్త భాగోతం, ఆస్తులకు సంబంధించిన అంశాలు, బినామీల పేర్లు బయటకు వస్తుండడంతో కేఎన్‌ఆర్ విలవిలలాడుతున్నట్లు తెలుస్తోంది. మొదటిరోజు విచారణలో అతడి చిన్ననాటి స్నేహితుడు, వైసీపీ అధికార ప్రతినిధి పుత్తా శివశంకర్‌రెడ్డి పేరుతో ఉన్న ఆస్తులు బయటపడగా.. రెండో రోజు మరో వ్యాపార భాగస్వామి దండా వీరారెడ్డి అలియాస్ లోకేశ్‌రెడ్డి గుట్టు రట్టయింది. అలాగే కేఎన్‌ఆర్ భార్య సోదరుడి పేరుతో ఉన్న ఐటీ కంపెనీ, విజయవాడలోని హ్యుండాయ్ కార్ల షోరూంలో సింహ భాగం, విశాఖపట్నంలో దందాలు వరుసగా బయటపడ్డాయి. ఈ నేపథ్యంలో ఆయన బినామీలందరిపై సిట్ దృష్టి సారించింది. దీంతో కేఎన్‌ఆర్ వారికి ఫోన్లు చేసి.. 'విచారణలో పోలీసులు ఏమడిగినా చెప్పొద్దు.. మిమ్మల్ని ఏమీ కొట్టరు.. అవసరమైతే మీ పేరుతో ఉన్న ఆస్తుల్లో ఎక్కువ భాగం మీకే రాసిస్తా.. మీ ఫోన్లు తీసుకెళ్లొద్దు.. వాటిని ధ్వంసం చేసి కొత్త ఫోన్లు పట్టుకెళ్లండి.. అవసరమైతే సిమ్ కూడా కొత్తది తీసుకోండి' అని చెబుతున్నట్లు తెలిసింది. ఎవరైనా భయంతో కాదంటే.. 'మళ్లీ అధికారంలోకి వచ్చేది వైసీపీ ప్రభుత్వమే.. జాగ్రత్త' అని హెచ్చరిస్తున్నట్లు సిట్ అధికారులు పసిగట్టారు. కేఎన్‌ఆర్ బ్లాక్‌మెయిలింగ్, బెదిరింపులు, దందాలు, పైరవీలు, బినామీల జాబితా సిద్ధం చేసుకుని వాటన్నింటికీ డబ్బులు ఎక్క డి నుంచి వచ్చాయ్.. అందులో మద్యం ముడుపుల సొమ్మెంత అనేది తేల్చబోతున్నారు. కేఎన్‌ఆర్, పుత్తా శంకర్‌రెడ్డి, లక్కీ హ్యుండాయ్ భాగస్వామి ఉస్మాన్ ఆడిటర్లు ఇచ్చిన వివరాలను పరిశీలించాక.. సోమవారం విచారణకు రావాలని పలువురికి సిట్ నోటీసులు జారీ చేసింది.

**అక్రమాల తీగలాగుతున్న సిట్..** మద్యం స్కాం కేసులో నిందితుడైన చెవిరెడ్డితో జరిపిన లావాదేవీలు, తిరుపతి జిల్లాలో పదెకరాల కొనుగోలుపై సిట్ కేఎన్‌ఆర్ వివరణ తీసుకునే క్రమంలో విజయవాడలో హ్యుండాయ్ కార్ల షోరూంలో భాగస్వామ్యం వెలుగులోకి వచ్చింది. కేఎన్‌ఆర్ రూ.2 కోట్లు చెల్లించి 51శాతం వాటా రాయించుకున్నట్లు మొదట్లో సమాచారం ఉంది. ఆ సొమ్ము కేఎన్‌ఆర్ భార్య ఖాతా నుంచి చెల్లించినట్లు తేలింది. కార్ల షోరూం అసలు యజమాని ఉస్మాన్‌ను పిలిపించి ఆర్థిక లావాదేవీల రికార్డులు పరిశీలించగా రూ.4.50 కోట్లు చెల్లించినట్లు బయటపడింది. అందులో మిగతా రూ.2.5 కోట్లు ఇతరుల ఖాతాల నుంచి బదిలీ అయింది. వారికి సిట్ నోటీసులు జారీచేసినట్లు తెలిసింది. సోమవారం కేఎన్‌ఆర్, పుత్తా శంకర్‌రెడ్డి సహా 8 మందిని ప్రశ్నించనున్నట్లు సమాచారం. కాగా.. పలువురు కేఎన్‌ఆర్ బాధితులు (వైసీపీ నేతలు సహా).. జగన్ పీఏ బాగోతాన్ని పోలీసులకు చెబుతున్నట్లు సమాచారం.

# జూన్ 2 నుంచి రష్యాలో నారా లోకేష్ పర్యటన...

### రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో మంత్రి లోకేష్ రష్యా పర్యటన

### జూన్ 2 నుంచి 7వ తేదీ వరకు రష్యాలో పర్యటించనున్న లోకేష్

### సెయింట్ పీటర్స్‌బర్గ్ అంతర్జాతీయ ఆర్థిక ఫోరంలో పాల్గొనాల్సిందిగా ఆహ్వానం

### పర్యటనలో భాగంగా పలువురు పారిశ్రామికవేత్తలతో భేటీ కానున్న మంత్రి

రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ రష్యాలో పర్యటించనున్నారు. జూన్ 2 నుంచి 7వ తేదీ వరకు ఆయన రష్యాలో పర్యటించి, పలువురు పారిశ్రామికవేత్తలతో సమావేశం కానున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించి, వారిని ఏపీకి ఆహ్వానించడమే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశం.రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో జరగనున్న ప్రతిష్ఠాత్మక 'సెయింట్ పీటర్స్‌బర్గ్ ఇంటర్నేషనల్ ఎకనామిక్ ఫోరమ్' (ఎస్×జుఖీ'26) సదస్సులో పాల్గొనాల్సిందిగా మంత్రి లోకేష్‌కు ప్రత్యేక ఆహ్వానం అందింది. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల నుంచి పారిశ్రామికవేత్తలు, ఆర్థిక నిపుణులు ఈ సదస్సుకు హాజరవుతారు. ఈ పర్యటనలో భాగంగా, లోకేష్ పలువురు ప్రముఖ పారిశ్రామికవేత్తలు, కంపెనీల ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ముఖ్యంగా ఐటీ, విద్య, ఇతర కీలక రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు ఆయన చర్చలు జరపనున్నారు. ఈ పర్యటన ద్వారా రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తాయని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేస్తోంది.

# నంద్యాలలో వైఎస్‌ఆర్ విగ్రహం ధ్వంసం..

### నంద్యాలలో వైఎస్‌ఆర్ విగ్రహం ధ్వంసంపై షర్మిల ఆగ్రహం

### ఇది చంద్రబాబు రాజకీయ కక్ష సాధింపేనని ఆరోపణ

### పోలీసులు చూస్తూ ఉన్నా దాడిని ఆపలేదని విమర్శ

### విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేయకపోతే ఆమరణ దీక్ష చేస్తానని హెచ్చరిక

### నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి డిమాండ్

నంద్యాల జిల్లాలో దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేయడంపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రంగా స్పందించారు. విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేయకపోతే ఆమరణ దీక్షకు దిగుతానని కూటమి ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి చంద్రబాబును ఆమె హెచ్చరించారు. ఈ ఘటనను కాంగ్రెస్ పార్టీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.నంద్యాలలోని శ్రీనివాస సెంటర్‌లో వైఎస్‌ఆర్ విగ్రహంపై ఓ వ్యక్తి దాడి చేసి ధ్వంసం చేశాడని షర్మిల తెలిపారు. పట్టపగలు ఈ ఘటన జరుగుతుంటే, అక్కడే ఉన్న పోలీసులు నిలువరించకపోవడం హేయమైన చర్య అని ఆమె విమర్శించారు. దాడి చేసిన వ్యక్తికి మానసిక స్థితి బాగోలేదని చెప్పి పోలీసులు చేతులు దులుపుకోవడం సరికాదని అన్నారు.ఇది చంద్రబాబు రాజకీయ కక్ష సాధింపు ఉందని షర్మిల ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఇలాంటి ఘటనలను చూస్తూ చోద్యం చూడటం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో వైఎస్‌ఆర్ విగ్రహాలపై జరుగుతున్న దాడులను అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితుడితో పాటు, అతని వెనుక ఉన్న శక్తులెవరో తేల్చి కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. పాత విగ్రహం స్థానంలో వెంటనే కొత్తది ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో నంద్యాలలో అదే సెంటర్‌లో తాను ఆమరణ దీక్షకు దిగుతానని ముఖ్యమంత్రిని హెచ్చరించారు.

# గండిపేట భూ కుంభకోణం..

ఆదివారం నాడు విలేకరుల సమావేశంలో ఈ కేసుకు సంబంధించిన కీలక వివరాలను ఆయన వెల్లడించారు.డీసీపీ శ్రీనివాస్ వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ కుంభకోణంలో బొల్లా బ్రహ్మానాయుడి పాత్ర అత్యంత కీలకంగా ఉంది. గండిపేటలోని వివాదాస్పద భూమిని క్రమబద్ధీకరించినట్లుగా నకిలీ ప్రభుత్వ ఉత్తర్వు (జీవో) సృష్టించేందుకు, ప్రధాన నిందితుడైన రాధాకృష్ణకు బ్రహ్మానాయుడు రూ.4 కోట్లు చెల్లించినట్లు విచారణలో తేలిందని డీసీపీ తెలిపారు. ఈ లావాదేవీలన్నీ నగదు రూపంలోనే జరిగాయని, ఈ సొమ్ము ఎక్కడికి వెళ్లిందనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ కుట్రలో భాగంగా నిందితులు అత్యంత పకడ్బందీగా నకిలీ పత్రాలు సృష్టించారని, కలెక్టర్, సీసీఎల్ఏ కార్యాలయాల నుంచి అనుమతులు వచ్చినట్లు నకిలీ దస్త్రాలు, ఐఏఎస్ అధికారుల ఫోర్జరీ సంతకాలతో ఉత్తర్వులు తయారు చేశారని వివరించారు. గండిపేట తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి ఫిర్యాదు మేరకు ఈ కేసును నమోదు చేసినట్లు డీసీపీ తెలిపారు. వాట్సాప్ గ్రూపులలో నకిలీ జీవోలు సర్క్యులేట్ కావడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో ఇప్పటికే నిమ్మల రాజేష్ గౌడ్, నిమ్మల వేణుగోపాల్, నిమ్మల సాయికిరణ్‌లతో పాటు ప్రధాన నిందితుడు రాధాకృష్ణ, అతని డ్రైవర్ ప్రవీణ్ కుమార్‌ను అరెస్ట్ చేసినట్లు డీసీపీ వెల్లడించారు. ఇప్పటికే 9 కేసులలో నిందితుడిగా ఉన్న రాధాకృష్ణ నుంచి కందుకూరు, అంబర్‌పేట ప్రాంతాలకు చెందిన పలు భూముల పత్రాలను కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుల నుంచి నకిలీ జీవో కాపీలు, 13 నకిలీ స్టాంపులు, ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లు, చెక్‌బుక్కులు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. గండిపేటలోని సర్వే నంబర్ 18లో ఉన్న సుమారు 10 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు ఈ కుట్ర పన్నారు. దీని విలువ మార్కెట్ అంచనాల ప్రకారం రూ.1000 నుంచి రూ.1500 కోట్ల వరకు ఉంటుంది. ఇప్పటికే ఈ భూమికి సంబంధించిన యాజమాన్య హక్కుల పిటిషన్‌ను 2025లోనే హైకోర్టు కొట్టివేసినప్పటికీ, ఇంత విలువైన భూమిపై ఒప్పందాలు చేసుకోవడం అనుమానాలకు తావిస్తోందని డీసీపీ పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ కేసులో బొల్లా బ్రహ్మానాయుడు, బొల్లా రమేష్‌తో పాటు మరికొందరు పరారీలో ఉన్నారని, వారి కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నామని డీసీపీ శ్రీనివాస్ వివరించారు. నగదు రూపంలో జరిగిన కోట్ల రూపాయల లావాదేవీలపైనా దృష్టి సారించి, దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

# ఇరాన్‌తో డీల్‌పై ట్రంప్ వెనకడుగు..

ఇరాన్‌తో అణు ఒప్పందంపై తుది నిర్ణయం తీసుకునేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షతన వైట్‌హౌస్‌లో జరిగిన కీలక సమావేశం ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే ముగిసింది. సుమారు రెండు గంటల పాటు జరిగిన ఈ భేటీ నుంచి ట్రంప్ ఏ నిర్ణయం ప్రకటించకుండానే వెళ్ళిపోయారని అసోసియేటెడ్ ప్రెస్ (ఏపీ) పేర్కొంది. దీంతో ఇరు దేశాల మధ్య కుదిరిందని భావించిన తాత్కాలిక ఒప్పందం భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకున్నాయి.ఈ సమావేశానికి ముందు ట్రంప్ సోషల్ మీడియాలో స్పందిస్తూ, ఇరాన్‌తో ఒప్పందం జరగాలంటే కొన్ని కఠిన షరతులు విధించారు. సంఘర్షణల కారణంగా మూతపడిన హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవాలని, ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాన్ని తయారు చేయబోమని స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇరాన్ వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియంను తమకు అప్పగించాలన్నది కూడా తమ ప్రధాన షరతుల్లో ఒకటని ట్రంప్ స్పష్టం చేశారు. అయితే, అమెరికా పెడుతున్న ఈ షరతులను ఇరాన్ మొదటి నుంచి వ్యతిరేకిస్తోంది.ఒకవైపు చర్చల ప్రక్రియ కొనసాగుతుండగానే, అమెరికా తన కఠిన వైఖరిని ప్రదర్శించింది. ఒప్పందం కుదరకపోతే ఇరాన్‌పై మళ్లీ దాడులు ప్రారంభించడానికి తాము సిద్ధంగా ఉన్నామని అమెరికా యుద్ధ కార్యదర్శి పీట్ హెగ్సెత్ హెచ్చరించారు. సింగపూర్‌లో జరిగిన షాంగ్రీ–లా డైలాగ్‌లో ఆయన మాట్లాడుతూ.. "అవసరమైతే దాడులను పునఃప్రారంభించే సామర్థ్యం మాకుంది. మా ఆయుధ నిల్వలు అందుకు పూర్తిగా సిద్ధంగా ఉన్నాయి" అని వ్యాఖ్యానించారు. అధ్యక్షుడు ట్రంప్ ఒక మంచి ఒప్పందం కోరుకుంటున్నారని, కానీ ఇరాన్ అణు ఆశయాలను అరికట్టేలా అది ఉండాలని స్పష్టం చేశారు. మరోవైపు అమెరికా దౌత్యపరమైన హామీలపై తమకు నమ్మకం లేదని ఇరాన్ తెలిపింది. గతంలో చర్చలు జరుగుతున్నప్పుడే తమపై రెండుసార్లు దాడులు జరిగాయని గుర్తుచేసింది. ఇరాన్ రాయభారి మహమ్మద్ బఘేర్ ఖలీబాఫ్ మాట్లాడుతూ.. "మాకు హామీలు లేదా మాటలపై నమ్మకం లేదు, కేవలం చర్యలనే విశ్వసిస్తాం. చర్చల ద్వారా కాదు, క్షిపణుల ద్వారానే మాకు రాయితీలు లభిస్తాయి" అని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ మాజీ కమాండర్ మొహసెన్ రెజాయీ కూడా ట్రంప్ ఉద్దేశాలను అనుమానించారు. దౌత్యానికి ట్రంప్ మూడోసారి ద్రోహం చేస్తున్నారని, చర్చల పేరుతో ఇతర లక్ష్యాలను నెరవేర్చుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. ఈ పరిణామాలతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు మళ్లీ పెరిగాయి.

## బెంగాల్‌లో 35 ఏళ్ల నాటి సీన్ రిపీట్..

## అభిషేక్‌పై దాడితో టీఎంసీకి కొత్త ఊపు?

మూడున్నర దశాబ్దాల క్రితం తనపై జరిగిన దాడితో రాజకీయంగా ఉన్నత శిఖరాలకు చేరిన మమతా బెనర్జీకి.. ఇప్పుడు ఆమె మేనల్లుడు అభిషేక్ బెనర్జీపై జరిగిన దాడి మరో రాజకీయ పునరుజ్జీవానికి నాంది పలుకుతుందా? ఎన్నికల ఓటమి, అంతర్గత సంక్షోభంతో బలహీనపడిన తృణమూల్ కాంగ్రెస్‌కు (టీఎంసీ) ఇది కొత్త మలుపు అవుతుందా? అనే చర్చ బెంగాల్ రాజకీయాల్లో జోరుగా సాగుతోంది.పశ్చిమ బెంగాల్‌లో ఇటీవల జరిగిన ఎన్నికల తర్వాత సంక్షోభంలో ఉన్న టీఎంసీకి ఈ ఘటన పెను షాక్‌కు గురిచేసింది. మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మేనల్లుడు, ఎంపీ అభిషేక్ బెనర్జీపై కొందరు దుండగులు దాడికి పాల్పడ్డారు. లైవ్ కెమెరాల ముందే ఆయనపై రాళ్లు, కోడిగుడ్లతో విరుచుకుపడ్డారు. హెల్మెట్ ఉండటంతో ఆయన ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. ఆ తర్వాత అభిషేక్ వీల్‌చైర్‌పై ఆసుపత్రిలో ఉనన దృశ్యాలు రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపాయి.ఈ కష్టకాలంలో మమతా బెనర్జీకి 'ఇండియా' కూటమి నుంచి అనూహ్య మద్దతు లభించింది. గతంలోని రాజకీయ విభేదాలను పక్కనపెట్టి పలువురు జాతీయ నేతలు ఆమెకు సంఘీభావం తెలిపారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ స్వయంగా మమతకు ఫోన్ చేసి పరామర్శించారు. ఇది ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి అని ఖండించారు. అవసరమైతే అభిషేక్‌కు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించేందుకు తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా ఇది బీజేపీ కక్షసాధింపు రాజకీయాలకు నిదర్శనమని ఆరోపించారు. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ కోల్‌కతాకు వచ్చి మరీ మమతను పరామర్శించారు. అరవింద్ కేజ్రీవాల్, తేజస్వి యాదవ్ వంటి వారు కూడా మద్దతు ప్రకటించారు. 1990లో జరిగిన దాడి మమతను బెంగాల్‌లో తిరుగులేని శక్తిగా మార్చింది. ప్రస్తుతం పార్టీ సంక్షోభంలో ఉన్న తరుణంలో అభిషేక్‌పై జరిగిన ఈ దాడి, బలహీనపడిన టీఎంసీకి, ప్రతిపక్ష కూటమికి కొత్త ఊపునిస్తుందా లేదా అన్నది కాలమే తేల్చాలి.

## చంచల్‌గూడ జైలుకు బాల్క సుమన్

సింగరేణి కార్యాలయాలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కేసులో బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను పోలీసులు శనివారం అర్ధరాత్రి .... సింగరేణి కార్యాలయాలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కేసులో బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను పోలీసులు శనివారం అర్ధరాత్రి చంచల్‌గూడ జైలుకు తరలించారు. తెలంగాణ భవన్ వద్ద సుమన్‌ను నాంపల్లి పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. పోలీసుల విచారణ అనంతరం హిమాయత్‌నగర్‌లోని నాంపల్లి కోర్డు మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చారు. న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించడంతో బాల్క సుమన్‌ను భారీ బందోబస్తు మధ్య జైలుకు తరలించారు.

# ఫెర్టిలైజర్ యాప్‌తో విప్లవాత్మక మార్పు: తుమ్మల

ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ యాప్‌లోని రియల్ టైమ్ స్టాక్ విజిబిలిటీ, రైతు వారీ డిజిటల్ బుకింగ్, పంటల ఆధారిత ఎరువుల సరఫరా వ్యవస్థ లాంటి అంశాలను.. కేంద్ర ప్రభుత్వం అధ్యయనం చేసి డిజిటల్ వ్యవసాయ పరిపాలనకు శ్రీకారం చుట్టిందని తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. రైతుల ముసుగులో రాజకీయ ప్రేరేపిత ఆందోళనలకు ఈ యూరియా యాప్ చెక్ పెట్టిందని తెలిపారు.

# ఖరీదైన భూముల్లో ఎల్‌ఐజీ, ఎంఐజీ ఇళ్లు!

ఇప్పటికే 15 చోట్ల స్థలాలను కూడా గుర్తించారు. కూకట్‌పల్లిలో హౌసింగ్ బోర్డు పరిధిలో ఉన్న 80 ఎకరాల్లోని కొంత స్థలంలో అపార్ట్‌మెంట్లు నిర్మించాలని ప్రాథమికంగా నిర్ణయించారు. ఇది చాలా ఖరీదైన భూమి. ఈ భూమిలో ప్రభుత్వం ఎల్‌ఐజీ, ఎంఐజీ వర్గాలకు ఇళ్లను నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందిస్తోంది. ఇక్కడ ఎన్ని ఇళ్లు నిర్మించాలనేదానిపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. సమగ్ర ప్రాజెక్టు నివేదికను (డీపీఆర్) త్వరలోనే ప్రభుత్వానికి సమర్పించనున్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలోనూ అపార్ట్‌మెంట్ల నిర్మాణానికి అనువైన స్థలాన్ని అధికారులు ఇప్పటికే గుర్తించారు. అలాగే కుత్బుల్లాపూర్, బాచుపల్లి, అల్వాల్, ఇబ్రహీంపట్నం సహా మొత్తం 15 నియోజకవర్గాల్లో స్థలాలను గుర్తించారు. అవన్నీ హౌసింగ్ బోర్డు పరిధిలోనివేనని తెలిసింది. మిగిలిన నియోజకవర్గాల్లోనూ త్వరగా స్థలాలను గుర్తించాలని సంబంధిత కలెక్టర్లను ఆదేశించారు. మరోవైపు పైలట్ ప్రాజెక్టు కింద చేపట్టాలనుకున్న 12 వేల ఇళ్ల పనుల ప్రారంభానికీ త్వరలోనే చర్యలు తీసుకోనున్నట్లు తెలిసింది.

**అందుబాటు ధరల్లో ఉండేలా..** ఎల్‌ఐజీ, ఎంఐజీ వర్గాల వారికి అందుబాటు ధరల్లోఉండేలా ఇళ్లను నిర్మించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం 'సరసమైన ధరలకే పట్టణ గృహ కార్యక్రమాని'కి శ్రీకారం చుట్టింది. వాస్తవానికి ఫ్యూచర్‌సిటీ పరిధిలో, ఓఆర్‌ఆర్ దగ్గర్లో శాటిలైట్ టౌన్‌షిపలను ఏర్పాటు చేయాలని తొలుత భావించింది. తద్వారా ఆయా ప్రాంతాలకు భవిష్యత్తులో డిమాండ్ పెరుగుతుందని యోచించింది. కానీ, ప్రజలకు అనువుగా లేనిచోట, జీవనోపాధికి దూరంగా ఇళ్లను నిర్మించడంతో ఉపయోగం ఉండదని, అక్కడికి వెళ్లేందుకు ప్రజలు ఆసక్తి కనబర్చరన్న విషయాన్ని గత అనుభవాల దృష్ట్యా ప్రభుత్వం గుర్తించింది. జీహెచ్‌ఎంసీ పరిధిలోనే ఎల్‌ఐజీ, ఎంఐజీ వర్గాలకు ఇళ్లను నిర్మించాలని నిర్ణయించింది. ఉమ్మడి ఏపీలో కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు సహా ఇతర ప్రాంతాల్లో నిర్మించిన ఇళ్లను పరిగణనలోకి తీసుకుంది. హౌసింగ్ బోర్డు, దిల్, ఇతర భూముల్లో ఇళ్ల నిర్మాణాల కోసం ప్రభుత్వ–ప్రైవేటు భాగస్వామ్య విధానం, లేదా ప్రైవేటు, ప్రభుత్వ రంగ సంస్థలు, బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని నిర్మించడం, లబ్ధిదారులతో వాటాలు పెట్టించడం ఇలా పలు అంశాలపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుతం హౌసింగ్ బోర్డు పరిధిలో ఉన్న 598 ఎకరాల్లో ఎక్కడెక్కడ అపార్ట్‌మెంట్ల నిర్మాణాలకు అనువుగా ఉన్నాయన్నదానిపైనా తొధికారులు వివరాలు సేకరిస్తున్నారు.

**లాభనష్టాలు లేని విధానంలో ఇళ్లు..?** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎల్‌ఐజీ, ఎంఐజీ, హెచ్‌ఐజీ వర్గాలకు ఇళ్ల నిర్మాణాల కార్యక్రమం ప్రారంభమైనప్పటి నుంచి తెలంగాణ ఏర్పాటువరకు రాష్ట్రవ్యాప్తంగా 81,058 ఇళ్లు/ఫ్లాట్లు నిర్మించారు. వీటిలో ఎల్‌ఐజీ వర్గాల కోసమే దాదాపు 27,410 ఇళ్లను (250–400చ.అ.) నిర్మించగా, ఎంఐజీ కింద (400–650చ.అ.) 15,072; హెచ్‌ఐజీ కింద (800–1,400చ.అ.) 4,320 ఇళ్లను నిర్మించారు. రాజీవ్ గృహకల్ప కింద కూడా ఎల్‌ఐజీ కోసం 27,652 ఇళ్లను నిర్మించారు. ఇప్పుడు కూడా జీహెచ్‌ఎంసీ పరిధిలో ఎల్‌ఐజీ, ఎంఐజీ వర్గాల కోసం గుర్తించిన స్థలాల్లో అపార్ట్‌మెంట్లను నిర్మిస్తారు. ఎల్‌ఐజీ వారికి రాయితీలు ఇవ్వనున్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఎల్‌ఐజీ కింద నిర్మించిన అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాట్‌కు భూమి ధరను రద్దు చేసి, రూ.5లక్షలను రాయితీ కింద ఇస్తారు. అంటే ప్రభుత్వం ఎల్‌ఐజీ వారికినిర్ణయించిన ధరలో ఇవిపోనూ మిగిలిన ధరకు ఇంటిని సొంతం చేసుకోవచ్చు. ఎంఐజీ వర్గాలకు మాత్రం అపార్ట్‌మెంట్ల నిర్మాణాలు పూర్తయ్యాక నిర్మాణ ఖర్చును బట్టి ధరలను నిర్ణయించనున్నారు. అయితే వాటిని 'లాభనష్టాలు లేని' విధానంలోనే మధ్య ఆదాయ వర్గాలకు ఇవ్వనున్నట్లు తెలిసింది.

# కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం..

### ఘటనాస్థలిలోనే ఆరుగురు వలస కూలీలు మృతి

### 15 మందితో ప్రయాణిస్తున్న ఆటో పూర్తిగా ధ్వంసం

### కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. చిక్కబళ్లాపూర్ జిల్లా బాగేపల్లి పట్టణం సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగిన ఈ దుర్ఘటనలో ఆరుగురు వలస కూలీలు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో తొమ్మిది మందికి గాయాలయ్యాయి.వివరాల్లోకి వెళితే, పని ముగించుకుని సుమారు 15 మంది కూలీలు ఒక ఆటోలో ఇంటికి బయలుదేరారు. జాతీయ రహదారి 44పై గంగోత్రి పెట్రోల్ పంప్ వద్దకు రాగానే, వేగంగా వస్తున్న ఒక కంటైనర్ లారీ ఆటోను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు ఆటో పూర్తిగా నుజ్జునుజ్జయింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న వారిలో ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, సహాయక బృందాలు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. గాయపడిన వారిని వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. సామర్థ్యానికి మించి ఆటోలో ప్రయాణించడం, లారీ అతివేగమే ప్రమాదానికి ప్రధాన కారణాలని ప్రాథమికంగా భావిస్తున్నారు.

## ఈసారి కూడా వాళ్లదే కప్...

## ఐపీఎల్-2026 ఛాంపియన్ ఆర్సీబీ...

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్ విజేతగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) నిలిచింది. నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగిన హోరాహోరీ ఫైనల్‌లో గుజరాత్ టైటాన్స్‌పై 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి, వరుసగా రెండోసారి ఐపీఎల్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ (75 నాటౌట్; 42 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సర్లు) అద్భుతమైన అర్ధశతకంతో జట్టును ముందుండి నడిపించి విజయతీరాలకు చేర్చాడు.

156 పరుగుల లక్ష్య ఛేదనలో ఆర్సీబీకి అదిరిపోయే ఆరంభం లభించింది. ఓపెనర్లు విరాట్ కోహ్లీ, వెంకటేశ్ అయ్యర్ గుజరాత్ బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. ముఖ్యంగా కోహ్లీ, తన మణికట్టు మాయాజాలంతో అద్భుతమైన ఫ్లిక్స్, పుల్ షాట్లతో కగిసో రబాడ, మహ్మద్ సిరాజ్ బౌలింగ్‌ను చీల్చి చెండాడాడు. మరోవైపు, కుడి మోకాలి నొప్పితో బాధపడుతున్నప్పటికీ వెంకటేశ్ అయ్యర్ (16 బంతుల్లో 32) దూకుడుగా ఆడాడు. ఈ జోడీ కేవలం 21 బంతుల్లోనే 50 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి ఐపీఎల్ ఫైనల్స్‌లో సరికొత్త రికార్డు సృష్టించింది.అయితే, వెంకటేశ్ అయ్యర్, దేవదత్ పడిక్కల్ స్వల్ప వ్యవధిలో ఔటవడంతో ఆర్సీబీ కాస్త నెమ్మదించింది. రజత్ పాటిదార్ (14) కొన్ని చక్కటి షాట్లు ఆడినప్పటికీ, రషీద్ ఖాన్ ఒకే ఓవర్లో పటీదార్‌ను, కృనాల్ పాండ్యా (0)ను ఔట్ చేసి మ్యాచ్‌లో ఉత్కంఠ పెంచాడు. ఈ దశలో కండరాల నొప్పితో ఇబ్బంది పడుతున్నప్పటికీ కోహ్లీ ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. కేవలం 25 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేసుకుని జట్టుపై ఒత్తిడిని తగ్గించాడు. టిమ్ డేవిడ్ (11) కూడా త్వరగానే ఔటయినా, కోహ్లీ తన క్లాస్ ఆటతీరుతో జట్టును విజయతీరాలకు చేర్చాడు. 63 పరుగుల వద్ద శుభ్‌మన్ గిల్ పట్టిన డైవింగ్ క్యాచ్‌ను రీప్లేలలో బంతి నేలను తాకినట్లు తేలడంతో కోహ్లీకి లైఫ్ లభించింది. ఆ తర్వాత, అర్షద్ ఖాన్ వేసిన 18వ ఓవర్లో ఒక ఫోర్, ఒక సిక్సర్ బాది ఆర్సీబీకి ఘనవిజయాన్ని అందించాడు. అంతకుముందు, టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న ఆర్సీబీ, కట్టుదిట్టమైన బౌలింగ్‌తో గుజరాత్‌ను సాధారణ స్కోరుకే పరిమితం చేసింది. గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 155 పరుగులు మాత్రమే చేయగలిగింది. వాషింగ్టన్ సుందర్ (50 నాటౌట్; 37 బంతుల్లో) ఒంటరి పోరాటం చేసి అర్ధశతకంతో ఆదుకున్నాడు. ఆర్సీబీ బౌలర్లలో రసిఖ్ సలామ్ దార్ 3 వికెట్లతో సత్తా చాటగా, భువనేశ్వర్ కుమార్, జోష్ హేజిల్‌వుడ్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ఈ విజయంతో ఆర్సీబీ, ఆ జట్టు కెప్టెన్ రజత్ పటీదార్ అరుదైన ఘనత సొంతం చేసుకోవడం విశేషం. ఆర్సీబీ ఈ విజయంతో... వరుసగా రెండు ఐపీఎల్ టైటిళ్లు గెలిచిన చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్ జట్ల సరసన చేరింది.

# ఎస్ఐఆర్-2026ను పూర్తి ఖచ్చితత్వంతో నిర్వహించాలి





## అర్హులైన ప్రతి ఓటరికి ఓటు హక్కు కల్పించాలి
## ఓటర్ల జాబితా శుద్ధీకరణలో నిర్లక్ష్యానికి తావులేదు
## డూప్లికేట్, అనర్హ ఓటర్ల నమోదును అరికట్టాలి
## బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ పూర్తి చేయాలి
## క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారంలో పారదర్శకత పాటించాలి
## ఎస్ఐఆర్ ప్రక్రియపై ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలకు ఎన్నికల సంఘం దిశానిర్దేశం

**శ్రీశైలం మే 31(నంది పత్రిక) :-** ఓటర్ల జాబితా ఎన్నికల ప్రక్రియకు పునాదిగా నిలుస్తుందని, అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పిస్తూ అనర్హులు జాబితాలో చోటు చేసుకోకుండా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)-2026ను అత్యంత పారదర్శకంగా, ఖచ్చితత్వంతో నిర్వహించాలని భారత ఎన్నికల సంఘం కార్యదర్శులు సంతోష్ కుమార్ దూబే, నవీన్ కుమార్ లు సూచించారు. శనివారం శ్రీశైలంలో నంద్యాల, కర్నూలు, ప్రకాశం, కడప జిల్లాల ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలతో ప్రత్యేక సమగ్ర సవరణ (ా×=)-2026 అమలుకు సంబంధించిన సంసిద్ధత, కార్యాచరణ, ఫీల్డ్ స్థాయి విధివిధానాలపై సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎన్నికల సంఘం అండర్ సెక్రటరీ శీష్ రామ్, నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారత ఎన్నికల సంఘం కార్యదర్శి సంతోష్ కుమార్ దూబే మాట్లాడుతూ ఎన్నికల జాబితా శుద్ధీకరణ (జుశ్రీవష్శీటీఖుశ్రీ =శీశ్రీశ్రీ ాబతీఅటఅఝ్అశీఅ) నిరంతర ప్రక్రియ అని, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, బీఎల్ఓలు సమన్వయంతో పనిచేసి డూప్లికేట్, మరణించిన, వలస వెళ్లిన ఓటర్ల వివరాలను ఎప్పటికప్పుడు నవీకరించాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం -1951లోని సెక్షన్-21 ప్రకారం ఎన్నికల సంఘానికి ప్రత్యేక సంక్షిప్త సవరణ నిర్వహించే అధికారం ఉందని వివరించారు. ఓటరుగా నమోదు కావాలంటే భారతీయ పౌరుడై ఉండటంతో పాటు 18 సంవత్సరాల వయస్సు పూర్తై ఉండాలని, సాధారణ నివాసిగా ఉండాలని, చట్టపరంగా అనర్హతలు లేకుండా ఉండాలని స్పష్టం చేశారు. ఆధార్ కార్డు కేవలం గుర్తింపు పత్రంగా మాత్రమే పరిగణించబడుతుందని, దానిని చిరునామా లేదా పుట్టిన తేదీ రుజువుగా స్వీకరించరాదని తెలిపారు. త్వరలో ప్రారంభమయ్యే ఎన్యుమరేషన్ ప్రక్రియలో బీఎల్ఓలు ప్రతి ఇంటిని సందర్శించి ఫారాలు పంపిణీ చేయాలని, తాళం వేసి ఉన్న ఇళ్లను కనీసం మూడు సార్లు సందర్శించి సంబంధిత వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. ఓటరు అందుబాటులో లేని పరిస్థితుల్లో నిర్దేశిత విధానాలను పాటిస్తూ ఫోటో ఆధారాలు, సందర్శన వివరాలు నమోదు చేయాలన్నారు. ఎన్యుమరేషన్ ఫారాలు, ఫోటోలు, అనుబంధ పత్రాల సేకరణలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, లైవ్ ఫోటోలు సేకరించేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఫారాల స్కానింగ్ సమయంలో సంతకాలు, వివరాలు స్పష్టంగా ఉండేలా చూసుకోవాలని, నిర్లక్ష్యం వల్ల భవిష్యత్తులో వివాదాలు తలెత్తే అవకాశం ఉందన్నారు. ఓటర్ల జాబితాలో ఉన్న అనామలీలను గుర్తించి సరిదిద్దడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. డెమోగ్రాఫిక్ సిమిలారిటీ ఎంట్రీలు, బహుళ నమోదులు, తప్పు వివరాల నమోదు వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. బీఎల్ఓ యాప్, ఈఆర్ఓ లాగిన్‌లలో కనిపించే హెచ్చరికలను నిర్లక్ష్యం చేయకుండా పరిశీలించాలని ఆదేశించారు. డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా తయారీలో రేషనలైజేషన్ నిబంధనలను తప్పనిసరిగా అమలు చేయాలని, ఓటర్లు తమ పోలింగ్ కేంద్రానికి సమీపంలోనే ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఒకే కుటుంబ సభ్యుల పేర్లు ఒకే పోలింగ్ స్టేషన్ పరిధిలో ఉండేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారంలో న్యాయబద్ధత, పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. దరఖాస్తుల ఆమోదం లేదా తిరస్కరణ సమయంలో సరైన కారణాలు నమోదు చేయాలని, ప్రతి నిర్ణయం ఎన్నికల సంఘానికి సమర్పించే డిజిటల్ అఫిడవిట్‌తో సమానమని గుర్తుంచుకోవాలన్నారు. అర్హుడైన ఓటరు అనవసరంగా జాబితా వెలుపల ఉండకుండా, అనర్హుడు చొరబడకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. రాజకీయ పార్టీల బీఎల్ఏలతో తరచూ సమావేశాలు నిర్వహించి ప్రక్రియపై అవగాహన కల్పించాలని, ఏఎస్‌డీ (ూఎంవత్, ాష్టఅట్వ, ఀముఀ) జాబితాలను క్రమం తప్పకుండా పంచుకోవాలని సూచించారు. ఫామ్-6, 7, 8లతో పాటు క్లెయిమ్‌లు, అభ్యంతరాల వివరాలను నిబంధనల ప్రకారం ప్రజలకు అందుబాటులో ఉంచాలని తెలిపారు. భారత ఎన్నికల సంఘం మరో కార్యదర్శి నవీన్ కుమార్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియ దేశవ్యాప్తంగా విజయవంతంగా అమలవుతోందని, ఇప్పటివరకు దాదాపు 60 శాతం ఓటర్ల కవరేజీ పూర్తైందన్నారు. ఈ ప్రక్రియ ద్వారా ఎన్నికల జాబితాల నాణ్యత మెరుగుపడటంతో పాటు ఓటర్ల భాగస్వామ్యం కూడా పెరిగిందని చెప్పారు. ఫీల్డ్ స్థాయిలో ఎదురయ్యే సందేహాల నివృత్తికి ఎన్నికల సంఘం, జిల్లా ఎన్నికల అధికారులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియను చివరి రోజులకు వాయిదా వేయకుండా ప్రారంభ దశ నుంచే వేగవంతంగా చేపట్టాలని, అవసరమైతే రాజకీయ అనుబంధాలు లేని వాలంటీర్ల సహకారాన్ని వినియోగించుకోవచ్చని సూచించారు. ముందస్తుగా పనులు పూర్తి చేస్తే లోపాలను సరిదిద్దుకునేందుకు తగిన సమయం లభిస్తుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, శ్రీశైలం భూమిపై ఉన్న కైలాసంగా ప్రసిద్ధి చెందిన ఆధ్యాత్మిక క్షేత్రమని పేర్కొన్నారు. ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రతి బూత్ స్థాయి అధికారి (బీఎల్వో) ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారమ్‌ల పంపిణీ చేపట్టాలని ఆదేశించారు. ఒకే కుటుంబంలో ఉన్న ప్రతి ఓటరికి ప్రత్యేకంగా ఫారమ్ అందజేయాలని, అనంతరం వాటిని సేకరించి తప్పనిసరిగా డిజిటలైజ్ చేయాలని సూచించారు. ఫారమ్‌లపై ముందుగానే ఫోటో ముద్రించి ఉన్నప్పటికీ తాజా ఫోటోగ్రాఫ్‌ను తప్పనిసరిగా సేకరించాలని, ఫోటో అందుబాటులో లేని సందర్భాల్లో దీూం యాప్ ద్వారా మాత్రమే కొత్త ఫోటో తీసి నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ తెలిపారు. డిజిటలైజేషన్ సమయంలో సంబంధిత ఫోటోను ఎన్యూమరేషన్ ఫారమ్‌కు అనుసంధానం చేయాల్సి ఉంటుందని చెప్పారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో బీఎల్ఓలు, బూత్ స్థాయి ఏజెంట్లు పరస్పర సమన్వయంతో పనిచేయడం అత్యంత కీలకమని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలు వెంటనే బూత్ స్థాయి ఏజెంట్ల నియామకాన్ని పూర్తి చేయాలని సూచించారు. బూత్ స్థాయి ఏజెంట్ రోజుకు 50 వరకు ఎన్యూమరేషన్ ఫారమ్‌లను సమర్పించే అవకాశం ఉందని, దీనికి ఎటువంటి గరిష్ఠ పరిమితి లేదన్నారు. క్లెయిమ్‌లు, అభ్యంతరాల దశలో రోజుకు 10 చొప్పున దరఖాస్తులు సమర్పించవచ్చని, అయితే మొత్తం ప్రక్రియలో గరిష్ఠంగా 30 వరకు మాత్రమే అనుమతి ఉంటుందని వివరించారు. ప్రస్తుతం రెండు రాజకీయ పార్టీలు మాత్రమే బూత్ స్థాయి ఏజెంట్లను నియమించాయని తెలిపారు. రాష్ట్రంలోని చాలా జిల్లాల్లో ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ 70 నుంచి 75 శాతం వరకు పూర్తయిందని, మిగిలిన అన్‌మ్యాప్డ్ ఓటర్ల వివరాల కోసం భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన ధ్రువపత్రాలను తప్పనిసరిగా సేకరించాలని ఆదేశించారు. ఆధార్ కార్డు కేవలం గుర్తింపు పత్రంగా మాత్రమే పరిగణించబడుతుందని, అది నివాస ధ్రువీకరణ లేదా జనన తేదీ నిర్ధారణ పత్రంగా చెల్లదని స్పష్టం చేశారు. అందువల్ల అన్‌మ్యాప్డ్ ఓటర్ల నుంచి అవసరమైన అన్ని ఆధారాలను సేకరించి రికార్డులను పూర్తి చేయాలని సూచించారు. అర్హత కలిగిన ఒక్క ఓటరు కూడా జాబితా వెలుపల మిగిలిపోకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఎన్యూమరేషన్ ఫారమ్ తిరిగి అందిన తర్వాత మాత్రమే సంబంధిత ఓటరు పేరు ముసాయిదా ఓటర్ల జాబితాలో నమోదు చేయబడుతుందని జిల్లా కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో సంబంధిత జిల్లాల ఎన్నికల అధికారులు, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు తదితరులు పాల్గొన్నారు.





## లక్షల జీతం కంటే మనశ్శాంతే ముఖ్యమని ఐటీ ఉద్యోగానికి గుడ్‌బై.. ఆటో డ్రైవర్‌గా కొత్త జీవితం!

### నంది న్యూస్ ప్రత్యేక కథనం




**నంద్యాల, మే 31, ( నంది పత్రిక)**ఈరోజుల్లో ఐటీ ఉద్యోగం అంటే లక్షల జీతం, ఎయిర్ కండిషన్డ్ ఆఫీసులు, విలాసవంతమైన జీవితం అనే భావన చాలా మందిలో ఉంది. కానీ ఆ మెరుపుల వెనక ఉన్న ఒత్తిడి, టార్గెట్లు, రాత్రింబవళ్లు పని చేసే పరిస్థితులు ఎంతమందిని మానసికంగా అలసటకు గురి చేస్తున్నాయో తాజాగా వెలుగులోకి వస్తున్న సంఘటనలు చెబుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లోనే బెంగళూరుకు చెందిన ఓ మహిళ ధైర్యవంతమైన నిర్ణయం తీసుకుంది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని పూర్తిగా వదిలేసి ఆటో డ్రైవర్‌గా మారింది. ప్రస్తుతం ఆమెకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.ఆమె చెప్పిన వివరాల ప్రకారం.. ఐటీ రంగంలో మంచి జీతం వచ్చినా, మానసిక ప్రశాంతత మాత్రం దొరకలేదని తెలిపింది. రోజుకు గంటల తరబడి కంప్యూటర్ ముందు కూర్చోవడం, నిరంతర ఒత్తిడి, టార్గెట్లు, మీటింగ్స్ వల్ల తీవ్ర మానసిక అలసటకు గురయ్యానని పేర్కొంది. దీంతో తన జీవితాన్ని తాను నియంత్రించుకునేలా కొత్త మార్గాన్ని ఎంచుకుందట.ఇప్పుడు ఆమె బెంగళూరు నగరంలో ఆటో నడుపుతూ తనకు నచ్చిన సమయాల్లో పని చేస్తోంది. ముఖ్యంగా యాప్ ఆధారిత ఆటో సర్వీసుల ద్వారా ప్రయాణికులను తీసుకెళ్తూ నెలకు రూ.60 వేలకుపైగా సంపాదిస్తున్నట్లు వీడియోలో వెల్లడించింది. "కార్పొరేట్ ఉద్యోగంలో డబ్బు ఉన్నా ఆనందం లేదు. ఇప్పుడు శారీరకంగా అలసట ఉన్నా మానసికంగా ఎంతో ప్రశాంతంగా ఉన్నాను" అని ఆమె చెప్పిన మాటలు నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి.ఈ ఘటనపై సోషల్ మీడియాలో విభిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ఆమె ధైర్యాన్ని ప్రశంసిస్తుంటే, మరికొందరు ఐటీ రంగంలో పెరుగుతున్న ఒత్తిడిపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల చాలా మంది యువత 'వర్క్-లైఫ్ బ్యాలెన్స్' కోసం సంప్రదాయ ఉద్యోగాలను వదిలి తమకు ఇష్టమైన రంగాల్లోకి అడుగుపెడుతున్నారు.ప్రత్యేకంగా బెంగళూరు వంటి ఐటీ నగరాల్లో మానసిక ఒత్తిడి, బర్నౌట్ సమస్యలు పెరుగుతున్నాయని పలువురు నిపుణులు చెబుతున్నారు. అధిక జీతాల కంటే ఆరోగ్యం, కుటుంబంతో గడిపే సమయం, మనశ్శాంతి ముఖ్యమనే భావన యువతలో పెరుగుతోందని వారు అభిప్రాయపడుతున్నారు.ఈ మహిళ తీసుకున్న నిర్ణయం సమాజానికి ఒక కొత్త సందేశాన్ని ఇస్తోంది. "జీతం మాత్రమే కాదుడ మనసుకు నచ్చిన జీవితం కూడా ముఖ్యమే" అని ఆమె కథ చెబుతోంది.

# భారీ వర్షాల నేపథ్యంలో విద్యుత్ శాఖ అప్రమత్తం

### విద్యుత్ సరఫరా పర్యవేక్షణకు నోడల్ ఆఫీసర్లు
### డివిజన్ల స్థాయిలో కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు
### ఎపిఎస్పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి



**నంద్యాల, మే 30 ( నంది పత్రిక):** ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలోని కొన్ని జిల్లాల్లో బలమైన గాలి, వర్షం కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వుండాలని ఎపిఎస్పిడిసిఎల్ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బలమైన గాలి, వర్షం కురుస్తున్న నేపథ్యంలో ఎపిఎస్పిడిసిఎల్ అధికారులు, సిబ్బంది ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిన సందర్భాల్లో విద్యుత్ పునరుద్ధరణ పనుల పర్యవేక్షణకు ఒక్కో జిల్లాకు చీఫ్ జనరల్ మేనేజర్ స్థాయి అధికారిని నోడల్ ఆఫీసరుగా నియమించినట్లు తెలిపారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు అవసరమైన డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ ఫార్మర్లు, కండక్టర్, విద్యుత్ స్తంభాలు తదితర పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. సంస్థ పరిధిలో సర్కిల్స్, డివిజన్స్ స్థాయిల్లో కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గాలి, వర్షం ప్రభావిత ప్రాంతాల్లో సరఫరా పునరుద్ధరణ పనులను వేగవంతం చేయడం కోసం అధికారులు/సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందాలు అందుబాటులో వుండాలన్నారు. వర్షం కురుస్తున్న సందర్భాల్లో ప్రజలు విద్యుత్ స్తంభాలను తాకవద్దని, లైన్ల కింద నిల్చోవద్దని సూచించారు. ఎక్కడైనా విద్యుత్ స్తంభాలు కూలిపోవడం, లైన్లు తెగిపడడంలాంటి సంఘటనలను గుర్తించినట్లయితే తక్షణమే సమీపంలోని విద్యుత్ శాఖ అధికారులు/సిబ్బందికిగానీ, విద్యుత్ బిల్లుపై ముద్రించబడిన తమ ప్రాంత అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నంబరుకు గానీ లేదా టోల్ ఫ్రీ నంబర్లు: 1912 లేదా 1800 425 155333కు కాల్ చేసి సమాచారం అందించాలని సూచించారు. అదేవిధంగా సంస్థ వాట్సాప్ నంబరు: 91333 31912కు చాట్ చేయడం ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చని సూచించారు.

# అహల్య భాయి హోల్కర్ జయంతి వేడుకలు.



**బేతంచెర్ల మే 31 ( నందిపత్రిక ).** మహారాష్ట్రలోని మాల్వా ప్రాంతాన్ని సుదీర్ఘకాలం పరిపాలించిన అహల్య భాయి హోల్కర్ జయంతి వేడుకలు భారతీయ జనతా పార్టీ బేతంచెర్ల మండల అధ్యక్షులు రమేష్ బాబు, ఆంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నాగమోహన్ అహల్య భాయి వారి గురించి మహిళల హక్కుల కోసం , వితంతు వివాహాల కోసం,హిందూ దేవాలయాల పునరుద్ధరణ కోసం పాటుపడిన మహిళా మూర్తి అని వారి సేవలను కొనియాడారు. అలానే ఈ దేశ మహిళలందరూ వీరి జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని, రాబోయే రోజుల్లో ఈ దేశ ధర్మాల కోసం తమ వంతు చేయూత నివ్వలని పిలుపునిచ్చారు. ఉన్నం మనోహర్, జీవన్ చౌదరి, ప్రధాన కార్యదర్శులు లక్ష్మీనారాయణ, కోట్ల హరికృష్ణ, హరి,రవి శంకర్ నాయుడు మైనారిటీ మోర్చా నూర్ అహ్మద్, లక్ష్మీనారాయణ, కోట్ల హరికృష్ణ, రవికుమార్, ఎస్సీ మోర్చా పట్టణ అధ్యక్షుడు ఎల్లయ్య రాజు, అనిల్ కుమార్, యువ మోర్చా జిల్లా కార్యదర్శి వసంత్, ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడు లెక్చరర్ రవికుమార్, మురళి శెట్టి, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి అనిల్, రామాంజనేయులు, రామకృష్ణ, మధు తదితరులు పాల్గొని పుష్పాంజలి ఘటించారు.



# నంద్యాల ప్రజలకు శుభవార్త ఉత్తర భారత ప్రయాణాలకు ప్రత్యేక రైలు సౌకర్యం

**నంద్యాల ప్రతినిధి. మే 31. (నంది పత్రిక ):**నంద్యాల ప్రజలకు, ముఖ్యంగా ఉత్తర భారతదేశ ప్రయాణికులకు దక్షిణ మధ్య రైల్వే ద్వారా ఒక ముఖ్యమైన ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. వేసవి కాలంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దానాపూర్ బెంగళూరు (సర్ ఎం. విశ్వేశ్వరయ్య టెర్మినల్) దానాపూర్ ప్రత్యేక సూపర్ ఫాస్ట్ రైలు (ట్రైన్ .03251/03252) ను రేపటి నుండి 45 రోజుల పాటు ప్రతిరోజూ నడపనున్నట్లు రైల్వే శాఖ ప్రకటించింది.ఈ ప్రత్యేక రైలు 01 జూన్ 2026 నుండి 15 జూలై 2026 వరకు దానాపూర్ నుండి, అలాగే 03 జూన్ 2026 నుండి 17 జూలై 2026 వరకు బెంగళూరు నుండి నడుస్తుంది.

ఈ రైలు నంద్యాల (నంద్యాల) రైల్వే స్టేషన్‌లో ఆగడం నంద్యాల మరియు పరిసర ప్రాంత ప్రజలకు ఒక గొప్ప ప్రయోజనంగా నిలుస్తుంది.నంద్యాలలో రైలు సమయాలు: c 03251 దానాపూర్ బెంగళూరు ప్రత్యేక రైలు.నంద్యాల చేరిక : ఉదయం 04:38 గంటలకు

నంద్యాల బయలుదేరు : ఉదయం 04:40 గంటలకు

03252 బెంగళూరు దానాపూర్ ప్రత్యేక రైలు

నంద్యాల చేరిక : ఉదయం 08:30 గంటలకు.నంద్యాల బయలుదేరు : ఉదయం 08:32 గంటలకు.నంద్యాల ప్రజలకు ఈ రైలు ఎందుకు ఎంతో ఉపయోగకరం?ఇప్పటివరకు నంద్యాల నుండి ఉత్తర భారతదేశంలోని ప్రధాన నగరాలకు నేరుగా లేదా సులభ కనెక్షన్లతో ప్రయాణించే అవకాశాలు పరిమితంగా ఉండేవి. ఈ ప్రత్యేక రైలు ప్రారంభంతో ఉత్తర భారత యాత్రలు మరింత సులభం కానున్నాయి.ఈ రైలు ద్వారా ప్రయాణికులు క్రింది ముఖ్య ప్రాంతాలకు చేరుకోవచ్చు:

ప్రయాగ్‌రాజ్ (ప్రయాగ్రజ్ / అలహాబాద్ ప్రాంతం)

పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ్ జంక్షన్ (మొఘల్‌సరాయి డిడియూ )

పాట్నా దానాపూర్ ప్రాంతం

బీహార్ రాష్ట్రంలోని పలు ప్రాంతాలు

ఉత్తర భారత రైళ్లకు ముఖ్య జంక్షన్లు.

ప్రత్యేకంగా కాశీ/వారణాసి యాత్రికులకు ఈ రైలు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఈ రైలు డిడియూ (మొఘల్‌సరాయి జంక్షన్) వరకు వెళ్తుంది. అక్కడి నుండి వారణాసి నగరం చాలా సమీపంలో ఉండడంతో, నంద్యాల ప్రజలు సులభంగా కాశీ విశ్వనాథ్ దర్శనం, గంగాస్నానం, మరియు ఉత్తర భారత ఆధ్యాత్మిక యాత్రలు చేయగలరు.అదేవిధంగా:

కాశీ వారణాసి

గయా

పాట్నా సాహిబ్

బోధ్ గయా

అయోధ్య, లక్నో తదితర ప్రాంతాలకు కనెక్టివిటీ పొందే అవకాశాలు పెరుగుతాయి.




ఈ రైలు బెంగళూరు నంద్యాల విజయవాడ నాగపూర్ జబల్‌పూర్ ప్రయాగ్‌రాజ్ దానాపూర్ మార్గంలో నడవడం వల్ల ఉద్యోగ, విద్య, వ్యాపార మరియు వైద్య ప్రయాణాలకు కూడా ఇది ఎంతో ప్రయోజనకరంగా మారనుంది.

నంద్యాల ప్రజలకు విజ్ఞప్తి

ఈ ప్రత్యేక రైలు సౌకర్యాన్ని నంద్యాల మరియు రాయలసీమ ప్రాంత ప్రజలు విస్తృతంగా వినియోగించుకోవాలని కోరుతున్నాము. ఉత్తర భారత యాత్రలు, పుణ్యక్షేత్ర సందర్శనలు, కుటుంబ మరియు ఉద్యోగ ప్రయాణాలకు ఇది ఒక మంచి అవకాశంగా నిలుస్తుంది.

# పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదల కోసమే కార్పొరేట్ స్థాయి ఉచిత వైద్య శిబిరం





## విజయవంతంగా 68వ పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి మెగా వైద్య శిబిరం..

**నంద్యాల సిటీ బ్యూరో మే 31 ( నంది పత్రిక )** పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదల కోసమే కార్పొరేట్ స్థాయి ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు శ్రీ గురు రాఘవేంద్ర విద్యా సంస్థల డైరెక్టర్ పెద్దిరెడ్డి మౌలాలి రెడ్డి పేర్కొన్నారు. పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి చారిటబుల్ సొసైటి ఆధ్వర్యంలో పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ప్రజా వైద్యశాలలో నిర్వహించిన 68వ మెగా వైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది. కోవెలకుంట్ల తాలూకా సంజామల మండలం మంగపల్లె గ్రామంలో శ్రీ గురు రాఘవేంద్ర విద్యా సంస్థల అధినేత డాక్టర్ పి దస్తగిరి రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని శ్రీ గురు రాఘవేంద్ర విద్యా సంస్థల డైరెక్టర్ పెద్దిరెడ్డి మౌలాలి రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు ఆరోగ్యాన్ని అందించేందుకే పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతినెల వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. తన తండ్రి పెద్దిరెడ్డి దస్తగిరి రెడ్డి పదకరాల పొలంలో పెద్దిరెడ్డి ట్రస్ట్ తరఫున ప్రజా వైద్యశాలను నిర్మించి అక్కడ పేదలకు వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రతినెల చివరి ఆదివారం రోజున పేదలకు వైద్య శిబిరంతో పాటు ఉచితంగా మందులు అందిస్తున్నట్లు తెలిపారు. ఉచిత వైద్య శిబిరంలో పాల్గొనే ప్రతి ఒక్కరికి తమ సొంత ఖర్చులతో ఉచితంగా భోజన వసతిని కల్పిస్తూ మంగపల్లె గ్రామంలోని ప్రజల సంక్షేమానికి పాటుపడుతున్నారని ఆయన చేస్తున్న సేవలే మాకు శ్రీరామరక్ష అన్నారు. 65వ మెగా వైద్య శిబిరంలో 1000 మంది రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు డైరెక్టర్ మౌలాలి రెడ్డి వెల్లడించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో గుండె జబ్బులు, బిపి, షుగరు , మోకాళ్ళ నొప్పులు, కంటివ్యాదులు, ఊపిరితిత్తుల వ్యాధులు, స్త్రీలకు సంబందించిన వ్యాదులు, చెవి, ముక్కు, గొంతుకు సంబందించిన జబ్బులకు, దంతవ్యాదులు, చర్మవ్యాదులకు వైద్యసేవలు చేసి మందులను ఇస్తున్నామని తెలియజేశారు. కోవెలకుంట్ల సంజామల మండలం పరిసర ప్రాంతం ప్రజలందరూ శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు చేసుకున్నారు.





# వైద్య వ్యాపారీకరణ మంటగలుస్తున్న మానవత్వం

**నంది పత్రిక:**ఆధునిక సమాజంలో వైద్యరంగం తన మానవీయ కోణాన్ని కోల్పోయి, లాభార్జనే పరమావధిగా సాగుతున్న వ్యాపారంగా మారడం అత్యంత దురదృష్టకరం.ఒకప్పుడు "హిపోక్రటీస్ ప్రమాణం" సాక్షిగా, కులమతాలకు, ఆర్థిక స్థితిగతులకు అతీతంగా ప్రాణరక్షణే ఏకైక లక్ష్యంగా సాగిన పవిత్ర వైద్యవృత్తి, నేడు కార్పొరేట్ శక్తులు, బీమా కంపెనీలు, ఔషధ దిగ్గజాల లాభాపేక్ష మధ్య నలిగిపోతోంది.ఈధనవ్యామోహం వల్ల ఆరోగ్యం అనేది పౌరుడి "ప్రాథమిక హక్కు" స్థాయి నుండి, కొనుగోలుచేయాల్సిన "విలాసవంతమైన వస్తువు"గా దిగజారింది.ఫలితంగా సమాజంలో ఆరోగ్య అసమానతలు తీవ్ర రూపం దాలుస్తున్నాయి. వ్యవస్థాగత లోపాలు వ్యాపారీకరణకు ప్రధాన కారణాలు:వైద్యరంగం ఈ స్థాయిలో వాణిజ్యమయం కావడానికి కేవలం ఆసుపత్రులే కాదు, సమాజంలోని వ్యవస్థాగత లోపాలు కూడా కారణం. ప్రైవేటీకరణ పడగలు:ప్రజారోగ్య పరిరక్షణ బాధ్యతను ప్రభుత్వాలు క్రమంగా విస్మరించి, ప్రైవేట్ రంగానికి పగ్గాలు అప్పగించడం ప్రధాన లోపం. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతులు, నిపుణులైన వైద్యుల కొరత వల్ల సామాన్యుడు సైతం అప్పులు చేసి ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొంది. కమీషన్ల సంస్కృతి లక్ష్యాలులి:అత్యాధునిక సాంకేతికత (ఎమ్ఆర్ఐ, సిటి స్కాన్లు) పేరిట నేడు రోగులను నిలువుదోపిడీ చేస్తున్నారు.కార్పొరేట్ యాజమాన్యాలు వైద్యులకు నెలవారీ లక్ష్యాలు విధించడంతో, అనవసర ల్యాబ్ పరీక్షలు, మితిమీరిన ఔషధాల సిఫార్సులు, అవసరం లేకున్నా ఐసియూ బెడ్లపై ఉంచడం సర్వసాధారణమైంది.చిన్న ఆసుపత్రుల నుండి బహుళజాతి కార్పొరేట్ వైద్యశాలల వరకు 'లాభమే' ప్రథమ ప్రాధాన్యమైంది.

**వైద్య విద్య వ్యయాలు:** నేడు ప్రైవేట్ కళాశాలల్లో వైద్య విద్య (ఎంబీబీఎస్, ఎండీ) అభ్యసించాలంటే కోట్లాది రూపాయల విరాళాలు, శుల్కాలు చెల్లించాల్సి వస్తోంది. అంత పెట్టుబడి పెట్టి చదివిన అభ్యర్థులు, వృత్తిలోకి రాగానే ఆ మొత్తాన్ని వసూలు చేసుకోవాలనే ఒత్తిడితో వ్యాపార ధోరణిని అలవరచుకుంటున్నారు.

**ఫార్మా - డాక్టర్ నెట్‌వర్క్:**

ఔషధ కంపెనీలు తమ బ్రాండ్లను ప్రచారం చేయడానికి వైద్యులకు విదేశీ పర్యటనలు, ఖరీదైన బహుమతులు అందిస్తాయి. దానికి ప్రతిఫలంగా వైద్యులు జనరిక్ మందులకు బదులు అత్యంత ఖరీదైన బ్రాండెడ్ మందులను రాయడం రోగుల పాలిట శాపంగా మారింది.

**విపత్తుల్లో దోపిడీ:**

కోవిడ్-19 సంక్షోభ సమయంలో ప్రాణవాయువు, అత్యవసర మందులు (రెమ్‌డెసివిర్), ఆసుపత్రి పడకల ధరలను ఆకాశానికంటించి, శవాల మీద పైసలు ఏరుకున్న చందంగా వ్యవహరించడం ఈ వ్యాపార మనస్తత్వానికి పరాకాష్ఠ.

సమాజంపై తీవ్ర ప్రభావం

ఈ వికృత ధోరణి వల్ల సమాజం కోలుకోలేని విధంగా దెబ్బతింటోంది:

డాక్టర్-రోగి మధ్య ఉండాల్సిన పవిత్రమైన "విశ్వాసం" నేడు కేవలం ఒక "ఆర్థిక లావాదేవీ"గా దిగజారింది. దేవుడిగా భావించాల్సిన వైద్యుడిని నేడు సమాజం ఒక వ్యాపారిగా చూసే దుస్థితి దాపురించింది.

ఆర్థిక పతనం:

మధ్యతరగతి, పేద కుటుంబాల్లో ఒకరికి పెద్ద జబ్బు సోకితే ఆ కుటుంబం మొత్తం రోడ్డున పడుతోంది. కేవలం వైద్య ఖర్చుల వల్ల భారతదేశంలో ఏటా లక్షలాది కుటుంబాలు దారిద్ర్యరేఖకు దిగువకు జారిపోతున్నాయని నివేదికలు చెబుతున్నాయి.

**చికిత్సకు దూరం:**

ఖర్చులకు భయపడి రోగాలను దాచుకుని, చివరి దశలో ప్రాణాలు కోల్పోతున్న అభాగ్యులు ఎందరో ఉన్నారు.

లినాణేనికి మరోవైపు (సానుకూల అంశాలు)లిఈ వ్యాపారీకరణ లేదా పెట్టుబడిదారీ విధానం వెనుక ఉన్న పెట్టుబడుల వల్లే వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులుచోటుచేసుకున్నాయనది కూడావాస్తవం.పారిశ్రామికీకరణ వల్లే ప్రపంచ స్థాయి కార్పొరేట్ ఆసుపత్రులు, అత్యాధునిక శస్త్రచికిత్సా పరికరాలు అందుబాటులోకి వచ్చాయి.కొత్త ఔషధాల ఆవిష్కరణ, సంక్లిష్ట అవయవ మార్పిడి చికిత్సలు, రోబోటిక్ సర్జరీలు, క్యాన్సర్ పరిశోధనలు అంతర్జాతీయ స్థాయిలో వేగంగా విస్తరిస్తున్నాయి.

అయితే, ఈ ప్రయోజనాలు ఎంత అద్భుతంగా ఉన్నప్పటికీ, ఇవి కేవలం ధనవంతులకే పరిమితమై, సామాన్యుడికి అందనంత ఎత్తులో ఉన్నప్పుడు ఆ శాస్త్ర సాంకేతిక ప్రగతికి అర్థం లేదు.లిఈ దుస్థితిని మార్చే పరిష్కార మార్గాలులివైద్యరంగాన్ని మళ్లీ మానవీయ పథంలోకి తీసుకురావడానికి తక్షణమే కింది చర్యలు చేపట్టాలి:ప్రైవేట్ ఆసుపత్రుల దోపిడీని, శుల్కాలను అరికట్టడానికి ప్రభుత్వాలు కఠిన చట్టాలు చేయాలి. చికిత్సల, ల్యాబ్ పరీక్షల ధరలను ప్రభుత్వం నియంత్రించాలి. జిడిపిలో ప్రజారోగ్యానికి కేటాయింపులను కనీసం 3% నుండి 5%కి పెంచాలి. తద్వారా ప్రభుత్వ ఆసుపత్రులను కార్పొరేట్ స్థాయికి బలోపేతం చేయవచ్చు.ఆయుష్మాన్ భారత్', రాష్ట్ర ప్రభుత్వాల ఆరోగ్య పథకాలను (ఆరోగ్యశ్రీ వంటివి) మరింత బలోపేతం చేయాలి. లోపాలు లేకుండా ప్రతి పౌరుడికీ ఉచిత, నాణ్యమైన వైద్యం అందేలా చూడాలి.జన ఔషధి' కేంద్రాలను విస్తృతంగా అందుబాటులోకి తెచ్చి, వైద్యులు కేవలం జనరిక్ పేర్లనే ప్రిస్క్రిప్షన్‌పై రాసేలా కఠిన నిబంధనలు అమలు చేయాలి. వైద్య విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు వృత్తిపరమైన నైతిక విలువలను (మెడికల్ ఈతిక్స్) తప్పనిసరిగా బోధించాలి.

లాభాపేక్షలేని స్వచ్ఛంద, మిషనరీ వైద్య నమూనాలను ప్రభుత్వాలు ప్రోత్సహించాలి.వైద్యం జీవనోపాధి కోసం చేసే వృత్తి కావచ్చు, కానీ అది మానవత్వాన్ని బలితీసుకునే క్రూర వ్యాపారంగా మారకూడదు. లాభాల మోజుతో మనుషుల ప్రాణాలను, శవాలను పణంగా పెడితే సమాజ మనుగడకే ప్రమాదం.వైద్యులను భగవంతుని స్వరూపంగా చూసే సంస్కృతి మనది. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత వైద్య సమాజంపై, వ్యవస్థను చక్కదిద్దాల్సిన బాధ్యత పాలకులపై ఉంది. కార్పొరేట్ శక్తులు విసురుతున్న "లక్షల బిల్లుల" చక్రవ్యూహం నుండి సామాన్య మానవుడు ఎప్పుడు విముక్తి పొందుతాడనేది నేటికీ మిగిలి ఉన్న మిలియన్ డాలర్ల ప్రశ్న. దీనికి సమాధానం ప్రభుత్వాల చిత్తశుద్ధిలోనే ఉంది.మీ రాము కోలా దెందుకూరు ఖమ్మం.

# కాంటోమెంట్ ను మున్సిపల్ పరిధిలో విలీనం చేయాలి.

కంటోన్మెంట్‌ను మున్సిపల్ పరిధిలో విలీనం చేయాలనే డిమాండ్‌తో గత కొన్ని రోజులుగా జేఏసీ అధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఉద్యమం నేతలు మీడియాకు తెలిపారు.ఈ ఉద్యమంలో భాగంగా, ప్రజల అభిప్రాయాలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు ఆదివారం పోస్ట్‌కార్డ్ ల ద్వారా ఉద్యమాన్ని కొనసాగించామని తెలిపారు.ఈ కార్యక్రమంలో 8వ వార్డు నాయకులు శ్యాంరెడ్డి అధ్వర్యంలో స్థానిక ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని తమ మద్దతును తెలియజేశారు. అలాగే 7వ వార్డు బంజారా కాలనీకి చెందిన వై.వి.రావు,ఐబీఓ కాలనీ సెక్రటరీ బి.భిక్షపతి ప్రజల అభిప్రాయాలను సేకరించి ఈ ఉద్యమానికి సహకరించారు. కంటోన్మెంట్ విలీనం అంశంపై ప్రజల ఆకాంక్షలను తెలియజేస్తూ ప్రధాన మంత్రికి,రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కు ఉద్దేశించి పోస్ట్‌కార్డులను ఆదివారం తిరుమలగిరి పోస్టాఫీస్‌లో పోస్టు చేయడం జరిగిందని ప్రజల హక్కుల సాధన కోసం, కంటోన్మెంట్ విలీనం జరిగే వరకు జేఏసీ అధ్వర్యంలో ఈ ఉద్యమాన్ని మరింత ఉత్సాహంగా కొనసాగిస్తామని కొంటోమెంటు జెఏసి కన్వీనర్ శ్రీనివాసరెడ్డి అన్నారు.



## డోన్‌లో ఘనంగా ఉచిత శిక్షణ ఫెన్సింగ్ సమ్మర్ క్యాంప్ నిర్వహణ



**డోన్ . మే 31. (నంది పత్రిక ):**డోన్ పట్టణంలో నిర్వహించిన ఫెన్సింగ్ సమ్మర్ క్యాంప్ ఉచిత శిక్షణ కార్యక్రమం ముగింపు వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, సీఐ రాకేష్ కుమార్ మరియు లెక్చరర్ యం. రామన్న హాజరయ్యారు.ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు మాట్లాడుతూ క్రీడల అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు.సీఐ రాకేష్ కుమార్ మాట్లాడుతూ పిల్లలు ఇంట్లో ఖాళీగా ఉండడం వల్ల మొబైల్ ఫోన్లకు అలవాటు పడుతున్నారని, అందువల్ల వారిని క్రీడల వైపు ప్రోత్సహించి గ్రౌండ్‌లో సమయం గడిపేలా చూడాలని సూచించారు. దీని ద్వారా పిల్లల్లో మానసిక పరిపక్వత, క్రమశిక్షణ పెరుగుతాయని తెలిపారు.లెక్చరర్ యం. రామన్న మాట్లాడుతూ చిన్నారులు క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక పరిపక్వత పెరిగి, భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోగలరని అన్నారు.ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ ఉచిత శిక్షణా కార్యక్రమంలో కోచ్ దత్త మునిస్వామి విద్యార్థులకు సమర్థవంతమైన శిక్షణ అందించి విజయవంతంగా పూర్తి చేశారు. ఇందుకు డోన్ పట్టణ ప్రజలు ఆయనకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.అలాగే ఇటీవల నిర్వహించిన ఫెన్సింగ్ స్కేటింగ్ పోటీలలో విజయం సాధించిన విద్యార్థులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా మెడల్స్ మరియు సర్టిఫికెట్లు అందజేశారు.ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు సుధాకర్, అశోక్, మధుశేఖర్, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## నేడు పిజిఆర్ఎస్



**నంద్యాల బ్యూరో , మే 31(నంది పత్రిక):-** జిల్లా ప్రజల సమస్యల వేగవంతంగా పరిష్కరించి, ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో నేడు (సోమవారం)న జిల్లా వ్యాప్తంగా "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం నంద్యాల జిల్లా కలెక్టరేట్‌తో పాటు అన్ని రెవెన్యూ డివిజన్ కేంద్రాలు, మండల కార్యాలయాలు మరియు మున్సిపల్ కార్యాలయాల్లో ఒకేసారి నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. ప్రస్తుత వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని కార్యక్రమ సమయాన్ని ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంటల వరకు నిర్ణయించినట్లు తెలిపారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను నేరుగా సమర్పించడంతో పాటు, వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా నమోదు చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. అదేవిధంగా, దాఖలు చేసిన అర్జీల పరిష్కార స్థితిని అదే వెబ్‌సైట్‌లో లేదా టోల్ ఫ్రీ నంబర్ 1100 ద్వారా తెలుసుకోవచ్చన్నారు. అర్జీదారులు ముందుగా తమకు సంబంధించిన మండల, డివిజన్ లేదా మున్సిపల్ స్థాయి కార్యాలయాల్లో అధికారులకు వినతులు సమర్పించాలని, అక్కడ పరిష్కారం కాని సమస్యలనే జిల్లా స్థాయి వేదికకు తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. జిల్లా కేంద్రంలో ఉదయం 9:30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి సంబంధిత శాఖల జిల్లా స్థాయి అధికారులందరూ తప్పనిసరిగా హాజరై ప్రజల వినతులను స్వీకరించి, పరిష్కార చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆ ప్రకటనలో సూచించారు.

# నిరుపయోగముగా మారిన ఉద్యానవనం

### గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో పార్కు నిర్వహణ చేపట్టాలి. అధికారులకు, విద్యార్థులకు,ప్రజలకు అహ్లాదకరమైన. వాతావరణం కల్పించాలి... ప్రజల డిమాండ్.

**జూపాడుబంగ్లా :మే :31: (నంది పత్రిక)** మండల కేంద్రంలో లక్షలు రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించి ఉద్యానవనాన్ని నిర్మించి గ్రామపంచాయతీకి అప్పచెప్పారు. అందులో అన్ని రకాల మొక్కలు నాటి కొంతకాలం పాటు స్థానిక గ్రామపంచాయతీ అధికారులే పర్యవేక్షించారు. లక్షలతో ఏర్పాటుచేసిన ఉద్యానవనంలో మొక్కలు నాటడం జరిగింది. అయితే గ్రామపంచాయతీ ఉద్యానవన వనమును పర్యవేక్షించకపోవడంతో ఉద్యానవనం నిర్మాణం కై ఖర్చు చేసిన ప్రజాధనం మట్టి ఫాలో అయిందని పలువురు ప్రజానీకం మండల కేంద్రంలో చర్చించుకోవడం జరుగుతుంది. దీంతో పార్కు ఆలనా.. పాలన ఆగింది. కనీసం గేటు తెరిచే నాధుడే కరువయ్యాడు. మొక్కలకు నీరు పోసేవారు కనుమరుగయ్యారు. దీంతో మొక్కలు ఎండిపోయి పార్కు లో పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి.

**దైనందిన జీవితంలో...** ప్రస్తుతం అధికారులు, సామాన్య ప్రజలు ఒత్తిడికి గురవుతున్న సమయంలో జీవితంలో మనిషికి కాస్త ఆహ్లాదం అవసరం. కుటుంబముతో కలిసి సరదాగా గడపాలనుకుంటారు. దూర ప్రాంతాలకు వెళ్లలేకపోయినా దగ్గరలో పార్కులలో సేదతీరుతారు. మండల కేంద్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు అందుబాటులో ఉన్న అందుకు అనువైన స్థలమును పార్క్ ఏర్పాటుకు గుర్తించారు. ప్రతిరోజు వ్యాధిగ్రస్తులు, ఆఫీసుల పనిపై వచ్చే ప్రజలు ఉద్యానవనంలో సేద తీరేవారు. పార్కును ప్రజలకు ఉపయోగపడేలా చేయాలని కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పార్కును అందుబాటులోకి తెచ్చి ప్రజలకు,అధికారులకు అహల్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



# సచివాలయం స్థాన చలనం మారేనా.. ఏబియం ప్రజల కష్టాలు తీరేనా..?!





## ప్రజలు కు అందుబాటులో లేని సచివాలయం.. ఇబ్బందులు పడుతున్న ఏబియం పాలెం ప్రజలు తమ వార్డులో లోనే వార్డు సచివాలయం ఉండాలి :వార్డు ప్రజలు. అవసరానికి సచివాలయం వెళ్ళాలి అంటే ఇబ్బందులు పడుతున్న వృద్ధులు, వికలాంగులు.

**నందికొట్కూరు మే 30(నంది పత్రిక )** కంటి కి దగ్గర .. కాళ్ళకి దూరం.. అనే వాడుక పదానికి మున్సిపాలిటీ పరిధిలోని స్వర్ణ వార్డ్ 1 సచివాలయం చక్కటి ఉదాహరణగా చెప్పవచ్చు. ఎందుకంటే గత వైసిపి పాలనలో ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు అందించేందుకు స్థానికంగానే సచివాలయాలు ఏర్పాటు చేశారు. ఆ ఉద్దేశం పొరపాటుగా సచివాలయం 1 ఆ వార్డు ప్రజలకు దూరంగా పట్టణంలోనే రాజా వీధి నందు అధికారులు ఏర్పాటు చేయడంతో కంటికి దగ్గర కాళ్లకు దూరం గా మరి ఏబీయం పాలెం మరియు ఇందిరానగర్ ప్రజలకు ఎన్నో వ్యయ ప్రయాసలతో , వృద్ధులకు వికలాంగులకు ప్రభుత్వ సేవలు మరియు ప్రయోజనాలు పొందేందుకు కన్నీటి గాధగా నిలుస్తుంది. పట్టణంలోనే గృహ సముదాయాల మధ్య ఉన్నప్పటికీ కూడా ఏబీయం పాలెం మరియు ఇందిరానగర్ ప్రజలకు అవార్డు సచివాలయాన్ని ప్రజలు చేరుకోవాలి అంటే ఆటోలో రాజా వీధికి వెళ్లాలి అంటే రూ 20 ల ఖర్చు, ఆ సచివాలయం సెకండ్ ఫ్లోర్ లో ఉండడంవల్ల మెట్లు ఎక్కలేక వృద్ధులు వికలాంగులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి వర్ణించడానికి వీలుకాదు అంటూ ప్రజలు వృద్ధులు వికలాంగులు వాపోయే పరిస్థితి నెలకొంది. అధికారులకు ఈ విషయాన్ని పలుమార్లు విన్నవించడం పట్టించుకోకపోవడంతో ఆ సచివాలయం మార్పు ప్రజల ఆకాంక్ష నెరవేర్చకపోవడం ప్రభుత్వ ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్షంగా నిదర్శనంగా నిలుస్తుంది. మున్సిపాలిటీ పరిధిలోని స్వర్ణ వార్డు వన్ సచివాలయం కింద దాదాపుగా వేయి కుటుంబాలు, 5000 జనాభా కలిగి ఉంది.

**సచివాలయం వద్దకు చేరాలంటే ఇబ్బందులు పడాల్సిందే :**

తమ వార్డు ప్రజల కోసం కేటాయించిన స్వర్ణ వార్డు సచివాలయం "వన్ "తమ ప్రాంత ప్రజలకు అందుబాటులో లేక కంటికి దగ్గర కాళ్లకు దూరంలా మారిందని , వృద్ధులు వికలాంగులు ప్రభుత్వ సేవలు పొందాలి అంటే దాదాపు రెండు కిలోమీటర్ల కాలినడకనక, లేదా డబ్బులు వెచ్చించి మరి ఆటోలో వ్యయ ప్రయాసలతో కూడి సచివాలయం వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఏబీయం కాలనీ యువత కాటెపోగు నాగ సురేష్, కే రాజా, కే నాగన్న, కే వంశీ ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రజలకు ప్రభుత్వ సేవలు సత్వరమే పొందాలి అంటే తమ వార్డు పరిధిలోని సచివాలయం రాజా వీధి నుండి ఏబీఎం పాలెం కు సత్వరమే ప్రజల ఆకాంక్ష మేరకు మార్చాలని వారు ప్రభుత్వ అధికారులకు ప్రజాప్రతినిధులకు వేడుకుంటున్నట్లు తెలిపారు. సచివాలయం తమ చెంత వృద్ధులు వికలాంగుల ఎదుర్కొంటున్న బాధాకరమైన పరిస్థితి చెప్పనవసరం లేదని వారు వాపోయారు. సచివాలయ స్థాన చలన మార్పుకు జిల్లా ఉన్నతాధికారులు మరియు మున్సిపల్ అధికారులు జోక్యం చేసుకొవాలి అని వారు డిమాండ్ చేశారు.



# పదిలో మండల టాపర్‌గా నిలిచిన ప్రవల్లికకు మంత్రి అభినందనలు





**బనగానపల్లె, మే 31 నందిపత్రిక** పట్టణంలోని బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యశించిన విద్యార్థిని బి.జి. వేముల ప్రవల్లిక పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విశేష ప్రతిభ కనబరిచింది. తొలుత విడుదలైన ఫలితాల్లో 583 మార్కులు సాధించిన ఆమెకు రీ వెరిఫికేషన్ అనంతరం మరో 8 మార్కులు పెరగడంతో మొత్తం 591 మార్కులు లభించాయి. దీంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో మండల స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినిగా ప్రవల్లిక నిలవడమే కాకుండా, నంద్యాల జిల్లాలో మూడో స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా ప్రవల్లిక, ఆమె తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయ బృందం ఆదివారం రోడ్లు, భవనాల శాఖ మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డి, ఆయన సతీమణి ఇందిరా రెడ్డిని మంత్రి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి దంపతులు ప్రవల్లికను, ఆమె తల్లిదండ్రులను అభినందించి జ్ఞాపికతో పాటు రూ.10 వేల నగదు బహుమతిని అందజేశారు. ఇటీవల నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన "షైనింగ్ స్టార్" కార్యక్రమంలో ప్రతి పాఠశాల నుంచి ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు మంత్రి దంపతులు బహుమతులు ప్రదానం చేశారు. అయితే జిల్లా స్థాయిలో విశిష్ట ప్రతిభ కనబరిచిన ప్రవల్లికకు ప్రత్యేకంగా మరోసారి నగదు బహుమతి అందజేయడం పట్ల ఆమె తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రసాదరావు, ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, శ్రీగౌరి, నీలిమ తదితరులు పాల్గొని మంత్రి దంపతులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# మెడలో టై... కేవలం ఫ్యాషన్ మాత్రమే కాదు! దీని వెనుక ఉన్న ఆసక్తికరమైన చరిత్ర తెలుసా?



నేటి కార్పొరేట్ ప్రపంచంలో, అధికారిక సమావేశాల్లో టై ధరించడం ఒక సాధారణ విషయంగా కనిపిస్తుంది. అయితే, మెడలో టై కట్టుకోవడం వెనుక కేవలం ఫ్యాషన్ మాత్రమే కాదు, శతాబ్దాల చరిత్ర మరియు లోతైన సామాజిక కారణాలు దాగి ఉన్నాయి. అసలు ఈ 'టై' ప్రస్థానం ఎలా మొదలైందో ఇప్పుడు చూద్దాం.

**రక్షణ కోసం మొదలై.. రాజరిక శైలిగా మారి** టై చరిత్ర 17వ శతాబ్దానికి దారితీస్తుంది. 'ముప్పై ఏళ్ళ యుద్ధం' సమయంలో క్రొయేషియాకు చెందిన సైనికులు ఫ్రాన్స్ వెళ్లారు. ఆ సమయంలో తమ చొక్కా కాలర్ విడిపోకుండా ఉండటానికి, అలాగే గాలి, ధూళి నుండి గొంతును రక్షించుకోవడానికి మెడ చుట్టూ ఒక చిన్న గుడ్డను కట్టుకునేవారు. దీనిని గమనించిన ఫ్రెంచ్ రాజు 14వ లూయిస్, ఆ శైలికి ఆకర్షితుడై దానిని తన రాజ దర్బారులో ఒక ఫ్యాషన్ స్టేట్‌మెంట్‌గా మార్చేశాడు. క్రొయేషియన్ సైనికులు ధరించిన ఆ వస్త్రాన్నే కాలక్రమేణా 'క్రావట్' అని, ఆ తర్వాత 'టై' అని పిలవడం మొదలైంది.

**వృత్తిపరమైన గుర్తింపు మరియు క్రమశిక్షణ** ఆధునిక కాలంలో టై అనేది ఒక వ్యక్తి యొక్క వృత్తిపరమైన గౌరవానికి, క్రమశిక్షణకు నిదర్శనం. బ్యాంకులు, కార్పొరేట్ సంస్థలు, విద్యాసంస్థలు మరియు అధికారిక సమావేశాల్లో టై ధరించడం అంటే, అవతలి వ్యక్తికి ఇచ్చే గౌరవంగా భావిస్తారు. ఇది మనిషిని మరింత మర్యాదపూర్వకంగా, బాధ్యతాయుతమైన వ్యక్తిగా సమాజానికి పరిచయం చేస్తుంది.

**ఆత్మవిశ్వాసం – లీడర్‌షిప్ క్వాలిటీస్** చక్కటి సూట్, దానికి తగ్గ టై ధరించడం వల్ల వ్యక్తిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని మనస్తత్వవేత్తలు చెబుతుంటారు. సభల్లో, సమావేశాల్లో ఇతరుల కంటే ప్రత్యేకంగా, హుందాగా కనిపించడమే కాకుండా, ఇది ఒక వ్యక్తిలోని నాయకత్వ లక్షణాలను ప్రతిబింబిస్తుందని పలు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి.

**ఫ్యాషన్ ప్రపంచంలో ఒక భాగం** నేటి యువతలో ఫ్యాషన్ అనేది ఒక కీలక అంశం. ప్లెయిన్ షర్టులపై రంగురంగుల, విభిన్న డిజైన్ల టైలు ధరించడం వల్ల దుస్తుల అందం మరింత రెట్టింపు అవుతుంది. పెళ్లిళ్లు, విందులు, పార్టీల వంటి ప్రత్యేక సందర్భాల్లో తమ డ్రెస్సింగ్ స్టైల్‌ను ఎలివేట్ చేసుకోవడానికి టై ఒక ముఖ్యమైన సాధనంగా మారింది. ఒకప్పుడు కేవలం చలి, ధూళి నుండి రక్షణ కోసం ప్రారంభమైన ఈ చిన్న గుడ్డ ముక్క, కాలక్రమేణా ప్రపంచవ్యాప్త ఫ్యాషన్‌గా మారింది. నేడు వృత్తిపరమైన గౌరవానికి మరియు సంస్కారానికి ఒక ప్రామాణిక చిహ్నంగా టై స్థిరపడిపోయింది. ఒక వ్యక్తి వేషధారణలో టై ఉందంటే, అక్కడ క్రమశిక్షణ కూడా ఉందని అర్థం చేసుకోవచ్చు. **సేకరణ: పెరుమాళ్ళ వెంకట సురేంద్ర (రుద్రవరం ప్రతినిధి)**

# ప్రపంచ పర్యావరణ దినోత్సవ పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి

## పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అధికారులకు సూచన



**బనగానపల్లె, మే 31 నందిపత్రిక** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించనున్న కార్యక్రమాల పోస్టర్‌ను రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆదివారం బనగానపల్లెలోని తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్) నంద్యాల జిల్లా అధికారులు మంత్రిని కలిసి పర్యావరణ పరిరక్షణ కోసం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించే చర్యలను అధికారులు మంత్రికి వివరించారు. పచ్చదనం పెంపొందించే కార్యక్రమంలో భాగంగా ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న బనగానపల్లె బైపాస్ రహదారికి ఇరువైపులా 500 మొక్కలు నాటే కార్యక్రమానికి సోమవారం శ్రీకారం చుడుతున్నట్లు మంత్రి తెలిపారు. అలాగే జూన్ 1 నుంచి జూన్ 5 వరకు ఏపీ కాలుష్య నియంత్రణ మండలి నంద్యాల విభాగం ఆధ్వర్యంలో విస్తృత స్థాయిలో మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం, పరిశుభ్రత, కాలుష్య నియంత్రణ, ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. సమాజంలోని ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతోనే ఇటువంటి సామాజిక కార్యక్రమాలు విజయవంతమవుతాయని పేర్కొన్నారు. ప్రస్తుతం వాతావరణంలో చోటుచేసుకుంటున్న తీవ్ర మార్పులకు మానవ కార్యకలాపాలే ప్రధాన కారణమని గుర్తించి, పర్యావరణ అనుకూల జీవన విధానాలను అవలంబించాలని మంత్రి ప్రజలకు పిలుపునిచ్చారు.

# విద్య వల్లే సమాజంలో గుర్తింపు

**బండి ఆత్మకూరు నంది పత్రిక మే 31**: విద్య వల్లే సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఎమ్మార్పీఎస్ బండి ఆత్మకూరు మండల కో ఇన్చార్జి శివకుమార్ మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ మందా కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు నంద్యాల జిల్లా ఇన్చార్జి, జాతీయ అధ్యక్షులు డాక్టర్ మున్నంగి నాగరాజు సూచనలతో బండి ఆత్మకూరు ఎస్సీ కాలనీలో గో టు విలేజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కో యించార్జి శివకుమార్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ ఫలాలు మాదిగలకు అందాలంటే విద్య ఒక్కటే ప్రధాన ఆయుధమని పేర్కొన్నారు. మాదిగ పల్లెల్లో ప్రతిబిడ్డ ఐదు సంవత్సరాలు నిండగానే పాఠశాలలో చేరాలని, ఇందుకు తల్లిదండ్రులు కూడా ప్రోత్సహించాలని అన్నారు. పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఇంకా పై చదువులు చదవాలని, విద్యను మధ్యలో ఆపివేయకుండా డిగ్రీలు పీజీలు పీహెచ్డీ ల వరకు కొనసాగాలని పేర్కొన్నారు. ఎంఎస్పీ మండల అధ్యక్షుడు సుబ్బరాయుడు, ఎమ్మార్పీఎస్ మండల అధికార ప్రతినిధి సురేష్, దశరధుడు, వెంకటయ్య, నందయ్య ,నాగేంద్ర, బాలరాజు, విద్యార్థులు పాల్గొన్నారు



# కేంద్రప్రభుత్వ తప్పుడు విధానాలతో దేశాన్ని ఆర్థిక సంక్షోభంలోనికి నెట్టుతున్న ప్రభుత్వం.....

## యుద్ధం పేరుతో ప్రజలను ఆర్థిక దోపిడీ చేస్తున్న ప్రభుత్వం....

## పెంచిన పెట్రోల్ డీజీల్ గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి......



**కర్నూలు నంది పత్రిక బ్యూరో....**బహుజన ముక్తి పార్టీ కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని బహుజన ముక్తి పార్టీ దేశవ్యాప్తంగా నిరసన, ఆందోళన కు పిలుపులో బాగాంగా నేడు కర్నూలు నగరంలో బహుజన ముక్తిపార్టీ ఆధ్వర్యంలో మహాత్మాజ్యోతిబా పూలే సర్కిల్ నుండి పెరిగిన పెట్రోల్ డీజీల్ గ్యాస్ ధరలకు నిరసనగా ఎడ్ల బండి తో మరియు మోటారు సైకిల్ల నుఆటోలను తోసుకుంటూవెళ్లే ర్యాలీని ఓబీసీ మోర్చాజాతీయ నాయకులు డా!కంచెర్ల హరిప్రసాద్ ప్రారంభిస్తూ ప్రజలను చైతన్య పరుస్తూ కేంద్ర ప్రభుత్వాన్ని నీలాదీస్తామ న్నారు.భారతీయ జనతా పార్టీ పాలనలో దేశం సంక్షోభం లో ఉందన్నారు. విద్యా వైద్య రంగాల్లో పూర్తిగా విఫలమయిందని ఇది లీకేజీ ప్రభుత్వమని అన్నారు.కలెక్టరేట్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు.అనంతరం ర్యాలీని ఉద్దేశించి బహుజన ముక్తిపార్టీ జిల్లా కన్వీనర్ దాసరి రామశేషయ్య కో కన్వీనర్ ఎన్ కె జయన్న మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం తప్పుడు ఆర్థిక విధానాలతో దేశాన్ని ఆర్థిక సంక్షోభం లోనికి నెట్టుతుందన్నారు. భారతీయ జనతా పార్టీ అధికారం లోకి వచ్చిన 2014లో పెట్రోల్ రు 64 డీజిల్ రు 56 గ్యాస్, రు 440నేడు పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలను 150%పెంచి పేద మధ్య తరగతి ప్రజల నడ్డి విరచింది. యుద్ధం పేరుతో పెట్రోల్ డీజీల్ గ్యాస్ ధరలను ఆమంతంగా పెంచి పెదప్రజల జీవితాలను ఛిద్రం చేసింది. యుద్ధం పేరుతో ఆర్థిక దోపిడీకి పాలుపడే ప్రభుత్వం ప్రపంచంలో ఎక్కడలేదు. .ఒకవైపు పెట్రోల్ నిల్వలు ఉన్నాయంటూనే ధరలను పెంచటమంటే, ప్రజలను మోసాగించట మే అవుతుంది. పెట్రోల్ డీజిల్ పెరుగదలతో నిత్యావసర ధరలు విఫరీతంగాపెరిగి ప్రజల ప్రజల కొనుగోలు శక్తి పడిపోయింది. ఇప్పటికైనా ప్రభుత్వం పెంచిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలను తగ్గించాలని బహుజన ముక్తిపార్టీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నది. నిరసన కార్యక్రమంలో ఇంటెలెక్చ్యువల్ ఫోరమ్ నాయకులు కదీరుల్లా, ఇక్బాల్, యూసుఫ్,బాంసెఫ్ నాయకులు పెరికల రంగస్వామి భారత్ ముక్తి మోర్చాజిల్లా నాయకులు యం.నాగరాజు.రవి భాస్కర్, యం రాజు రంగయ్య సుందర్ రాజు, సురేష్, మహేష్ పాల్గొన్నారు..



# మంత్రి చే సి ఎం ఆర్ ఎఫ్ చెక్కుల పంపిణి

## 28 మందికి రూ.14.20 లక్షల పంపిణి

**బనగానపల్లె, మే 31నందిపత్రిక** పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆదివారం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) కింద మంజూరైన చెక్కులను రోడ్లు, భవనాల శాఖ మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. 28 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.14,20,195 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి తన చేతుల మీదుగా అందజేశారు. అనంతరం వైద్య సహాయం పొందిన లబ్ధిదారుల ఆరోగ్య పరిస్థితి, యోగక్షేమాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పేదల పాలిట ముఖ్యమంత్రి సహాయ నిధి కల్పతరువుగా మారిందన్నారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ నిరుపేదలకు వైద్య సహాయం అందించడంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడడం లేదని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చొరవతో సీఎంఆర్ఎఫ్ ద్వారా వేలాది కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని పేర్కొన్నారు.కుల, మత, ప్రాంత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ముఖ్యమంత్రి సహాయ నిధి అందజేస్తున్నామని మంత్రి చెప్పారు. కూటమి ప్రభుత్వంలో పేదల ఆరోగ్య సంరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని, అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ వరంగా మారిందని అన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై లబ్ధిదారులతో మంత్రి ఆరా తీశారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# బక్రీద్ సందర్భంగా వెలుగోడులో ఉచిత వైద్య శిబిరం.

### 138 మందికి ఉచిత వైద్య సేవలు మందుల పంపిణీ.



**వెలుగోడు, మే 31 నంది పత్రిక:** బక్రీద్ పండుగ సందర్భంగా సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం వెలుగోడు పట్టణంలోనీ బాషానగర్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ శిబిరాన్ని పిట్టల నూరుల్లా, పిట్టల మొహమ్మద్ ఇబ్రహీం మరియు ప్రముఖ వైద్యులు డాక్టర్ ముల్లా అబ్దుల్ అఫ్రిది ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ ముల్లా అబ్దుల్ అఫ్రిది (ఎంబీబీఎస్), డాక్టర్ మొయిన్ ముస్తాఫా సుల్తానా (ఎంబీబీఎస్) పాల్గొని రోగులను పరీక్షించి ఉచిత వైద్య సేవలు అందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా హిదాయత్ అలీ ఖాన్, ఇలియాస్ ఖాన్, మహమ్మద్ రఫీ, పిట్టల నూరుల్లా, సీనియర్ పాత్రికేయులు సుల్తాన్ హాజరైన వైద్య బృందాన్ని అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బక్రీద్ పండుగను సేవా భావంతో నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ఉచిత వైద్య సేవలు అందించడం గొప్ప కార్యక్రమమని కొనియాడారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం వైద్యులు స్వచ్ఛందంగా ముందుకు రావడం, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని ఆకాంక్షించారు. డాక్టర్ ముల్లా అబ్దుల్ అఫ్రిది మాట్లాడుతూ, శిబిరానికి సుమారు 138 మంది ఓపీ రోగులకు హాజరైన వైద్య సేవలు పొందారని తెలిపారు. ఆరోగ్య సమస్యలు అధికంగా కనిపిస్తున్న నేపథ్యంలో ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ప్రజలకు ఎంతోఉపయోగకరమన్నారు. ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెంపొందించడం తమ ముఖ్య ఉద్దేశమని, ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. బాషా నగర్‌తో పాటు వెలుగోడు పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై శిబిరాన్ని విజయవంతం చేశారు. బక్రీద్ పండుగ సందర్భంగా నిర్వహించిన ఈ సేవా కార్యక్రమం స్థానిక ప్రజల ప్రశంసలను అందుకుంది. ఈ కార్యక్రమం మత సామరస్యానికి, సేవా భావానికి నిదర్శనంగా నిలిచిందని పలువురు అభిప్రాయపడ్డారు.

# జర్నలిస్టుల శిక్షణా తరగతులు ఉపయోగకరం

### ఏపీజేఎఫ్ జిల్లా అధ్యక్షులు అనుమల వెంకటేశ్వర్లు.



**బద్వేల్ మే 31 (నంది పత్రిక):** సీఆర్ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల గ్రామీణ జర్నలిస్టుల శిక్షణా తరగతులు ఎంతో ఉపయోగకరంగా సాగాయని ఏపీజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు అనమల వెంకటేశ్వర్లు తెలిపారు. జర్నలిస్టుల నైపుణ్యాభివృద్ధికి ఈ శిక్షణ దోహదపడిందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్‌ను పూల బొకేతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. శిక్షణా తరగతుల్లో న్యూస్ రైటింగ్, ఫోటోగ్రఫీ, వీడియో జర్నలిజం అంశాలపై నిపుణులు వివరించారు. నైతిక విలువలు, చట్టపరమైన అవగాహన వంటి అంశాలపైనా శిక్షణ ఇచ్చిజగ్రామీణ ప్రాంత జర్నలిస్టులకు ఈ తరగతులు ఎంతో మేలు చేశాయని భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలని ఏపీజేఎఫ్ నాయకులు కోరారు ఇలాంటి శిక్షణా కార్యక్రమాలను మరింత మందికి అందించేందుకు కృషి చేస్తామని చైర్మన్ హామీ ఇచ్చారు. ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా ఆలపాటి సురేష్ చేస్తున్న సేవలను జర్నలిజం విలువలు, ప్రమాణాలు పెంచేందుకు అకాడమీపనిచేస్తోందన్నారు. నేతలు ప్రశంసించారు. కడప జిల్లా జర్నలిస్టులకు ఇది మంచి అవకాశమని అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఏపీజేఎఫ్ జిల్లా కోశాధికారి సి. వెంకటసుబ్బయ్య, కోఆర్డినేటర్ కె.వి. సుభాష్ కుమార్ పాల్గొన్నారు.

# శ్రీ ఇంద్రాక్షీ అమ్మవారి ఆలయాన్ని సందర్శించిన ఏపీ యాదవ కార్పొరేషన్ చైర్మన్



**మద్రిపాడు మే 31నంది పత్రిక :** చుంచులూరు గ్రామంలో వెలసియున్న శ్రీ ఇంద్రాక్షీ అమ్మవారి ఆలయాన్ని ఆంధ్రప్రదేశ్ యాదవ కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్ కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా దేవస్థాన ప్రధాన అర్చకులు మురళీకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థాన కమిటీ సభ్యులు స్థల పురాణం, ఆలయ అభివృద్ధి, భక్తులకు అందిస్తున్న సేవల గురించి వారికి వివరించారు. అనంతరం దేవస్థాన కమిటీ సభ్యులు, యాదవ సంఘ నాయకులు వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి కార్పొరేషన్ మాజీ కార్పొరేటర్ హేమంత్ యాదవ్, ఇరుకుమాటి మురళీధర్, కలిశెట్టి రాజేంద్రకుమార్, వేమన వినోద్, యాదవ సంఘ నాయకులు ఈదల కొండయ్య, సురభిబోయిన వెంకటరాయలు, వెంకటేశ్వర్లు, ప్రభాకర్, పూసపాటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ను సద్వినియోగం చేసుకోండి

**తిరుపతి బ్యూరో చీఫ్ మే 31నంది పత్రిక** ప్రతి సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ. సి) శారదా దేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో జూన్ 1వ తేది సోమవారం ఉదయం 10 గంటల నుండి 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం, 10.30 నుండి 11.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. పోన్ ద్వారా పిర్యాదులు చేసేవారు 0877-2227208 కి కాల్ చేసి మాట్లాడవచ్చని, ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తిరుపతి ప్రజలకు కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి తెలియజేశారు.

# యుద్ధ ప్రాతికపదిన చర్యలు

### ట్రాన్స్కో ఏఈ కంబగిరి



**బండి ఆత్మకూరు నంది పత్రిక మే 31 :** బండి ఆత్మకూరు మండలంలో రెండు రోజుల క్రితం గాలివాన సృష్టించిన బీభత్సం కారణంగా విద్యుత్ ట్రాన్స్కోకు కోటి రూపాయల మేరకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా విషమని అసిస్టెంట్ ఇంజనీర్ కంబగిరి ఆదివారం సాయంత్రం తెలిపారు. మండలంలో గాలివాన కారణంగా అధికంగా స్తంభాలు విరిగిపోయాయని ఆయన తెలిపారు. 33 కెవి స్తంభాలు 8, 11 కేవీ స్తంభాలు 42,ఎల్టి స్తంభాలు 60 దాకా దెబ్బతిన్నాయని గుర్తించడం జరిగింది అని తెలిపారు బి కోడూరు లెవెన్ కె.వి లో నాలుగు స్తంభాలు దెబ్బతిన్నాయని తెలిపారు. కడమల కాల్వ, ఈర్నపాడు,వెంగల్ రెడ్డి పేట గ్రామాలలో డి టి ఆర్ ట్రాన్స్ఫారములు దెబ్బతిన్నట్లుగా గుర్తించడం జరిగింది. ఈర్నపాడు ఏ కోడూరు తదితర గ్రామాల లో సిబ్బంది సహకారంతో యుద్ధప్రాతికపదిన, స్తంభాలను ఏర్పాటు చేయించి విద్యుత్ సరఫరా నువ్వ పునరుద్ధరించడం జరిగిందని తెలిపారు. వ్యవసాయ రంగానికి సంబంధించి స్తంభాలు కూడా చాలా చోట్ల దెబ్బతిన్నాయని, వాటి స్థానంలో త్వరలోనే స్తంభాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.



# వెలుగోడులో పేకాట స్థావరంపై పోలీసుల దాడి ఏడుగురు అరెస్ట్

**వెలుగోడు, మే 30 (నంది పత్రిక):** వెలుగోడు పట్టణంలోని తెలుగు గంగ గెస్ట్ హౌస్ దగ్గర శనివారం 8 గంటల 30 నిమిషాల సమయంలో చెట్టు కింద కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నారనే సమాచారం అందుకున్న వెలుగోడు ఎస్సై బి. సురేష్ ఆధ్వర్యంలో పోలీసుల మెరుపు దాడిలో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తెలుసుకొని వారి వద్ద నుంచి రూ.15,000 నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

## కొట్టాలపల్లిలో పోలేరమ్మపోతురాజు విగ్రహ ప్రతిష్ఠ 41వ రోజు వేడుకలు ఘనంగా నిర్వహణ





**కాశినాయనమే 31( నంది పత్రిక ):** బద్వేల్ నియోజకవర్గ, శ్రీ అవధూత కాశినాయన మండలం కొట్టాలపల్లి గ్రామంలో శ్రీశ్రీ పోలేరమ్మ, పోతురాజు విగ్రహ ప్రతిష్ఠ పూర్తి చేసి 41 రోజులు పూర్తయిన సందర్భంగా గ్రామంలో ఘనంగా విందు కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు మాజీ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి, ఆయన కుమారుడు మరియు ఇండియన్ అమెరికన్ ఫుట్‌బాల్ జట్టు కెప్టెన్ పోతిరెడ్డి సందీప్ రెడ్డి కార్యక్రమంలో పాల్గొన్నారు. వారితో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా పోలేరమ్మ ఆలయాన్ని సందర్శించిన వారు ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. అనంతరం గ్రామస్తులు మరియు వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో శాలువాలు, పూలమాలలతో వారిని ఘనంగా సన్మానించారు. గ్రామంలో జరిగిన ఈ వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య ఉత్సాహంగా సాగగా, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఇండియన్ ఐకాన్ అవార్డ్స్ 2026లో బండి రాకేష్‌కు జాతీయ స్థాయి పురస్కారం

**పోరుమామిళ్ల మే 31 (నంది పత్రిక):** హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రతిష్టాత్మక ఇండియన్ ఐకాన్ అవార్డ్స్ 2026 కార్యక్రమంలో ఆర్‌కే మీడియా వ్యవస్థాపకుడు, సీఈఓ బండి రాకేష్‌కు "యంగ్ ఎంటర్‌ప్రెన్యూర్ ఇన్ డిజిటల్ ఎక్సలెన్స్" అవార్డు ప్రదానం చేశారు. డిజిటల్ మార్కెటింగ్, బ్రాండింగ్, సోషల్ మీడియా నిర్వహణ, ఐటీ సేవల రంగాల్లో ఆయన అందించిన విశేష సేవలు, వినూత్న కృషికి గుర్తింపుగా ఈ జాతీయ స్థాయి పురస్కారం లభించింది. ఈ కార్యక్రమానికి అపోలో హెల్త్ అండ్ లైఫ్‌స్టైల్ లిమిటెడ్‌లో హెడ్ లెర్నింగ్ అండ్ ఆర్గనైజేషనల్ డెవలప్‌మెంట్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న డా. ఎల్టన్ రాన్ నాథన్ ముఖ్య అతిథిగా, ప్రముఖ సినీ నటి హెబ్బా పటేల్ ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి రాకేష్ మాట్లాడుతూ, ఈ అవార్డును తన టీమ్ సభ్యులు, క్లయింట్లు మరియు తన విజయానికి తోడ్పడిన ప్రతి ఒక్కరికీ అంకితం చేస్తున్నట్లు తెలిపారు. డిజిటల్ రంగంలో మరింత మెరుగైన సేవలు అందించేందుకు ఈ పురస్కారం తనకు ప్రేరణగా నిలుస్తుందని పేర్కొన్నారు.



# చౌడేశ్వరి అమ్మవారి ఆలయంలో పౌర్ణమి రద్దీ

### భారీగా మొక్కులు తీర్చుకున్న భక్తజనం

### ప్రత్యేక పూజలతో ఆధ్యాత్మిక వాతావరణం



**బనగానపల్లె, మే 31 నందిపత్రిక** నందవరం గ్రామంలో వెలసిన ప్రసిద్ధ శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారి దేవస్థానం ఆదివారం పౌర్ణమి సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. జిల్లా నలుమూలలతో పాటు పొరుగు జిల్లాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా ఆలయంలో తెల్లవారుజాము నుంచే భక్తుల రాకపోకలు అధికంగా కనిపించాయి. అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, కుంకుమ పూజలు నిర్వహించి భక్తులు తమ మొక్కులు చెల్లించుకున్నారు. కుటుంబ సమేతంగా వచ్చిన భక్తులు అమ్మవారి ఆశీస్సులు పొందేందుకు బారులు తీరారు. ఆలయ ప్రాంగణం భక్తుల రద్దీతో సందడిగా మారగా, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థాన అధికారులు, సిబ్బంది తగిన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

# రేపు నగరపాలకలో పిజిఆర్‌యస్

### నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు



**కర్నూలు నంది పత్రిక బ్యూరో....** కర్నూలు నగరపాలక సంస్థలో సోమవారం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' (పిజిఆర్‌యస్) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ చల్లా ఓబులేసు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 09:30 గంటలకే కార్యక్రమం ప్రారంభమవుతుందని, స్థానిక ఎస్బిఐ ఎంప్లాయీస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో పిజిఆర్‌యస్ నిర్వహించబడుతుందన్నారు. ఈ కార్యక్రమానికి నగరపాలక సంస్థకు చెందిన అన్ని విభాగాల అధికారులు హాజరవుతారని, కాలనీల్లోని మౌలిక వసతులు, రహదారులు, డ్రైనేజీ, వీధి దీపాలు, పరిశుభ్రత వంటి సమస్యలను ప్రజలు లిఖితపూర్వకంగా సమర్పించవచ్చని సూచించారు. ప్రతి ఫిర్యాదును స్వీకరించిన వెంటనే సంబంధిత అధికారులకు పంపించి, పరిష్కారం కోసం నిర్దిష్ట గడువులు నిర్ణయించబడతాయని కమిషనర్ తెలిపారు. అదేవిధంగా, ప్రతి ఫిర్యాదు పురోగతిని పౌరులు వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని వివరించారు.

# ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం

### అన్ని మండల రెవెన్యూ కార్యాలయాలు, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు, మునిసిపల్ కార్యాలయాల్లో కూడ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

### అర్జీల పరిష్కారం సమాచారం కోసం కాల్ సెంటర్ నంబర్ 1100 కు ఫోన్ చేసి కనుక్కోవచ్చు - జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి




**కర్నూలు నంది పత్రిక బ్యూరో....** .జూన్ నెల 1వ తేదీ సోమవారం ఉదయం 9-30 గంటల నుండి కర్నూలు కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల రెవెన్యూ కార్యాలయాలు, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు, మునిసిపల్ కార్యాలయాల్లో కూడ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం)కార్యక్రమం జరుగుతుందని, ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. అర్జీల పరిష్కారం సమాచారం కోసం 1100 కు ఫోన్ చేయవచ్చుఅర్జీదారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం కాల్ సెంటర్ నంబర్ 1100 కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.. అలాగే అర్జీదారులు (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.

# ముదిగేడులో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి పర్యటన

### నేడు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ, సీసీ రోడ్లుడ్రైనేజీల ప్రారంభోత్సవం



**సంజామల మే 31 నందిపత్రిక** రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సోమవారం సంజమల మండలంలో పర్యటించనున్నారు. ఉదయం 8.30 గంటలకు ముదిగేడు గ్రామానికి చేరుకుని ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని మంత్రి కార్యాలయం తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థల ప్రారంభోత్సవ కార్యక్రమాలను మంత్రి ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమాలకు ఎన్డీఏ కూటమి పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మంత్రి క్యాంపు కార్యాలయం ఒక ప్రకటనలో వెల్లడించారు.

# రాయలసీమ ప్రాజెక్టుల పంటకాలువల పనులు జూన్‌జూలైలో పూర్తి చేయాలి,





## లేకపోతే ఆగస్టు 1న రాయలసీమ వ్యాప్తంగా కలెక్టరేట్ల ముట్టడి రాయలసీమ ప్రజా సంకల్ప తీర్మానానికి మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మద్దతు మా నీటి వాటాను మేమే సాధించుకుంటాం: ఏపీ రైతు కూలీ సంఘం అధ్యక్షురాలు ఝాన్సీ సీమ ప్రాజెక్టులకు చట్టబద్ధమైన నీటి కేటాయింపులు జరగాలి: ప్రొఫెసర్ వెంకటేసు నంద్యాలలో ఘనంగా సిద్ధేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన 10వ వార్షికోత్సవ మహాసభ నాలుగు జిల్లాల నుంచి వేలాదిగా తరలివచ్చిన రైతాంగం

**నంద్యాల సిటీ బ్యూరో మే 31 ( నంది పత్రిక )** రాయలసీమ సాగునీటి హక్కుల సాధనకు ప్రతీకగా నిలిచిన సిద్ధేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన 10వ వార్షికోత్సవ మహాసభ ఆదివారం నంద్యాల శివారులోని ఏఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో అత్యంత ఘనంగా జరిగింది. రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ బహిరంగ సమాలోచన సదస్సుకు రాయలసీమ నాలుగు జిల్లాల నుంచి వేలాది మంది రైతులు, ప్రజలు హాజరయ్యారు. ఈ సభకు మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం అధ్యక్షురాలు శ్రీమతి ఝాన్సీ, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ వెంకటేసు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అనివార్య కారణాల వల్ల సభకు హాజరుకాలేకపోయిన సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ గోపాలగౌడ్ ఆన్‌లైన్ ద్వారా సందేశాన్ని అందించారు.

సభ ప్రారంభంలో బొజ్జా దశరథరామిరెడ్డి రచించిన "సహజ సంపదల సిరిరా... రాయలసీమ నువ్వే మా గర్వప్రతీకరా" అనే ప్రత్యేక గీతాన్ని అతిథులు ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ,నందమూరి తారక రామారావు చేపట్టిన రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులు ఎస్ ఆర్ బి సి, తెలుగుగంగ, హెచ్ ఎన్ ఎస్ ఎస్, జి ఎన్ ఎస్ ఎస్ ప్రాజెక్టులు పూర్తి కావడానికి 40 ఏళ్లు పట్టడం, అవి ఇంకా పూర్తి కాకపోవడం భాధేస్తోందని, గోదావరి నీళ్లు బానకచర్లలో పోయడం కన్నా శ్రీశైలం ప్రాజెక్టులో ఉన్న నీళ్లు దిగువకు వదలకుండా పూర్తిగా రాయలసీమ ప్రాజెక్టులకు కేటాయిస్తే వలసలు, కరువు పోతుందని, రైతులు రాజకీయాలకు అతీతంగా ఐక్య ఉద్యమం చేస్తే సాగునీరు సాధ్యం అవుతుందని మాజీ మంత్రి వడ్డే శోభనాధీశ్వరరావు అన్నారు. పాలకుల్లో చిత్తశుద్ధి లోపించడం వల్లే రాయలసీమకు కేటాయించిన సాగునీరు సద్వినియోగం కాకా దిగువన ఉన్న నాగార్జున సాగర్, పులిచింతల దాటి ప్రకాశం బ్యారేజ్ లో చేరి అక్కడి రైతు లకు ఉపయోగపడి, ఇక్కడి వాళ్లు కరువు, వలసలకు కారణం పాలకుల నిర్లక్ష్యం అధికంగా ఉందన్నారు. వాటిని సాధించుకునేందుకు ఇప్పటికైనా రాయలసీమ రైతులు పాలకులపై వత్తిడి పెంచేందుకు రాజకీయాలకు అతీతంగా ఐక్య ఉద్యమం ఉదృతం కావాలని పిలుపు నిచ్చారు. రాయలసీమలో వేల కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన ప్రాజెక్టులు, రిజర్వాయర్లకు అవసరమైన లింకు పనులు, పంటకాలువల నిర్మాణం పూర్తికాకపోవడం వల్ల రైతాంగం తీవ్రంగా నష్టపోతోందన్నారు. "డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ నిర్మాణంలో ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా సీమ భూములకు చేరాల్సిన జలాలు వృథాగా సముద్రంలో కలుస్తున్నాయి. ప్రభుత్వం వెంటనే స్పందించి జూన్‌జూలై నెలల్లో ఈ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి. లేనిపక్షంలో ఆగస్టు 1న రాయలసీమ వ్యాప్తంగా కలెక్టరేట్ల ముట్టడి చేపట్టాలన్న ప్రజా సంకల్పానికి నా సంపూర్ణ మద్దతు ఉంటుంది" అని పేర్కొన్నారు. ప్రభుత్వం అప్పటికీ స్పందించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలన్న ప్రజాసంఘాల నిర్ణయానికి కూడా ఆయన మద్దతు ప్రకటించారు. ఏపీ రైతు కూలీ సంఘం అధ్యక్షురాలు శ్రీమతి ఝాన్సీ మాట్లాడుతూ, రాయలసీమ ప్రజలు తమ ఆత్మగౌరవంతో ఏకమైతేనే పాలకులు స్పందిస్తారని అన్నారు. "ఏళ్ల తరబడి కాలువలు పూర్తికాక, ఎకరాలకు నీరందక భూములు ఎండిపోతున్నాయి. ఇక చూస్తూ ఊరుకోలేం. అవసరమైతే మేమే పనులు ప్రారంభిస్తాం. మన ప్రాంత అభివృద్ధిని మనమే చేతుల్లోకి తీసుకుని, మన నీటి వాటాను మనమే సాధించుకోవాలి" అని పిలుపునిచ్చారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ వెంకటేసు మాట్లాడుతూ, కృష్ణా డెల్టా, ప్రకాశం బ్యారేజీకి వెళ్లే జలాల మూలం రాయలసీమలో ప్రవహించే తుంగభద్ర, కృష్ణా నదులేనని గుర్తుచేశారు. "లక్షల క్యూసెక్కుల వరద నీరు సీమ కళ్లముందే సముద్రం పాలవుతుండగా, ఎస్ఆర్‌బీసీ, తెలుగుగంగ, హంద్రీ-నీవా వంటి ప్రాజెక్టులకు నీరు అందకపోవడం పాలకుల వైఫల్యానికి నిదర్శనం. రాయలసీమ వెనుకబాటుతనానికి ప్రధాన కారణం సాగునీటి కొరత. ఈ పరిస్థితి మారాలంటే సీమ ప్రాజెక్టులకు చట్టబద్ధమైన నీటి కేటాయింపులు జరగాలి" అని అన్నారు. రాబోయే ఎన్నికల మేనిఫెస్టోలలో రాజకీయ పార్టీలు రాయలసీమ ప్రాజెక్టుల పూర్తి, నీటి హక్కుల సాధనపై స్పష్టమైన హామీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి మాట్లాడుతూ, సీమ హక్కుల సాధన కోసం రైతాంగమంతా ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. సభలో పాల్గొన్న రైతుల ఆమోదంతో ఆగస్టు 1న రాయలసీమ వ్యాప్తంగా కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమాన్ని ఏకగ్రీవంగా తీర్మానించినట్లు తెలిపారు.

**ఇతర ప్రధాన డిమాండ్లు** నంద్యాల వ్యవసాయ పరిశోధన స్థానం భూములను ఇతర అవసరాలకు కేటాయించడాన్ని నిలిపివేయాలి. కలెక్టరేట్ నిర్మాణాన్ని ప్రత్యామ్నాయ స్థలానికి మార్చాలి. రాయలసీమ నుంచి ప్రభుత్వ కార్యాలయాల తరలింపును నిలిపివేయాలి. విజయవాడకు తరలించిన రాయలసీమ గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని తిరిగి కడపకు తరలించాలి. వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ నిధులు మంజూరు చేయాలి. రాయలసీమ హైకోర్టు, వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు వంటి హామీలను తక్షణమే అమలు చేయాలి. ఈ డిమాండ్లపై స్థానిక ప్రజాప్రతినిధులకు త్వరలోనే వినతిపత్రాలు అందజేస్తామని, 15 నుంచి 25 రోజుల్లో సానుకూల స్పందన రాకపోతే ప్రజాస్వామ్య పద్ధతుల్లో ప్రజాప్రతినిధుల నివాసాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర వంటి వెనుకబడిన ప్రాంతాల ప్రజలను సంఘటితం చేస్తూ హక్కుల సాధన కోసం ఉమ్మడి కార్యాచరణతో ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ మహాసభలో విరసం వరలక్ష్మి, జలసాధన సమితి అనంతపురం,

రాయలసీమ సామాజిక వేదిక నాయకులు డాక్టర్ నాగన్న, డాక్టర్ బ్రహ్మారెడ్డి, దీఖూ సహదేవరెడ్డి, కడప, మైదుకూరు రమణ, ప్రతినిధి కె.రామాంజనేయులు, రాయలసీమ విద్యావంతుల వేదిక, జూ×వీ ప్రతినిధి రాజశేఖర్, డాక్టర్ బ్రహ్మారెడ్డి, ప్రజాస్వామ్య పరిరక్షణ వేదిక నాయకులు రామకృష్ణారెడ్డి, డిటియఫ్ నాయకులు రత్నం ఏసేపు, వేమన సాంస్కృతిక వేదిక కన్వీనర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి, బాలీశ్వరరెడ్డి, బెక్కం రామసుబ్బారెడ్డి పలు ప్రజా సంఘాల నాయకులు, రైతులు పాల్గొన్నారు





## వైఎస్ఆర్ విగ్రహ ధ్వంసం అత్యంత ఖండనీయము నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి

### జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు క్రాంతి నాయుడు బోయ

**కర్నూల్ ప్రతినిధి నంది పత్రిక** నంద్యాల శ్రీనివాస సెంటర్ వద్ద మహానేత, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటనను కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ తీవ్రంగా ఖండిస్తోంది. పట్టపగలు విగ్రహంపై దాడి జరుగుతుంటే పోలీసులు అడ్డుకోకపోవడం అత్యంత బాధాకరం. అనంతరం నిందితుడి మానసిక స్థితిపై వివరణలు ఇవ్వడం కంటే, చట్టపరమైన చర్యలు తీసుకోవడం పోలీసు యంత్రాంగం బాధ్యత. రాష్ట్రంలో వైఎస్ఆర్ విగ్రహాలపై వరుస దాడులు జరగడం ఆందోళనకరం. ఈ ఘటన వెనుక ఉన్న శక్తులను గుర్తించి, నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ధ్వంసమైన విగ్రహం స్థానంలో తక్షణమే కొత్త విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలి. లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నంద్యాలలో ప్రజా ఉద్యమంతో పాటు ఆమరణ నిరాహార దీక్షకు కూడా సిద్ధమవుతామని హెచ్చరిస్తున్నాం.




## పార్టీ మనకు మనం పార్టీకి ఉపయోగ పాడుదాం. ఎంపీ ఈటల రాజేందర్.

రంగారెడ్డి అర్బన్ జిల్లా ప్రశిక్షణ సమావేశాల్లో పాలొగొన్నఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ కార్యకర్తలఎదుగుదల నిరంతర ప్రక్రియ. అందుకు ఈ శిక్షణ తరగతులు అవసరం. రక్త సంబంధం కంటే.. వర్గ సంబంధం.. పార్టీ సంబంధం గొప్పది. మన జెండా కోసం, సిద్ధాంతం కోసం ఎంతో మంది త్యాగం చేశారు. వ్యక్తిగా గొప్పవాళ్ళం కాదు.. పార్టీలో ఉంటే అది శక్తిగా మారుతుంది. ఏం ఇచ్చింది పార్టీ అంటే.. పరిచయాలు ఇస్తుంది, శక్తి ఇస్తుంది. అలాగే పార్టీకి మనం కూడా మన శక్తిని దారపోస్తాం. బూతు స్థాయి నుండి ప్రధానమంత్రి వరకు ప్రజల మధ్య ఉండేవాడు, ప్రజలను ప్రేమించే వాడు, గ్లామర్ ఉన్న లీడర్ ఉండాలి. ఒక నాయకుడు ఎదుగుతుంటే పొంగిపోవాలి తప్ప ఈర్ష పడవద్దు. ఇది లేకపోతే మన ఆశయం ఎన్నటికీ నెరవేరదు. పార్టీ మనకు మనం పార్టీకి ఉపయోగపడతాం. దీనిని సింబయాటిక్ యాక్టివిటీ అంటారు. కింద స్థాయి నుండి.. కెపాసిటీ ఉన్న వాడికి లీడర్ షిప్ బాధ్యతలు ఇవ్వాలి. పార్టీ సిద్ధాంతం ఎంత ముఖ్యమో.. గెలుపే గీటురాయి అని కూడా ఉండాలి. గెలుపు అంచుకు తీసుకు పోవడానికి మనందరం కృషి చేయాలి. ప్రజాసమస్యల మీద కోట్లాడినప్పుడు మాత్రమే ప్రజలు మనలని అక్కున చేర్చుకుంటారు. అందుకు హైడ్రాకు వ్యతిరేకంగా.. మూసీ పక్కన ఇల్లు కూలగొడత అంటే మనం చేసిన కొట్లాట ప్రత్యక్ష ఉదాహరణ. బెంగాల్ లో రెండే సీట్లు వస్తె కుంగిపోలే అలసి పోలే.. పోరాడి గెలిచినం. బెంగాల్ విజయం అఖండ భారతానికి రక్షణ. వారి అణచివేతను ప్రజలు బొందపెట్టారు. కేసీఆర్ ను కూడా నిరంకుశ కుటుంబపాలన చూసి ప్రజలు బొందపెట్టారని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు.

## అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా

### డ్రైవర్ మృతి





**రుద్రవరం ప్రతినిధి మే 31 (నంది పత్రిక):** ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడిన సంఘటనలో పవన్ కుమార్ రెడ్డి (30) అనే వ్యక్తి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆదివారం మండలంలోని చందలూరు గ్రామానికి చెందిన పవన్ కుమార్ రెడ్డి ట్రాక్టర్ తో ఆర్ కొత్తూరు సమీపంలోని గంగిరెడ్డి కుంటలో మట్టిని తీసుకొని వెళుతుండగా మార్గమధ్యలోని మాచినేనిపల్లి సమీపంలో ఉన్న నాలుగు రోడ్ల కూడలి సమీపంలో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడడంతో డ్రైవర్ పవన్ కుమార్ రెడ్డి అక్కడికక్కడే మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. సంఘటన స్థలాన్ని రుద్రవరం ఎస్ఐ జయప్ప సిబ్బందితో సందర్శించి ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## డ్రైనేజీ కాలువ బ్రిడ్జి ప్రహరీ గోడ పునర్నిర్మాణం తక్షణమే చేపట్టాలిబి సిపిఐ



**నందికొట్కూరు మే 31(నంది పత్రిక )**ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజాచైతన్య యాత్ర 7వ రోజు ఆదివారం కొనసాగింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వి. రఘురామ మూర్తి నాయకత్వంలో పట్టణం లోని స్థానిక చౌడేశ్వరి ఆలయం సమీపంలోని సర్కిల్ వద్ద ఉన్న డ్రైనేజీ కాలువ బ్రిడ్జిని పరిశీలించారు. బ్రిడ్జి వద్ద ఉన్న ప్రహరీ గోడ కూలిపోయి మూడు సంవత్సరాలు పూర్తయినా ఇప్పటివరకు పునర్నిర్మాణం చేపట్టకపోవడంపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో పలుమార్లు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రాలు అందజేసినప్పటికీ, రెండు సంవత్సరాలు గడిచినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఈ బ్రిడ్జి కేజీ రహదారి పక్కనే ఉండటంతో పాటు కళాశాల, ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై ఉండటంతో నిత్యం విద్యార్థులు, ప్రయాణికులు, వాహనదారులు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారని తెలిపారు. ప్రహరీ గోడ లేకపోవడం వల్ల ప్రజలు ప్రమాదభయంతో ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అంతేకాకుండా కాలువలో చెత్త పేరుకుపోవడం, మురుగునీరు నిల్వ ఉండటం వల్ల దుర్వాసన వెదజల్లుతూ ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందన్నారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో ప్రమాదాల ముప్పు మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. అందువల్ల వెంటనే ప్రహరీ గోడ పునర్నిర్మాణం చేపట్టి, కాలువను శుభ్రపరచి ప్రజల భద్రతకు అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలను సమీకరించి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు వెంకటేశ్వర్లు, సుంకన్న,స్వాములు, మహేష్, కిషోర్ పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా విద్యుత్ తీగలు..నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులు సి.పి.ఐ(ఎం.ఎల్)లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి పిక్కిలి.వెంకటేశ్వర్లు.



**నందికొట్కూరు మే 31(నంది పత్రిక )** క్రిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలు ప్రజల ప్రాణాలకు ప్రమాదకరం గా మారిన విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తూ ఏ మాత్రం పట్టించుకోవడం లేదని సి.పి.ఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి పిక్కిలి.వెంకటేశ్వర్లు అన్నారు. మున్సిపాలిటీలో నూరా మసీద్ ముందర లైన్ బజాజ్ షోరూం వెనుక భాగంలో ట్రాన్స్ఫార్మర్ నుండి కరెంటు తీగలు ప్రమాదాలకు నిలయంగా ఉన్న ప్రాంతాన్ని సి.పి.ఐ(ఎం.ఎల్)లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో ఆటోనగర్ ప్రాంతంలో పర్యటించారు .ఈ సందర్భంగా సి.పి.ఐ(ఎం.ఎల్)లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి పిక్కిలి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నందికొట్కూరు గ్రామ పంచాయతీగ ఉన్న పొట్టి వైర్లు 20 సంవత్సరాలుగా పట్టణం మార్పు చెందడంతో గతంలో వేసినటువంటి ట్రాన్స్ఫారం నుండి వేసినటువంటి పోల్స్ ఈరోజు ప్రమాదాలకు నిలయం గా ఉన్నాయని ఇక్కడ ఉన్నటువంటి స్థానికులు అనేక పర్యాయాలు విద్యుత్ అధికారులకు మొరపెట్టుకున్న పరిష్కారం కాలేదన్నారు. వర్షాకాలం వస్తున్నందు వలన డీప్ నుంచి ఉన్నటువంటి వైర్లు విద్యుత్ అధికారులు కట్ చేసినమని చెప్తున్నా ఆ వైర్ల ద్వారా స్పార్కు రావడంతో ఈ మధ్యకాలంలోనే ఒక ప్రైవేటు వెల్పరు విద్యుత్ స్తంభం నుండి కింద పడి తృటిలో ప్రమాదం నుండి బయట పడడం జరిగిందన్నారు. విద్యుత్తు వైర్లు ఉయ్యాలలు ఊతున్నట్లు,ఊగుతున్నాయి అని ఆరోపించారు. తక్షణమే డి.ఈ,ఏ.ఈ ఈ కాలనీ పరిశీలించి విద్యుత్ స్తంభాలను పాత వాటిని తొలగించి కొత్తగా స్తంభాలు ఏర్పాటు చేసి ప్రమాదాల గురి కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కరించ లేకపోతే సి.పి.ఐ(ఎం.ఎల్) లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో విద్యుత్తు కార్యాలయం ముందు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సి.పి.ఐ(ఎంఎల్)లిబరేషన్ పార్టీ జిల్లా నాయకులు టి.నరసింహులు వేల్పుల.ఏసన్న మహిళ సంఘం జిల్లా నాయకురాలు ఎస్.బి.బి,శిరీష,ఆర్.వై.ఏ.యువజన సంఘం నాయకులు గణేష్,సురేష్,స్థానికులు మహబూబ్ బాషా,అస్లం భాష,ఎం.శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు (జూన్ 1న) జిల్లా, డివిజన్, మండల కేంద్రాలలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**ఎండలు తీవ్రత దృష్ట్యా నడవలేని,**
**మంచానికే పరిమితం అయిన,**
**అనారోగ్యంతో బాధపడుతున్న వారిని**
**ఎవ్వరి కూడా పి జి ఆర్ ఎస్ కు**
**తీసుకురావద్దు**
**వేసవి దృష్ట్యా పిజిఆర్ఎస్ కు వచ్చే ప్రజలు**
**తగు జాగ్రత్తలతో హాజరు కావాలి**
**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**



**భీమవరంబ్యూరో చీఫ్ : మే 31,నంది పత్రిక** జిల్లా ప్రజల సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం జూన్ 1వ తేదీన జిల్లా కలెక్టరేట్‌తో పాటు అన్ని డివిజన్ మరియు మండల కేంద్రాలలో నిర్వహించబడుతుందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. అదేవిధంగా రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం కూడా నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను సంబంధిత ఆధార పత్రాలతో సమర్పించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. అర్జీల స్వీకరణ, పరిశీలన మరియు పరిష్కార ప్రక్రియను మరింత పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా మరియు మండల స్థాయి అధికారుల సమన్వయంతో ప్రత్యేక ఏర్పాట్లు చేయబడినట్లు తెలిపారు. అర్జీదారులు తమ ఫిర్యాదులను అధికారిక వెబ్‌సైట్ ఎవవనిశీయిఎ.ఖజూ.స్త్రశీజ.అఅ ద్వారా కూడా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అర్జీల స్థితి, పరిష్కార ప్రక్రియ లేదా ఇతర సమాచారం కోసం "మీకోసం" టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 1100 ను సంప్రదించవచ్చని సూచించారు. వేసవి ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో పిజిఆర్ఎస్‌కు హాజరయ్యే ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా నడవలేని వారు, మంచానికే పరిమితమైన వారు, తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పిజిఆర్ఎస్ కేంద్రాలకు తీసుకురావద్దని తెలిపారు. అలాంటి వారి సమస్యలను కుటుంబ సభ్యులు లేదా ప్రతినిధుల ద్వారా తెలియజేయవచ్చని పేర్కొన్నారు. పిజిఆర్ఎస్‌కు హాజరయ్యే ప్రజల కోసం తాగునీరు, అల్పాహారం, భోజనం వంటి సౌకర్యాలతో పాటు వికలాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయబడినట్లు తెలిపారు. అందిన అర్జీలపై నిరంతర పర్యవేక్షణ చేపట్టి, సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. అదేవిధంగా ప్రతి శుక్రవారం నియోజకవర్గ స్థాయిలో నిర్వహిస్తున్న ప్రత్యేక పిజిఆర్ఎస్ కార్యక్రమాలను కూడా ప్రజలు వినియోగించుకొని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కలెక్టర్ కోరారు .

# నంద్యాలలో వైఎస్సార్ విగ్రహం ధ్వంసం.. ఘటన వెనుక కూటమి నేతల కుట్ర ఉందంటూ వైసీపీ తీవ్ర ఆరోపణలు!

**నిందితుడు జంబులయ్య వైసీపీ వదిలి టీడీపీ, జనసేనలో చేరాడన్న ప్రతిపక్షం.. సాక్ష్యాలుగా ఫోటోలు, ఫ్లెక్సీలు!**
**పోలీసుల వైఫల్యంపై నిప్పులు చెరిగిన వైసీపీ నేతలు..**
**కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని డిమాండ్!**



**నంద్యాల సిటీ బ్యూరో మే 31 ( నంది పత్రిక )** నంద్యాల నడిబొడ్డున దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటన రెండు తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. ఈ ఘటన వెనుక అధికార కూటమి పార్టీల కుట్ర దాగి ఉందంటూ వైసీపీ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. నిందితుడు జంబులయ్య వైసీపీ కార్యకర్త అంటూ టీడీపీ చేస్తున్న ప్రచారాన్ని సాక్ష్యాలతో సహా తిప్పికొడుతున్నారు. పోలీసులు, కూటమి నేతలు కుమ్మక్కయ్యారని.. లా అండ్ ఆర్డర్ పూర్తిగా లోపించిందని వైసీపీ నేతలు మండిపడుతున్నారు. శనివారం వైసీపీ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇస్సాక్ బాష, వైసీపీ సిఇసి మెంబర్ పి.పి నాగిరెడ్డి, వైసీపీ రాష్ట్ర ఈసి మెంబర్ సాయినాథరెడ్డి, వైసీపీ నేతలు కల్లూరి రామలింగారెడ్డి, నంద్యాల అసెంబ్లీ పరిశీలకుడు సూర్యనారాయణ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్లు విజయశేఖర్ రెడ్డి, పురుషోత్తమరెడ్డి, మహేశ్వర రెడ్డి, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రత్న బాబు చౌదరి, వైసీపీ జిల్లా కార్యవర్గ సభ్యులు, మాజీ కౌన్సిలర్లు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు శ్రీనివాసనగర్ సెంటర్ నందు ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్దకు చేరుకొని తీవ్రనిరసన వ్యక్తం చేశారు. అనంతరం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేశారు ఈ సంధర్భంగా వైసీపీ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ... రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు గుండెల్లో పెట్టుకున్న మహానేత డా. వైఎస్సార్ విగ్రహం తల భాగాన్ని ధ్వంసం చేయడం అత్యంత బాధాకరమని వైసీపీ నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఘటన జరిగిన కొన్ని నిమిషాల వ్యవధిలోనే.. నిందితుడు వైసీపీ వ్యక్తి అంటూ టీడీపీ సోషల్ మీడియాలో అసత్య ప్రచారానికి తెరలేపిందని మండిపడుతున్నారు. నిజానికి నిందితుడు జంబులయ్య 2023 కంటే ముందే వైసీపీని వీడి టీడీపీలో చేరాడని, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఫోటోలతో పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు కూడా వేశాడని సాక్ష్యాలను బయటపెట్టారు. అంతేకాదు, 2024 ఎన్నికల తర్వాత మంత్రి ఫరూక్ కుమారుడు ఫిరోజ్‌తో నిందితుడు దిగిన ఫోటోలు కూడా స్పష్టంగా ఉన్నాయని, అలాంటప్పుడు అతను వైసీపీ కార్యకర్త ఎలా అవుతాడని ప్రశ్నిస్తున్నారు. కూటమి నేతల ప్రోద్బలంతోనే ఈ దారుణానికి ఒడిగట్టారని ఆరోపిస్తున్నారు. విగ్రహం వద్ద 24 గంటలు పర్యవేక్షించే సీసీ కెమెరా ఉన్నా.. పోలీసుల కంటే ముందు టీడీపీ నేతలకు సమాచారం ఎలా చేరింది? తెలియాలన్నారు. విగ్రహం ధ్వంసం చేస్తుండగా వీడియో తీసిన వ్యక్తి వైపు నిందితుడు చూడటం వెనుక ఉన్న మర్మమేంటి? ఆ సమయంలో ఫోన్లో ఎవరితో మాట్లాడాడు? తెలియాల్సిందన్నారు. ఘటన జరిగిన నిమిషాల్లోనే నిందితుడికి 'మతిస్థిమితం లేదంటూ' హెల్త్ సర్టిఫికెట్లు పోలీసులు ఎలా సమకూర్చారు? చెప్పాలన్నారు. నంద్యాలలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా వైఫల్యం చెందిందని, పోలీసుల తీరు అత్యంత శోచనీయంగా ఉందని వైసీపీ నేతలు ధ్వజమెత్తారు. నిందితుడి వెనుక ఉండి నడిపించిన సూత్రధారులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి వైఎస్సార్ విగ్రహాన్ని పునరుద్ధరించాలని, లేనిపక్షంలో తామే స్వయంగా కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని హెచ్చరిస్తున్నారు.ఈ ఘటనపై పోలీసులు లోతుగా విచారణ జరిపి నిజానిజాలు తేల్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రాజకీయ ప్రయోజనాల కోసం మహానేత విగ్రహాన్ని ధ్వంసం చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిందితుడి వెనుక ఉన్న అసలు శక్తులు ఎవరో తేలాల్సి ఉంది.



# జిల్లాలో జూన్ 1న 2,21,359 మంది లబ్ధిదారులకు రూ.96.77 కోట్ల సామాజిక పింఛన్ల పంపిణీ

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**

**భీమవరం బ్యూరో చీఫ్ మే 31నంది పత్రిక** పశ్చిమ గోదావరి జిల్లాలో అర్హులైన లబ్ధిదారులకు సామాజిక భద్రతను మరింత బలోపేతంచేసే దిశగా జూన్ 1వ తేదీన విస్తృత స్థాయిలో సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం కింద జిల్లావ్యాప్తంగా 25 రకాల పింఛన్లకు సంబంధించి మొత్తం 2,21,359 మంది లబ్ధిదారులకు రూ.96,77,38,500 విలువైన పింఛన్లు పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు వెల్లడించారు. ప్రతి నెల మాదిరిగానే ఈసారి కూడా పింఛన్లను లబ్ధిదారులకు సమయానికి అందించేందుకు సంబంధిత స్వర్ణ వార్డు మరియు స్వర్ణ గ్రామ సిబ్బందికి అవసరమైన ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. జూన్ 1వ తేదీ ఉదయం నుంచే సిబ్బంది లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి నేరుగా పింఛన్లు అందజేయాలని స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని మండలాలు, పట్టణ ప్రాంతాల్లో పింఛన్ల పంపిణీ సజావుగా జరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. పంపిణీ ప్రక్రియలో పారదర్శకత, సమర్థత పాటించాలని అధికారులను ఆదేశించారు. వృద్ధులు, వికలాంగులు మరియు ఇతర లబ్ధిదారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా గౌరవప్రదంగా సేవలు అందించాలని సూచించారు.

పింఛన్ల పంపిణీ బాధ్యతలు నిర్వహిస్తున్న సిబ్బంది లబ్ధిదారులను ఆప్యాయంగా పలకరించి, మర్యాదపూర్వకంగా పింఛన్లు అందజేయాలని కలెక్టర్ ప్రత్యేకంగా సూచించారు. పంపిణీ సమయంలో ఎటువంటి సమస్యలు తలెత్తినా వెంటనే సంబంధిత ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ల దృష్టికి తీసుకెళ్లి తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి అర్హులైన లబ్ధిదారునికి పింఛన్ సకాలంలో చేరేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

**నియోజకవర్గాల వారీగా పింఛన్ల వివరాలు:** ఆచంట నియోజకవర్గంలో 28,230 మంది లబ్ధిదారులకు రూ.12,31,59,500

భీమవరం నియోజకవర్గంలో 30,075 మందికి రూ.13,18,72,500

నరసాపురం నియోజకవర్గంలో 26,600 మందికి రూ.11,50,59,000

పాలకొల్లు నియోజకవర్గంలో 28,584 మందికి రూ.12,47,94,500

తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో 30,378 మందికి రూ.13,41,32,500

తణుకు నియోజకవర్గంలో 34,867 మందికి



రూ.15,25,43,000 ఉండి నియోజకవర్గంలో 34,227 మందికి రూ.14,86,19,500

గణపవరం మండలంలో 8,398 మందికి రూ.3,75,58,000 పింఛన్లు నగదు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు..

# రజక ప్రతిభ పుష్కరాలకు దరఖాస్తులు చేసుకోండి...

**ప్రతిభ పురస్కారాల కరపత్రం ఆవిష్కరణ..**
**వ్యవస్థాపక అధ్యక్షులు సీపీ వెంకటేష్..**

**కర్నూలు నంది పత్రిక బ్యూరో ....**ఉమ్మడి కర్నూలు జిల్లాలోనీ,పది 450 ,ఇంటర్ 75%,డిగ్రీ 75%, పీజీ & బిటెక్75% లలో అధిక మార్పులు సాధించిన రజక విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్నామని కర్నూలు నంద్యాల జిల్లాలోని రజక జాతికి చెందిన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చని రజక విద్య సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు సిపి వెంకటేష్ పిలుపునిచ్చారు ఆదివారం కర్నూలు నగరంలోని స్థానిక అబ్దుల్లాఖాన్ ఎస్టేట్, స్కందా బిసినెస్ పార్క్, షాప్ అశీ 12, 2 వ అంతస్తు, రజక విద్యా సేవా సమితి కార్యాలయంలో 8వ రజక విద్యార్థుల ప్రతిభా పురస్కారాల కరపత్రం ఆ విష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రజక విద్య సేవా సమితి కమిటీ కరపత్రాలు ఆవిష్కరించారు ఈ సందర్భంగా రజక విద్యా సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు సీపీ వెంకటేష్ మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాలోని కర్నూలు నంద్యాల జిల్లాలోని అన్ని మండలాలు గ్రామాల్లో విద్యార్థుల్లో గ్రామాల లో కల రజక విద్యార్థులకు కర్నూల్ నంద్యాల జిల్లాలో పదవ తరగతిలో 450 మార్కులు ఇంటర్లో 750 మార్కులు డిగ్రీలు 75% పీజీలో పీజీ మరియుబిటెక్ 75% సాధించిన రజక విద్యార్థులకు కర్నూల్ రజక విద్యా సేవా తరపున ప్రతిభ పురస్కరాలు అందజేస్తున్నామని ఆయన తెలిపారు అర్హులైన విద్యార్థులు జులై 15తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు కర్నూల్ నగరంలోని స్థానిక అబ్దుల్లా ఖాన్, స్కంద బిజినెస్ పార్క్ లో గల కర్నూలు జిల్లా రజక విద్యా సేవా సమితి కార్యాలయానికి తమ దరఖాస్తులను పోస్టల్ ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ పంపవచ్చు అని తెలిపారు. ఇతర వివరాలకు జిల్లా రజక విద్యా సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు సిపి వెంకటేష్ ఫోన్ నెంబర్ 91110396511, 9959366426, 955509 34626 నెంబర్లను సంప్రదించి



పూర్తి వివరాలు తెలుసుకోగలరని సిపి వెంకటేష్ తెలిపారు. ఈ కరపత్రం ఆవిష్కరణ కార్యక్రమంలో రజక విద్యా సేవా సమితి ఉపాధ్యక్షులు సీనరసింహులు కోశాధికారి సిద్ధ నాగేష్ సంయుక్త కార్యదర్శి వీర శేఖర్ ,సీనియర్ జర్నలిస్ట్ మద్దూరు వెంకట్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు మద్దూరు వెంకటనారాయణ, నాగేష్, రమణ, మధు, అడ్వకేట్ జగదీశ్ తదితరులు పాల్గొన్నారు

# ఇండియా బుక్ ఆఫ్ రికార్డు, మిరాకిల్ వరల్డ్ రికార్డు లో స్థానం సాధించిన భవతి.

**నంద్యాల ప్రతినిధి. మే 31. (నంది పత్రిక ):**నంద్యాల కు చెందిన పల్లా రమేష్, స్వర్ణ దంపతుల కుమార్తె సాయి భవతి ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతుంది. చిత్రకళ లో కోటేష్ ఆర్ట్ అకాడమీ లో శిక్షణ తీసుకుంటుంది.ఈ సంవత్సరం జనవరి 23 న స్వాతంత్ర సమర యోధులు సుభాష్ చంద్రబోష్ జయంతి సందర్బంగా ఆర్ట్ అకాడమీ లో 13 అంగుళాల పొడవు,10 అంగుళాల వెడల్పు గల డ్రాయింగ్ చార్టు మీద 0.3 ఎం. ఎం. సైజు గల కుందన్ అనే రంగు రాళ్లను క్రమంగా అతికిస్తూ 3,775 రంగురాళ్ళతో నేతాజీ చిత్రాన్ని తయారు చేసింది. ఈ చిత్రాన్ని 4 గంటల సమయంలోనే చేసింది.ఈ చిత్రాన్ని తగిన ఆధారాలతో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్ కు మరియు మిరాకిల్ వరల్డ్ రికార్డు కు పంపడం జరిగింది. ఆయా రికార్డ్స్ ఎడిటర్స్ పరిశీలించి చాలా అద్భుతమైన రీతిలో వేసిందని సాయి భవతి కి అభినందనలు తెలుపుతూ ఎంతో ప్రతిష్టాత్మక మైన "ఇండియా బుక్ ఆఫ్ రికార్డు "సర్టిఫికెట్, గోల్డ్ మెడల్, గుర్తింపు కార్డు, బుక్, విలువైన పెన్ను కొరియర్ ద్వారా అందుకుంది. అలాగే "మిరాకిల్ వరల్డ్ రికార్డ్ "సర్టిఫికెట్, గోల్డ్ మెడల్, మెమంటో అందుకుంది. రెండు అరుదైన రికార్డ్స్ సాధించిన సాయిభవతికి ఆదివారం ఆర్ట్ అకాడమీలో అభినందన సభ ఏర్పాటు చేసి ఘనంగా సత్కరించి సర్టిఫికెట్స్, మెమంటోస్, గోల్డ్ మెడల్స్ వారి గురువు ప్రముఖ చిత్రకారుడు కళారత్న కోటేష్ చేతుల మీదుగా అందుకుంది.ఈ సందర్బంగా కోటేష్ మాట్లాడుతూ సాయి భవతి రెండు అరుదైన రికార్డ్స్ సాధించినందులకు ఎంతో సంతోషంగా వుంది.నేతాజీ చిత్రాన్ని చాలా అద్భుతమైన రీతిలో తయారు చేసింది.హృదయ పూర్వకమైన అభినందనలు, ఆశీస్సులు తెలుపు చున్నాను.మా ఆర్ట్ అకాడమీ లో 6 సంవత్సరాల నుండి చిత్రకళలో శిక్షణ తీసుకుంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో చిత్రలేఖనంలో 25 పైగా పతకాలు సాధించింది.ముఖ్యంగా ఇటువంటి ఆణిముత్యం మా ఆర్ట్ అకాడమీకి పంపిన వారి తల్లి దండ్రులకు హృదయ పూర్వక మైన అభినందనలు తెలుపుచున్నాను.రికార్డ్స్ హోల్డర్ సాయి భవతి మాట్లాడుతూ నేను తయారు చేసిన నేతాజీ చిత్రానికి రెండు అరుదైన రికార్డ్స్ రావడం చాలా సంతోషంగా వుంది.మంచి శిక్షణ ఇచ్చిన మా గురువు కోటేష్ కి కృతజ్ఞతలు తెలుపు చున్నానని తెలిపింది.



# విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో విశ్వబ్రాహ్మణ పేద విద్యార్థిని విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ







**కర్నూలు నంది పత్రిక బ్యూరో...**కైకలూరు నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో విశ్వబ్రాహ్మణ పేద విద్యార్థిని విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ మరియు వృద్ధులకు బియ్యము, పెన్షన్ మరియు కైకలూరు రూరల్ ఆర్టీ జాన్స్ క్లస్టర్ లోగో ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది కైకలూరు విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు తుపాకుల సోమాచారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ మంత్రివర్యులు కైకలూరు ఎమ్మెల్యే గౌరవనీయులు డాక్టర్ కామినేని శ్రీనివాస్ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కమ్మరి పార్వతమ్మ గారు పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా గౌరవ ఎమ్మెల్యే మరియు విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ కమ్మరి పార్వతమ్మ , విద్యార్థులకు నోటు పుస్తకాలను వృద్ధులకు పెన్షన్లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి రావు , మార్కెట్ యార్డ్ చైర్మన్ పెన్మత్స త్రినాధ రాజు , విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మోడేపల్లి నాగు , ఏలూరు జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం కన్వీనర్ అప్పలబక్తుల శివకేశవ , ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్వర్ణకార సంఘం అధ్యక్షులు బ్రహ్మశ్రీ పట్నాల శేషగిరిరావు , పశ్చిమ గోదావరి జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు నక్కా చైతన్య శ్రీనివాస్ , డాక్టర్ కొత్తపల్లి సత్యనారాయణ ఫోరం ఫర్ డెమోక్రసి ఏపీ కన్వీనర్,తదితరులు పాల్గొనడం జరిగింది...

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

# ఘనంగా మున్నూరు కాపు యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆవిర్భావ సమావేశం.

## నూతన అధ్యక్షుడిగా కొణతం సుభాష్ ఎన్నిక.

**కేసముద్రం, మే 31(నంది పత్రిక):** కేసముద్రం మున్సిపల్ పరిధిలోని విలేజ్ కేసముద్రంలో ఆదివారం మున్నూరుకాపు యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆవిర్భావ సమావేశం ఎంకే కన్వెన్షన్ హాలులో అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు నీలం శ్రీనివాస్, జిల్లా గౌరవ సలహాదారులు, అడ్వకేట్ తుంపిళ్ళ శ్రీనివాస్, మండల మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు కముటం శ్రీనివాస్ హాజరై ప్రసంగించారు. వక్తలు మాట్లాడుతూ యువత సమాజ ప్రగతికి చోదక శక్తులని, సంఘం బలోపేతానికి, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. మున్నూరు కాపు యువత విద్యా, ఆర్థిక, రాజకీయ రంగాలలో రాణించేందుకు ఈ అసోసియేషన్ ఒక అద్భుతమైన వేదికగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మున్నూరు కాపు యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ కేసముద్రం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొణతం సుభాష్, ప్రధాన కార్యదర్శిగా తోట సందీప్, కోశాధికారిగా తోట భరత్, ఉపాధ్యక్షులుగా కముటం రాహుల్, బండి వెంకటేష్, సంయుక్త కార్యదర్శిగా కముటం వంశీ, ప్రచార కార్యదర్శులుగా తుంపిల్ల రమేష్, కముటం రాకేష్, కార్యవర్గ సభ్యులుగా లక్కాకుల వంశీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంక్షేమ సంఘం మండల ప్రధాన కార్యదర్శి కముటం స్వామి, కోశాధికారి సింగంశెట్టి ఏకాంతం, కేసముద్రం టౌన్ ప్రెసిడెంట్, మున్సిపల్ కౌన్సిలర్ ఆగే రాము, గ్రామ మున్నూరు కాపు అధ్యక్షులు కముటం శ్రీరంగం, లక్కాకుల నరసయ్య, మున్నూరు కాపు పరపతి సంఘం అధ్యక్షులు మాసాడి శ్రీనివాస్, పరపతి సంఘం కోశాధికారి కముటం శ్రీధర్,



మున్నూరుకాపు సాంకేతిక విభాగం అధ్యక్షుడు పిన్ని రాము (న్యాయవాది), బొల్లు సోమేష్, లక్ష్మణ్, బండి రంజిత్, కొణతం రాంచందర్, మాసాడి అశోక్, తోట మోహన్, మార్తా సతీష్ తదితరులు పాల్గొని నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ తమపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తూ, యువత సమస్యల పరిష్కారానికి, సంఘం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు.







# రాజశేఖరరెడ్డి విగ్రహం ను పగల గొట్టడం దారుణం



**నంద్యాల ప్రతినిధి. మే 31. (నంది పత్రిక ):** నంద్యాల లోని శ్రీనివాససెంటర్ లో జరుగడం పిరికి పంధా చర్య అని టౌన్ అధ్యక్షుడు దాసరి చింతలయ్య కాంగ్రెస్ పార్టీ నేతలు అభివర్ణించడం జరిగింది.మహా నేత రాజ శేఖర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నేతగా భారత దేశం లో పేరు ప్రఖ్యాతులు పొందిన గొప్పా నాయకునిగా ప్రజల అభిమాన ము పొందిన మహా నేత ఇటువంటి సంఘటన జరుగడం బాధాకరంఇలాంటి సంఘటనలు జరగకుండా ఈ సంఘటనకు బాధ్యులను కటినంగా శిక్షించాలని కాంగ్రెస్ నాయకులు కోరుచున్నాము, టౌన్ అధ్యక్షుడు దాసరి చింతలయ్య , చింతల మోహన్ రావు, ప్రసాద్, సలాం, హమీద్ వాసు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# వైఎస్సార్ విగ్రహ ధ్వంసం దారుణం సిపిఐ తీవ్ర ఖండన!

## దుండగులను, వారి వెనుక ఉన్న సూత్రధారులను వెంటనే అరెస్ట్ చేయాలి. సిపిఐ

**నంద్యాల ప్రతినిధి. మే 31. (నంది పత్రిక ):** నంద్యాల పట్టణంలోని శ్రీనివాస సెంటరులో దివంగత ముఖ్య మంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేసిన ఘటనపై భారత కమ్యూనిస్టు పార్టీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ వికృత చేష్టను సిపిఐ తీవ్రంగా ఖండించింది.




ప్రజాదరణ పొందిన ఒక దివంగత నాయకుడి విగ్రహాన్ని నడిరోడ్డుపై పగలగొడుతుంటే రక్షణ కల్పించాల్సిన అధికార యంత్రాంగం ఏం చేస్తోందని సిపిఐ నాయకులు ప్రశ్నించారు. ఈ ఘటనపై కూటమి ప్రభుత్వం కనీసం నోరు విప్పకపోవడం శోచనీయమన్నారు. ఈ దారుణ ఘటనపై సిపిఐ నంద్యాల జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు, సహాయ కార్యదర్శి ఎస్.బాబా ఫకృద్దీన్, సిపిఐ పట్టణ కార్యదర్శి కె.ప్రసాద్ ఉమ్మడిగా ఒక ప్రకటన విడుదల చేశారు.నంద్యాల ప్రాంతంలో ఎంతో ప్రశాంతమైన వాతావరణం ఉంటుందని, గతంలో ఎన్నడూ ఇలాంటి దుశ్చర్యలు జరగలేదని వారు గుర్తుచేశారు. రాజకీయ విద్వేషాలతో విగ్రహాలను ధ్వంసం చేసే వికృత సంస్కృతి నంద్యాల ప్రశాంతతకు భంగం కలిగిస్తోందని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.పట్టణంలో ఇంత పెద్ద ఎత్తున విగ్రహ ధ్వంసం జరిగి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నా, పోలీస్ ఉన్నతాధికారులు కనీసం ఘటనా స్థలానికి వచ్చి సమీక్షించకపోవడంపై సిపిఐ నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. విగ్రహం ధ్వంసమై గంటలు గడుస్తున్నా ఉన్నతాధికారులు ఎందుకు అటువైపు కన్నెత్తి చూడలేదని, జిల్లాలో శాంతిభద్రతలను కాపాడటంలో పోలీసు యంత్రాంగం పూర్తిగా వైఫల్యం చెందిందని మండిపడ్డారు. ఆదివారం ఉదయం శ్రీనివాస సెంటర్ లో విగ్రహాన్ని పగలగొట్టిన వ్యక్తితో పాటు, ఈ దారుణానికి వెనుక ఉండి నడిపించిన అసలు సూత్రధారులు ఎవరనేది పోలీసులు తేల్చాలని సిపిఐ డిమాండ్ చేస్తుంది. ఎంతటి వారైనా సరే చట్టం ముందు నిలబెట్టాలని, నిందితులను తక్షణమే అరెస్ట్ చేయకపోతే సిపిఐ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యవాదులను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు. భవిష్యత్తులో ఇలాంటి ఉద్రిక్తతలకు తావులేకుండా నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు పోలీసు శాఖను డిమాండ్ చేశారు.

# వరంగల్‌లో మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం విజయవంతం.



## రాష్ట్ర కార్యదర్శి చందా గోపి పటేల్‌కు ఘన సన్మానం

**కేసముద్రం, మే 31(నంది పత్రిక):** తెలంగాణ మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ముఖ్య కార్యవర్గ సమావేశం వరంగల్‌లోని ఆకుతోట బ్యాంకెట్ హాల్ కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు సర్దార్ పుట్టం పురుషోత్తం రావు పటేల్ అధ్యక్షత వహించగా, నూతనంగా నియమితులైన రాష్ట్ర కార్యదర్శి చందా గోపి పటేల్ ని రాష్ట్ర మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు సర్దార్ పుట్టం పురుషోత్తం రావు పటేల్, మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్ది పెంటయ్య పటేల్ తో కూడిన రాష్ట్ర, జిల్లా నాయకత్వం శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. తనను ఇంతగా ఆదరించి సన్మానించినందుకు చందా గోపి పటేల్ రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా చందా గోపి పటేల్ మాట్లాడుతూ రాష్ట్ర కమిటి ఆదేశాల మేరకు మహబూబాబాద్ జిల్లాలో జిల్లా అధ్యక్షులు, జిల్లా ఇన్‌ఛార్జ్‌లు, జిల్లాలోని ముఖ్య నాయకులు, నియోజకవర్గ కోఆర్డినేటర్ల పూర్తి సహకారంతో నూతన గ్రామ, మండల, జిల్లా కమిటీ లను ఏర్పాటు చేసి, రాష్ట్ర సంఘానికి బలమైన చైన్ లింక్‌గా అనుసంధానం చేస్తామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం కోకాపేటలో కేటాయించిన ఆత్మగౌరవ భవన నిర్మాణంలో రాష్ట్రంలోని ప్రతి మున్నూరు కాపు బిడ్డ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ భవనాన్ని మున్నూరుకాపు జాతి ఆత్మగౌరవ ప్రతీకగా నిలుపుకోవడానికి మున్నూరు కాపు ఫౌండేషన్ ట్రస్ట్ బోర్డుకు ప్రతి ఒక్కరూ తమ వంతు ఆర్థిక సహాయం అందించాలని రాష్ట్ర నాయకత్వం పిలుపునిచ్చిందని గుర్తు చేశారు. కేసముద్రం విలేజ్ మున్నూరు కాపు యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ కు నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు కొంతం సుభాష్, ప్రధాన కార్యదర్శి తోట సందీప్, కోశాధికారి తోట భరత్, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.



# కల్వాల విద్యార్థినుల ఘన విజయం -ట్రిపుల్ ఐటీకి ముగ్గురి ఎంపిక.








**కేసముద్రం, మే 31(నంది పత్రిక):** కల్వాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఏం.సహస్ర, బి.నవ్య, బి.అనూష ప్రతిష్టాత్మకమైన బాసర ట్రిపుల్ ఐటీలో ప్రవేశానికి ఎంపిక కావడం పట్ల పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఈ ముగ్గురు విద్యార్థినులు తమ కృషి, పట్టుదల, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంతో ఈ అరుదైన విజయాన్ని సాధించడం అభినందనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బండారు నరేందర్ తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా ఉన్నత లక్ష్యాలను సాధించగలరని నిరూపించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థినులకు పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు, పూర్వ విద్యార్థులు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

# నైతిక విలువలు, వృత్తి నైపుణ్యాలతోనే జర్నలిజానికి విశ్వసనీయత..!




## రాష్ట్ర సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్ రాష్ట్ర సీఆర్ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో వైఎస్సార్ కడప జిల్లా గ్రామీణ విలేకరుల రెండు రోజుల పునశ్చరణ శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమం

**కడప, బ్యూరో చీఫ్ మే 31 నంది పత్రిక** జర్నలిజంలో నైతిక విలువలు, వృత్తి నైపుణ్యం, ఖచ్చితత్వం, సామాజిక బాధ్యతలను పెంపొందించుకోవడం ద్వారానే మీడియా పట్ల ప్రజల్లో విశ్వాసం మరింత బలపడుతుందని రాష్ట్ర సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్ అన్నారు.

ఆదివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో రాష్ట్ర సీఆర్ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో వైఎస్సార్ కడప జిల్లా గ్రామీణ విలేకరులకు నిర్వహించిన రెండు రోజుల పునశ్చరణ శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా ఆలపాటి సురేశ్ కుమార్ మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే విలేకరులు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. సమాజంలోని సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. మీడియా స్వేచ్ఛ అనేది బాధ్యతతో కూడుకున్నదని, ప్రజాస్వామ్య వ్యవస్థలో జర్నలిస్టులు వాస్తవాధారిత వార్తలను మాత్రమే ప్రజలకు అందించాల్సిన బాధ్యత ఉందన్నారు. నిర్ధారణ లేని సమాచారాన్ని ప్రచారం చేయడం వల్ల వ్యక్తులకు, సంస్థలకు, సమాజానికి నష్టం కలిగే అవకాశం ఉందని హెచ్చరించారు.స్వాతంత్ర్యోద్యమ కాలంలో ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు పత్రికలు కీలక పాత్ర పోషించాయని, అనంతరం ప్రభుత్వ విధానాలను ప్రజలకు చేరవేయడంలో మీడియా ప్రధాన వేదికగా నిలిచిందని గుర్తుచేశారు. అయితే కాలక్రమేణా మీడియా రంగంలో పెరిగిన పోటీ, వాణిజ్య ధోరణులు, పక్షపాత వైఖరులు జర్నలిజం విలువలను దెబ్బతీసే పరిస్థితులను తీసుకువచ్చాయని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో నిష్పాక్షికత, నిజాయితీ, ప్రజాహితం వంటి మూల సూత్రాలను జర్నలిస్టులు మరింత బలంగా పాటించాల్సిన అవసరం ఉందన్నారు.సోషల్ మీడియా ప్రభావం రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో, ప్రతి సమాచారాన్ని వార్తగా పరిగణించకుండా దాని నిజానిజాలను నిర్ధారించిన తర్వాతే ప్రచారం చేయాలని సూచించారు. జర్నలిస్టుల స్వేచ్ఛ ప్రజాస్వామ్యానికి బలం అయినప్పటికీ, ఆ స్వేచ్ఛను బాధ్యతాయుతంగా వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు.

రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో కడప జిల్లా జర్నలిస్టులు చురుకుగా పాల్గొని వివిధ అంశాలపై తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారని ఆయన తెలిపారు. భవిష్యత్తులో కూడా గ్రామీణ జర్నలిస్టుల నైపుణ్యాభివృద్ధి కోసం మరిన్ని శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.అనంతరం.. రెండు రోజుల పునశ్చరణ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా జర్నలిస్టులకు రాష్ట్ర సీఆర్ మీడియా అకాడమీ తరపున చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్ చేతుల మీదుగా జర్నలిజంపై అవగాహన పెంచే పుస్తకాల బ్యాగు,

సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఏడి పద్మజ, ఏపీయూడబ్ల్యూజే యూనియన్ రాష్ట్ర నాయకులు రామసుబ్బారెడ్డి, సీనియర్ జర్నలిస్టులు, జిల్లాలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా విలేకర్లు, వీడియో గ్రాఫర్లు, ఫోటోగ్రాఫర్లు తదితర మీడియా రంగ ప్రతినిధులు హాజరయ్యారు.

# సమ్మర్ కోచింగ్ క్యాంప్ ఉత్సవాల్లో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్.

నేడు ఉప్పల్ లో సమ్మర్ కోచింగ్ క్యాంపు ఉత్సవాళ్ళో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్ విద్యార్థులు మార్చ్ ఫాస్ట్ తో చేసిన గౌరవ వందనం స్వీకరించారు. విద్యార్థులతో కలిసి ఫోటోలు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ: ఈకాలంలో పొద్దున్నుంచి రాత్రి దాకా చదువు తప్ప ఇంకోటి లేదు. అదొక్కటే సరిపోదు, సంపూర్ణత్వం ఇవ్వదు. విద్యార్థికి తనకాళ్ళ మీద తను నిలబడేలా విద్య ఉండాలి, తప్ప మార్కులే పరమావధి కాకూడదు.అన్నిటినీ తట్టుకొని నిలబడే మానసిక స్థైర్యం అందించేవి క్రీడలు. ప్రభుత్వంతో పాటు అనేక మంది క్రీడాభిమానులు కలిసి ఈ క్యాంప్ నిర్వహించారు. కోచింగ్ ఇచ్చిన టీచర్లకు, ఓపికగా తీసుకువచ్చిన తల్లిదండ్రులకు, నిర్వాహకులకు, అధికారులకు నా హృదయపూర్వక అభినందనలని ఎంపీ అన్నారు.మనం కనకూడని వినకూడని అనేక రుగ్మతలు వెంటాడుతున్నాయి.. వాటి నుంచి దూరం చేయగలిగిన సత్తా క్రీడలకు ఉంది. క్రీడలను ప్రోత్సహిద్దాం మంచి విద్యార్థులను తయారు చేద్దాం అని ఈటల రాజేందర్ పిలుపు ఇచ్చారు. ఈ సెలవుల్లో విద్యార్థులకు సమయం వృథా కాకుండా ఈ క్రీడల క్యాంప్ నిర్వహించడం సంతోషం. మన ప్రధాని నరేంద్ర మోడీ దేశంలో పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే, నషా ముక్త్ భారత్ కావాలంటే, పిల్లలు పక్కదోవ పట్టకుండా ఉండాలంటే, శరీర దారుఢ్యం పెరగాలంటే క్రీడలను ప్రోత్సహించాలని పిలుపు ఇచ్చారు.

# నంద్యాలలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదు.. మంత్రి ఎన్ఎండి ఫరూక్ హెచ్చరిక





## వైఎస్సార్ విగ్రహం ధ్వంసం వెనుక వైకాపా కుట్రపూరిత రాజకీయాలు : మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డి

**నంద్యాల సిటీ బ్యూరో మే 31 ( నంది పత్రిక )** రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించి, అలజడులు సృష్టించేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కుట్రపూరిత డ్రామాలకు తెరలేపుతున్నారని రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు . ఈరోజు నంద్యాల పట్టణంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి ఎన్ఎండి ఫరూక్ గారితో పాటు రాష్ట్ర రోడ్లు , భవనాలు మౌలిక సదుపాయాలు శాఖ మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డి, జోనల్ 5 టిడిపి ఇంచార్జ్ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ నంద్యాల పట్టణం ఎల్లప్పుడూ ప్రశాంతతకు, మతసామరస్యానికి మారుపేరని, ఇక్కడి ప్రశాంత వాతావరణాన్ని దెబ్బతీసేందుకు కొందరు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారన్నారు . నంద్యాలలో చోటుచేసుకున్న వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం ధ్వంసం ఘటనపై మంత్రి స్పందిస్తూ, ఆ విగ్రహాన్ని తాము పగులగొట్టాల్సిన అవసరం తమకు లేదని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో, రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్రంలో అలజడులు సృష్టించేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులే ఈ విధమైన చౌకబారు విమర్శలు మరియు నాటకాలకు తెరలేపుతున్నారని మండిపడ్డారు. గతంలో కోడికత్తి డ్రామాలు ఆడిన చరిత్ర వారిదేనని, ఇప్పుడు కూడా అలాంటి కుతంత్రాలనే పునరావృతం చేస్తున్నారని విమర్శించారు.

నంద్యాలలో మైనార్టీ వర్గానికి చెందిన వ్యక్తి మంత్రిగా ఉన్నారనే అక్కసుతో, ఇక్కడి నుండి బేస్ చేసుకుని రాష్ట్రవ్యాప్తంగా అల్లర్లు సృష్టించాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసు ఉన్నతాధికారులతో తాము ఇప్పటికే మాట్లాడామని, నిష్పక్షపాతంగా విచారణ జరపాలని, ఇటువంటి పనికిమాలిన పనులు చేసే అరాచక శక్తులను మరియు దోషులను కఠినంగా శిక్షించాలని ఆదేశించినట్లు మంత్రి ఫరూక్ తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు మంత్రి లోకేష్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ముందుకు దూసుకుపోతోందని మంత్రి ఫరూక్ తెలిపారు . నిరుద్యోగుల కోసం మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుంటే, ప్రతిపక్షాలు కోర్టులకు వెళ్లి అడ్డుపడే ప్రయత్నం చేశాయని ధ్వజమెత్తారు. రాయలసీమ ప్రాంతంలో భూగర్భ జలాల రీఛార్జ్ కోసం, తాగునీరు మరియు సాగునీటి సరఫరా కోసం ప్రభుత్వం రాత్రింబవళ్లు శ్రమిస్తోందని, ఎండకాలంలో కూడా ఎక్కడా విద్యుత్ కోతలు లేకుండా నిరంతర సరఫరా అందిస్తున్నామని గుర్తుచేశారు. రైతులకు మద్దతు ధర ఇచ్చి జొన్నలు, మామిడి కాయలు వంటి పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందని వివరించారు. తాము ఎప్పుడూ శాంతియుత రాజకీయాలనే నమ్ముకున్నామని, సుమారు 45 ఏళ్లుగా ఒకే పార్టీలో ఉంటూ ప్రజాసేవ చేస్తున్నానని, ఎన్నడూ పార్టీలు మారలేదని మంత్రి ఫరూక్ తెలిపారు. ఇటువంటి అరాచక శక్తుల ఆటలు సాగనివ్వబోమని, ప్రజలంతా వాస్తవాలను గమనిస్తున్నారని ఆయన తెలిపారు . నంద్యాల ప్రశాంతతకు భంగం కలిగించేలా ఎవరు వ్యవహరించినా చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ సందర్భంగా మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఈరోజు ఉదయం నంద్యాల పట్టణంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి గారి విగ్రహాన్ని వైకాపా అనుచరుడే స్వయంగా ధ్వంసం చేసి, ఆ నెపాన్ని తెలుగుదేశం పార్టీపై నెట్టేందుకు ఒక పక్కా ప్లాన్ ప్రకారం ప్రయత్నించాడని ఆధారాలతో సహా నిరూపించారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితుడు 'చాకలి జంబులయ్య' అనే వ్యక్తి అని, అతను వైకాపా స్థానిక కౌన్సిలర్ మరియు మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి అనుచరుడనడానికి తగిన ఫోటో ఆధారాలను మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మీడియాకు విడుదల చేశారు. నిందితుడు జంబులయ్య, అతని భార్య వైకాపా నాయకులతో కలిసి ఉన్న ఫోటోలను సాక్ష్యాలుగా చూపించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి విధ్వంసాలు సృష్టించడం, అల్లర్లు లేపడం కొత్తేమీ కాదని, అది వారి సంస్కృతిలోనే ఉందని మంత్రి విమర్శించారు. గతంలో అధికారంలోకి రావడానికి 'కోడికత్తి డ్రామా' ఆడారని, మొన్నటి ఎన్నికలలో జనాదరణ కోల్పోయాక సానుభూతి కోసం 'గులకరాయి నాటకం' ఆడారని గుర్తుచేశారు. చివరకు సొంత బాబాయ్ వై.ఎస్. వివేకానంద రెడ్డి ని దారుణంగా నరికి చంపించి, ఆ బ్లేమ్‌ను ఇతరులపై వేయడానికి ప్రయత్నించిన అరాచక చరిత్ర జగన్ మోహన్ రెడ్డి దని మంత్రి తెలిపారు . ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, నిరుద్యోగ నిర్మూలనపై దృష్టి పెట్టిందని మంత్రి స్పష్టం చేశారు. మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగాల భర్తీ చేస్తుంటే, ఆ అపఖ్యాతిని కప్పిపుచ్చడానికి వైకాపా ఈ విధమైన చిల్లర రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. రాయలసీమలో ఫ్యాక్షనిజాన్ని అంతమొందించి, ప్రశాంత వాతావరణాన్ని తీసుకొచ్చిన ఘనత చంద్రబాబు నాయుడు గారిదేనని, తప్పు చేసిన వారు ఏ పార్టీకి చెందిన వారైనా చట్టం ముందు సమానులేనని ఆయన అన్నారు.

# హింసాత్మక ఘటనలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించం

అక్రమ మైనింగ్, అసత్య ప్రచారాలపై అప్రమత్తంగా ఉండాలి

రాజకీయ ప్రయోజనాల కోసం వ్యక్తిగత దాడులు తగవు

సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలి

దాడి ఘటనపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఆదేశాలు

రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి

**విజయవాడ బ్యూరో చీఫ్ మే 31నంది పత్రిక** ఆగిరిపల్లి మండలం శోభనాపురం గ్రామానికి చెందిన నక్కనబోయిన సాంబశివరావు యాదవ్‌పై ఇటీవల జరిగిన దాడి ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఈ ఘటన గురించి సమాచారం అందిన వెంటనే సంబంధిత పోలీసు అధికారులను అప్రమత్తం చేసి, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు మంత్రి పేర్కొన్నారు. ఇటువంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు శాఖకు సూచించినట్లు వెల్లడించారు. సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్న మంత్రి. రాజకీయ నాయకులు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించి ఎలాంటి హింసాత్మక చర్యలను ప్రోత్సహించరాదన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో విభేదాలు చర్చలు, చట్టబద్ధ మార్గాల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు.సోషల్ మీడియా ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడానికి, వాస్తవాలను ప్రజలకు చేరవేయడానికి ఉపయోగపడాలని, వ్యక్తిగత దూషణలు, అసత్య ప్రచారాలు, అభండాలు వేయడానికి దానిని వినియోగించడం సమాజానికి హానికరమని మంత్రి పేర్కొన్నారు.రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల నిర్మాణంలో గ్రేవల్‌తో పాటు ఇతర ఖనిజ వనరులు కీలకమని, మైనింగ్ కార్యకలాపాలు పూర్తిగా చట్టబద్ధంగా, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా జరగాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. అక్రమ మైనింగ్‌ను అరికట్టడం ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని తెలిపారు.రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను పక్కనపెట్టి ప్రజల్లో అపోహలు సృష్టించే ప్రయత్నాలు చేయడం బాధాకరమని పేర్కొన్న మంత్రి. అధికారులను, వ్యాపార వర్గాలను భయభ్రాంతులకు గురిచేసే చర్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు.రాజకీయ ప్రయోజనాల కోసం వ్యక్తిగత దాడులు చేయడం, శాంతిభద్రతలకు భంగం కలిగించడం సమంజసం కాదని స్పష్టం చేసిన మంత్రి కొలుసు పార్థసారథి, సమాజ శ్రేయస్సు కోసం అందరూ సంయమనం పాటిస్తూ చట్టాన్ని గౌరవించాలని, బాధ్యతాయుతమైన పౌరులుగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు.

# ఉద్యమకారులకు తెలంగాణ సమాజం అండగా నిలవాలి.



తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగాలు చేసిన కుటుంబాలతో పాటు ఎన్నో పోరాటాల్లో భాగమైన తెలంగాణ ఉద్యమకారులను గత బిఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసింది.కాంగ్రెస్ అధికారంలోకి వస్తే, ఉద్యమకారులను గుర్తించి అందరికి 250 గజాల ఇంటి స్థలాన్ని ఇస్తామని హామీ ఇచ్చి రెండున్నర సంవత్సరాలు దాటిన తర్వాత ఇప్పుడు గుర్తింపుకోసం కమిటీని వేసింది అందుకు ప్రభుత్వాన్ని అభినందిస్తున్నం. ప్రభుత్వం మొదలుపెట్టిన కార్యక్రమాన్ని అమలు చేయించుకోవడం కోసం తెలంగాణ ఉద్యమకారులు ఐక్య పోరాటాల ద్వారా వారి హక్కులను సాధించుకోవాలని, రాష్ట్ర సాధన కోసం త్యాగపూరిత పోరాటాలు చేసిన ఉద్యమకారులకు తెలంగాణ సమాజం అండగా నిలవాలని తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ గోధుమల కుమారస్వామి అన్నారు.ఉద్యకారుల హక్కుల సాధన కోసం హనుమకొండ జిల్లా కేంద్రం ఏకశిల పార్క్ టానూ నాయక్ విగ్రహం నుండి అమరవీరుల స్థూపం,అంబేద్కర్ సెంటర్ వరకు జరిగిన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సబ్బండ వర్గాల వారు త్యాగపూరిత ఉద్యమాలు చేసినారని, రాష్ట్ర సాధన వల్ల తెలంగాణలోని అన్ని రాజకీయ పార్టీల బడా నాయకులు, ఉద్యోగస్తులు,పెద్ద వ్యాపారస్తులు బాగుపడ్డారని, తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉద్యమాలు చేసి వారి విలువైన ప్రాణాలను, సమయాన్ని పోగొట్టుకొని త్యాగపూరిత ఉద్యమాలు చేసిన ఉద్యమకారులు మాత్రం కనీస గుర్తింపుకు నోచుకోక అన్యాయానికి గురయ్యారని అన్నారు. బిఆర్ఎస్ పాలనలో నిర్లక్ష్యానికి గురైన ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ న్యాయం చేస్తానని,తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి వారికి 250 గజాల ఇంటి స్థలాలను ఇస్తామని ఎన్నికల వేళ ప్రకటించి అధికారంలోకి వచ్చి రెండున్నర ఏండ్లు గడిచిన తర్వాతనైనా కమిటీని వేయడం అభినందనీయం యుద్ధ ప్రాతిపదికన పునరావాసం కల్పన కార్యక్రమాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నం. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ ఉద్యమకారుల ఐకాస రాష్ట్ర కో కన్వీనర్ సాధం రాజన్న మాట్లాడుతూ తెలంగాణ కోసం పోరాటం చేసిన ఉద్యమకారులు నేడు వారి హక్కుల కోసం పోరాటం చేయాల్సిన అవసరం ఏర్పడిందని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని ఉద్యమకారులను గుర్తించి వారికి సహాయం అందించడం కోసం ఏర్పాటు చేసిన కమిటి తాత్సార్యం చేయకుండా ఉద్యమకారులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, అన్ని ప్రభుత్వ పథకాలలో ఉద్యమకారులకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆల్ ఇండియా ఒబిసి జాక్ చైర్మన్ సాయిని నరేందర్ మాట్లాడుతూ ప్రభుత్వం నియమించిన కమిటీ విధి విధానాలను వెంటనే ప్రకటించాలని, ఉద్యమకారుల గుర్తింపు కోసం సీనియర్ ఉద్యమకారులు లేకుండా రాజకీయ నాయకులతో కమిటీ వేస్తే అది రాజకీయ పార్టీల మధ్య గొడవలకు దారి తీస్తుంది తప్ప ఉద్యమకారులను గుర్తించి సంక్షేమం అందించేదిగా ఉండదని అన్నారు. రాజకీయాలకు, రాజకీయ పార్టీలకు అతీతంగా ఉద్యమకారులను గుర్తించాలని, ఉద్యమకారుల భాగస్వామ్యంతో కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లాకు ఒక ఉద్యమకారుల కమిటీ వేయడం మంచిదని, ఉద్యమకారులను గుర్తించడానికి ప్రాతిపదిక ఏంటో అనే విషయంలో ప్రభుత్వ పెద్దలు మల్లగుల్లాలు పడుతున్నారనీ అన్నారు. ఆయా రంగాల్లో ఉద్యమించిన వారిని తెలంగాణ ఉద్యమకారులుగా గుర్తించి వారికి గుర్తింపు కార్డులు జారీ చేస్తే చాలా గౌరవంగా ఉంటుందని అన్నారు. ఈ ర్యాలీలో వివిధ సంఘాల నాయకులు జైసింగ్ రాథోడ్, భట్టు రాజేందర్, నవరత్న ఆనంద్, సయ్యద్ గౌస్, చాపర్తి కుమార్ గాడ్గే, జన్ను పద్మ, ఎదునూరి రాజమౌళి, జల్లెల కృష్ణమూర్తి, కొడపాక దేవి, డోలక్ యాదగిరి, రామగిరి బిక్షపతి, సమ్మయ్య రాథోడ్, రజనీ కాంత్, సురాసి విక్రమ్, తాడిశెట్టి క్రాంతి కుమార్, శోభ, జుబేర్, నయీం, ఠాకూర్ మోతీ సింగ్, దొమ్మాటి రవీందర్, గంధం గంధం శోభ, పూలక్క, చెరుకు ప్రవీణ్ కుమార్.

# ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలు గురించి ప్రకటించాలి.



**కేసముద్రం, మే 31(నంది పత్రిక)**:కేసముద్రం మున్సిపల్ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆదివారం కేసముద్రం మండల తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఉద్యమకారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు చాగంటి కిషన్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులను గుర్తించడానికి వేసిన కె.కేశవరావు కమిటీ వెంటనే తన నివేదికను ప్రభుత్వానికి అందజేయాలని, ప్రభుత్వం కాలయాపన చేయకుండా చిత్తశుద్ధితో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలుపరచాలని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులను త్వరితగతిన గుర్తించి, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలిపారు. పిసిసి సభ్యులు గుగులోత్ దస్రూనాయక్ కాంగ్రెస్ 2023 ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన అంశాలైన తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల నివాస స్థలం, డబుల్ బెడ్ రూం, ఉద్యమకారుల గుర్తింపు, మరణించిన ఉద్యమకారుల కుటుంబాలకు రూ.10 లక్షల ఆర్థిక సహాయం, అర్హత ఉన్న ఉద్యమకారులకు ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కేసముద్రం మండల ఉద్యమకారుల ఫోరం ప్రధాన కార్యదర్శి షేక్ ఖాదర్, విద్యార్థి, యువజన జెఎసి పూర్వ కన్వీనర్ దండు శ్రీనివాస్, గంధసిరి సోమయ్య, దామరకొండ ప్రవీణ్ కుమార్, శివారపు శ్రీధర్, చిట్యాల వీరన్న, తుంపిల్ల వెంకన్న, కొలిపాక వెంకన్న, కర్పూరపు మురళి, కూన భద్రాద్రి, నాయిని స్వామి, వంగాల అశోక్, జనిగెల కొమురయ్య, జనిగెల పరమేశ్వర్, పాకనాటి కృష్ణారెడ్డి, చాగంటి రాములు, బాలు మోహన్, సోమారపు వెంకటయ్య, చుంచు సూరయ్య, కీర్తి సమ్మయ్య, వాంకుడోత్ సూర్య, గాండ్ల మలేంద్రం, మాందాటి ఆంజనేయులు, వీరబోయిన సుమన్, ఆంగోత్ రమేష్ నాయక్, నాగరబోయిన చంద్రకళ పాల్గొన్నారు.

# కార్మికుల హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమించాలి.



**కేసముద్రం, మే 31(నంది పత్రిక)**:కేసముద్రం మండలం ఉప్పరపల్లి గ్రామంలో ఆదివారం మేడే మాసోత్సవాలలో భాగంగా ఏఐసీటియు కార్మిక సంఘం జెండాను గ్రామీణ హమాలి పెద్దమనిషి పలుస సంపత్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐసిటియు జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న మాట్లాడుతూ కార్మికులందరూ హక్కుల సాధన కొరకై ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడి దారులకు, కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. ఎన్నో ప్రాణ త్యాగాలతో సాధించుకున్న చట్టాలను కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్ లుగా మార్చివేసిందని, ఇది కార్మిక వర్గానికి ఎంతో నష్టదాయకమని, ఈ విధానమును వెంటనే ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వం దృష్టికి అనేక ఆందోళన, పోరాటాల రూపాలలో తీసుకుపోతున్నా ఏమి పట్టనట్లుగా వ్యవహరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బట్టు మురళి, సకినాల నరేష్, అంకిరెడ్డి వీరన్న, మర్పల యాకయ్య, కంకల శ్రీనివాస్, నూకల యాకయ్య, ఏర్పుల రాజాలు, కొండ్రెడ్డి విజేందర్, మెండే యాకస్వామి, అల్లి అశోక్, మర్పాల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో కొనసాగుతున్న గంజాయి 'రాపిడ్ టెస్టులు'..

### జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, డ్రగ్ డిటెక్షన్ కిట్లతో ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు..



**మదనపల్లి, బ్యూరో చీఫ్ మే 31: నంది పత్రిక** అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనే లక్ష్యంగా పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాల మేరకు ఎన్‌డీపీఎస్ (ఎన్డీపీఎస్) కేసుల్లో పట్టుబడిన నిందితులకు, అనుమానితులకు అత్యాధునిక 'రాపిడ్ డ్రగ్ టెస్ట్'లను నిర్వహిస్తున్నారు. ప్రత్యేకంగా తెప్పించిన 'డ్రగ్ డిటెక్షన్ కిట్ల' ద్వారా నిందితులు మత్తు పదార్థాలు సేవించారా లేదా అన్నది అక్కడికక్కడే నిర్ధారిస్తున్నారు. అయితే, జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు ఈ కిట్ల ద్వారా పరీక్షలు నిర్వహించిన నిందితులందరికీ డ్రగ్స్ అలవాటు లేనట్లు 'నెగిటివ్' నివేదికలు వచ్చాయని పోలీసు అధికారులు వెల్లడించారు. మత్తు సంస్కృతికి యువత బానిస కాకుండా ముందస్తు జాగ్రత్తగా ఈ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. జిల్లాలో గంజాయి రవాణా, విక్రయాలకు అడ్డుకట్ట వేసేందుకు నిరంతరం నిఘా కొనసాగుతుందని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని పోలీసు అధికారులు హెచ్చరించారు.



# మనిషి జీవితాశయంలో... ఆశకు హద్దుండాలి.

మానవ జీవితం ఒక అన్వేషణ. పుట్టుకకు, మరణానికి మధ్య సాగే ఈ ప్రయాణంలో మనిషి నిరంతరం ఏదో ఒకదాని కోసం ఆరాటపడుతూనే ఉంటాడు. నాగరికత పెరిగింది, సాంకేతికత విస్తరించింది, సౌకర్యాలు పెరిగాయి. కానీ, మనిషి అంతరంగంలో ప్రశాంతత మాత్రం కరువైంది. ఎందుకిలా జరుగుతోంది? ఈ గందరగోళానికి కారణం ఏమిటి? లోతుగా ఆలోచిస్తే, మనిషి జీవితంలో రెండు మహా ప్రశ్నలు ఎల్లప్పుడూ అతనిని వేధిస్తూ, వెంటాడుతూ ఉంటాయని అర్థమవుతుంది. అవే ఎంతవరకు? ఎందుకొరకు? ఈ రెండు ప్రశ్నలూ పైకి వేరువేరుగా కనిపించినా, నిజానికి ఇవి ఒకే నాణేనికి ఉన్న రెండు వైపుల లాంటివి. ఎంతవరకు అనేది మనిషి ఆలోచనలకు, కోరికలకు ఉండవలసిన హద్దును గురించి అడిగితే, ఎందుకొరకు అనేది ఆయా పనుల వెనుక ఉన్న అసలైన ప్రయోజనాన్ని, అంతరార్థాన్ని ప్రశ్నిస్తుంది. ఈ రెండు ప్రశ్నలకు సరైన సమాధానాలు కనుగొన్న మనిషి మాత్రమే సమాజంలో నిజమైన జ్ఞాని అవుతాడు. ఈ సత్యాన్ని గ్రహించలేక, కనుగొనలేనివాడు జీవితమనే చీకటి అడవిలో దారి తెలియక నిరంతరం తడబడుతూనే ఉంటాడు.నేటి ఆధునిక మనిషి నిరంతరం ఏదో ఒకటి సాధించాలనే తాపత్రయంతో, గమ్యం తెలియని పరుగు తీస్తున్నాడు. అతనికి ధనం కావాలి, సమాజంలో గొప్ప పదవి కావాలి, నలుగురిలో ప్రత్యేక గుర్తింపు కావాలి, అందరి నుండి ప్రేమ కావాలి, మనసుకు శాంతి కావాలి ఇలా అన్నీ కావాలి. కానీ, ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే, అనుకున్నవన్నీ పొందగలిగిన తర్వాత కూడా మానవ మనసు తృప్తి పడదు. ఇంకా ఏదో వెలితి వెంటాడుతూనే ఉంటుంది. ఎందుకు? ఎందుకంటే కోరిక స్వభావమే అంత. ఒక కోరిక తీరగానే, దాని స్థానంలో మరొక కొత్త కోరిక పుడుతుంది. ఇది ఒక అంతులేని వలయం.మహాత్మా గౌతమ బుద్ధుడు ఈ విశ్వజనీన సత్యాన్ని రెండువేల ఐదువందల సంవత్సరాల క్రితమే లోతుగా గ్రహించాడు. అందుకే ఆయన తృష్ణయే (కోరికయే) సమస్త దుఃఖానికి మూలం అని ప్రపంచానికి చాటిచెప్పాడు. అయితే, దీని అర్థం మనిషి కోరికలను అన్నింటినీ పూర్తిగా వదిలేసి సన్యాసిగా మారిపోవాలని కాదు. ఇది కోరికలకు ఒక హేతుబద్ధమైన, వివేకవంతమైన హద్దు పెట్టుకోమని మనల్ని హెచ్చరిస్తుంది.ఇక్కడే ఎంతవరకు అనే ప్రశ్న అత్యంత కీలకమైనదిగా మారుతుంది. ఉదాహరణకు, ఒక రైతు తన పొలం ఎంతవరకు విస్తరించాలని కోరుకోవాలి? తను ప్రతిరోజూ నడవగలిగినంత దూరమా? లేక తన ఒక జీవితకాలంలో సొంతంగా సాగుచేయగలిగినంత భూమా? లేక తన కళ్ళకు కనిపించే సరిహద్దులంతటా? రష్యన్ మహా రచయిత లియో టాల్‌స్టాయ్ తన విఖ్యాత కథ ఒక మనిషికి ఎంత భూమి కావాలి?లో మానవుని దురాశను అత్యంత అద్భుతంగా, కళ్ళకు కట్టినట్లు చిత్రించాడు. అందులో పఖోమ్ అనే రైతు ఎక్కువ భూమిని సంపాదించాలనే ఆశతో సూర్యాస్తమయం లోపు ఎంత దూరం వీలైతే అంత దూరం పరిగెడుతూ, చివరికి అలసటతో ప్రాణాలు కోల్పోతాడు. అంతిమంగా అతనికి కావలసిన భూమి ఎంత అంటే కేవలం అతని శరీరాన్ని పూడ్చడానికి సరిపోయే ఆరు అడుగుల సమాధి మాత్రమే! ఈ కథ ఒక శాశ్వతమైన తాత్విక హెచ్చరిక. జీవితంలో ఎంతవరకు అని ప్రశ్నించుకోని మనిషి, చివరికి తన జీవితాన్ని తానే కోల్పోతాడు.మరోవైపు, ఎందుకొరకు అనే ప్రశ్న మరింత లోతైనది, అంతరంగాన్ని కదిలించేది. ఒక మనిషి సమాజంలో బాగా ధనవంతుడు కావాలని కోరుకుంటాడు. అది తప్పు కాదు. కానీ, ఇక్కడ ఎందుకోసం? అని ప్రశ్నించుకోవాలి. ఆ సంపాదన కుటుంబ సంక్షేమానికా? నలుగురికీ సాయపడే సమాజ సేవకా? తన సొంత విలాసవంతమైన సుఖానికా? లేక పక్కవాడిని మించిపోవాలనే అహంకారానికా? ఒకే కోరిక, కానీ దాని వెనుక వేరువేరు ఉద్దేశాలు ఉన్నాయి. ఉద్దేశం మారితే మొత్తం ఆ కోరిక స్వభావమే మారిపోతుంది. ఆ ఉద్దేశం వెనుక ఉన్న అర్థం మారితే, మనిషి జీవిత గమనం మారుతుంది. అందుకే ప్రాచీన తత్వవేత్తలు అంటారు కోరిక కంటే, ఆ కోరిక వెనక ఉన్న అసలైన కారణం చాలా ముఖ్యమైనది.గ్రీకు తత్వవేత్త అరిస్టాటిల్ ఎందుకొరకు అనే ప్రశ్నకు ఒక అద్భుతమైన సమాధానం ఇచ్చాడు. ఆయనే 'యూడైమోనియా' (జుబఘుఱఅఎశీఅఱు) అనే పదాన్ని ప్రతిపాదించాడు. దీని అర్థం మానవ వికాసం లేదా ఆత్మసంతృప్తి. మనిషి ప్రతి చిన్న పని చేయడానికి వెనక ఒక పరమ ప్రయోజనం ఉంటుంది. అది సంపూర్ణమైన, అర్థవంతమైన జీవితం జీవించడం. ధనం, కీర్తి, పదవి ఇవన్నీ ఆ పరమ ప్రయోజనాన్ని అందుకోవడానికి పనికొచ్చే సాధనాలు మాత్రమే, కానీ అవే అంతిమ లక్ష్యాలు కావు. మనిషి ఎప్పుడైతే ఆ సాధనాలనే లక్ష్యాలుగా భావించి పొరపడతాడో, అప్పుడే జీవితం గందరగోళంగా, అర్థరహితంగా మారుతుంది.భారతీయ తాత్విక చింతన ఈ రెండు ప్రశ్నలనూ అత్యంత సూక్ష్మంగా, సమగ్రంగా పరిశీలించింది. భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్మ అర్జునునికి బోధించిన పరమ సత్యం "కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన"ఇది ఫలాపేక్ష లేకుండా, ఫలితాన్ని ఆశించకుండా తన కర్మను తాను చేయమని బోధిస్తుంది. ఇక్కడ ఎంతవరకు కర్మ చేయాలో స్పష్టంగా చెప్పబడింది ధర్మం ఉన్నంతవరకు, ధర్మానికి గ్లాని కలగనంతవరకు. అలాగే ఎందుకొరకు కర్మ చేయాలో కూడా స్పష్టంగా ఉంది స్వార్థపూరితమైన ఫలాపేక్ష కోసం కాదు, కేవలం సమాజ శ్రేయస్సు కోసం, ధర్మ నిర్వహణ కోసం.అలాగే మన ఉపనిషత్తులు 'నేతి నేతి' (ఇది కాదు, ఇది కాదు) అని ప్రకటిస్తాయి. అంటే మనిషి తన చుట్టూ ఉన్న బాహ్య ప్రపంచపు భ్రమల పొరలను ఒక్కొక్కటిగా తొలగిస్తూ వెళ్ళినప్పుడు, చివరికి అంతరంగంలో అసలైన ఎందుకొరకు అనేది బోధపడుతుంది. అది మోక్షం కావచ్చు, ముక్తి కావచ్చు, లేదా సత్య సాక్షాత్కారం కావచ్చు. కానీ ఆ అంతిమ ప్రయోజనం ఏదైనా, అది స్వార్థం కానప్పుడు మాత్రమే సమాజంలో నిలబడుతుంది. కేవలం వ్యక్తిగత తృప్తి కోసం, స్వార్థం కోసం మాత్రమే ప్రయత్నించిన మనిషి చివరికి ఒంటరిగా మిగిలిపోతాడు.నేటి ఆధునిక ప్రపంచంలో సాంకేతికత మనిషికి అపరిమితమైన శక్తులను, సౌకర్యాలను ప్రసాదించింది. ఒకప్పుడు కల్లో కూడా సాధ్యం కాని అద్భుతాలను నేడు మనం స్మార్ట్‌ఫోన్ల ద్వారా, ఇంటర్నెట్ ద్వారా చేయగలుగుతున్నాము. కానీ ఈ అపరిమిత శక్తితో పాటుగా ఎంతవరకు అనే హద్దు మరింత అవసరమైంది. సోషల్ మీడియా, కృత్రిమ మేధస్సు (ూ×), జన్యు మార్పిడి సాంకేతికత ఇవన్నీ మనిషి శక్తులను వేగంగా పెంచుతున్నాయి. కానీ ఎందుకొరకు అనే నైతిక దిక్సూచి, మానవీయ విలువలు లేకుండా ఈ శక్తులు విజృంభిస్తే, అవి మానవాళికే ప్రమాదకరంగా మారుతాయి.మన తెలుగు సమాజంలోనూ నేడు ఈ సమస్య స్పష్టంగా కనిపిస్తున్నది. తల్లిదండ్రులకు తమ పిల్లలను ఎంత చదివించాలో, ఏయే పెద్ద చదువులు చదివించాలో బాగా తెలుసు. కానీ, వారిని అసలు ఎందుకు చదివించాలో, ఎలాంటి మంచి మనుషులుగా తీర్చిదిద్దాలో మరచిపోయారు. సమాజంలో ఎంత సంపాదించాలో తెలుసు కానీ, ఎందుకు సంపాదించాలో అడగడం మానేశారు. ఫలితంగా సమాజంలో డిగ్రీలు పెరిగినా వివేకం తరిగింది, ఆస్తులు పెరిగినా ఇంట్లో సంతోషం తరిగింది, భౌతిక సౌకర్యాలు పెరిగినా మనుషుల మధ్య ఉన్న ఆత్మీయ సంబంధాలు తరిగాయి.నిజమైన విజ్ఞుడు, వివేకి అయినవాడు ఈ రెండు ప్రశ్నలనూ తన జీవన దర్పణంగా (అద్దంగా) చేసుకుంటాడు. అతడు జీవితంలో ప్రతి చిన్న నిర్ణయం తీసుకోవడానికి ముందు రెండు పనులు చేస్తాడు మొదట తన ఆలోచనకు ఒక హద్దును నిర్ణయిస్తాడు, ఆ తర్వాత ఆ పని వెనుక ఉన్న ప్రయోజనాన్ని స్పష్టం చేసుకుంటాడు. ఇది ఒక గొప్ప తాత్విక క్రమశిక్షణ. ఈ క్రమశిక్షణ ఉన్నవాడు సమాజంలో ధనం సంపాదిస్తాడు, కానీ దానికి బానిస కాడు. కీర్తిని కోరుకుంటాడు, కానీ దాని వెంట పిచ్చిగా పరుగెత్తడు. అందరినీ ప్రేమిస్తాడు, కానీ ఎవరికీ బందీ కాడు.ప్రాచీన స్టోయిక్ (ూశీఱఎ) తత్వవేత్తలు ఒక అద్భుతమైన భావనను ప్రపంచం ముందుకు తెచ్చారు అదే 'అమోర్ ఫాటి' (ూఎశీ ఖీఅ), అంటే విధిని ప్రేమించడం. ఇది నిష్క్రియత కాదు, సోమరితనం అంతకన్నా కాదు. ఇది మనం చేయగలిగిన పనిని పూర్తి శ్రద్ధతో, ప్రయత్నంతో చేస్తూ, మన చేతుల్లో లేని ఫలితాన్ని ప్రశాంతంగా స్వీకరించడం. ఇందులోనే ఎంతవరకు అనే అంతర్గత జ్ఞానం ఇమిడి ఉంది. తన శక్తి హద్దు తెలిసిన మనిషి జీవితంలో ఎప్పుడూ నిస్సహాయంగా కాదు, నిర్భయంగా జీవిస్తాడు.చివరికి, ఎంతవరకు? ఎందుకొరకు? అనే ఈ రెండు ప్రశ్నలకు సమాధానం ఏ పుస్తకాల్లోనూ దొరకదు. ప్రతి మనిషి తన అంతరంగంలోకి తొంగి చూసుకుంటూ తానే స్వయంగా కనుగొనాలి. ఎందుకంటే జీవితం అనేది ఒక వ్యక్తిగత అనుభవం. ఇతరులు ఇచ్చిన సమాధానాలు మనకు కేవలం మార్గదర్శకంగా నిలువవచ్చు, కానీ అంతిమంగా మనిషి తన స్వంత అనుభవం ద్వారా, వివేకం ద్వారా ఈ సత్యాన్ని గ్రహించాలి.

గొప్ప జీవితం అంటే మరేమిటో కాదు తెలివితో ఒక హద్దును నిర్ణయించుకొని, హృదయపూర్వకమైన ప్రేమతో మంచి ప్రయోజనాన్ని ఎంచుకొని, ధైర్యంతో అడుగులు ముందుకు వేయడమే. ఎంతవరకు అనే జ్ఞానం మనిషిలోని అహంకారాన్ని నిగ్రహిస్తుంది. 'ఎందుకొరకు' అనే బోధన మనిషి ప్రయాణానికి సరైన దిక్సూచిని ఇస్తుంది. ఈ రెండూ కలిసినప్పుడు మాత్రమే మానవ జీవితం ఒక అర్థవంతమైన, సంపూర్ణమైన ప్రయాణంగా మారుతుంది.కాబట్టి, ఈ రోజు నుండి మీరు జీవితంలో ఏది కోరుకున్నా, ఏ పని ప్రారంభించినా ఒక్క క్షణం ఆగి, మనస్సులో ఈ రెండు ప్రశ్నలు వేసుకోండి ఎంతవరకు?,ఎందుకొరకు?. ఆ రెండు ప్రశ్నలకూ మీరు నిజాయితీగా సమాధానం ఇవ్వగలిగినప్పుడు, మీరు ఒక తత్వవేత్తగా, ఒక జ్ఞానిగా, ఒక పరిపూర్ణ మానవుడిగా ఈ భూమిపై వర్ధిల్లుతారు.హద్దు తెలిసినవాడు జ్ఞాని,ప్రయోజనం తెలిసినవాడు విజ్ఞుడు, ఆ రెండూ తెలిసినవాడు మాత్రమే ఈ జీవితాన్ని జయించినవాడు.

# శ్రీ విష్ణు పురాణం-9 వభాగము

ప్రభూ! అన్ని ప్రాణులయందు అంతర్యామివై ఉండే సర్వేశ్వరుడవు. సర్వజ్ఞుడవు. నీకు నా కోర్కె చెప్పడం సముచితమా? నీ ఆజ్ఞ ననుసరించి మనవి చేస్తున్నాను చిత్తగించునా తండ్రి కొలువులో గద్దెపై నుండగా నేను వెళ్లి తండ్రి ఆసనము మీదికి చెయ్యి చాచగా నా సవతి తల్లి వారించి అక్కడ కూర్చొనడానికి నా కొడుకు అర్హుడు గాని నువ్వు కావు పో! అని పరుషంగా అన్నది. ఆ మాటకి నేను కించపడి లోకేశ్వరుడవైన నీవల్ల అత్యున్నతమైన దివ్యపదం పొందాలని దీక్షపట్టి ఇలా వచ్చి నిన్ను ఆరాధిస్తున్నాను. కాబట్టి నా దీక్ష సఫలం చెయ్యవలసిందని వేడుతున్నాను. అదే నేను కోరే వరం

**ధ్రువుని మాట విని మహావిష్ణువు కరుణారసభరిత హృదయుడై అన్నాడు.**రాకుమారా! పూర్వజన్మమున నువ్వు ఒక బ్రాహ్మణుడవు. వేదశాస్త్రాలు చదివి కులాచారం తప్పక తల్లిదండ్రుల అతి భక్తితో సేవిస్తూ జపాదులతో నన్ను ఉపాసిస్తూ మనసు నాయందే ఉంచి ప్రవర్తిస్తూ ఉండేవాడవు. అలాంటి నువ్వు ఒక రాజుకి మిత్రుడవై అతని వైభవముతో సమాన వైభవం కల ప్రభుత్వం కోరి యీ జన్మలో రాజనందనుడవై జన్మించావు.బాలుడవై ఉన్నా మాకు నచ్చిన భక్తుడవై ఎనలేని దీక్షతో తపస్సు చేసి మహాపుణ్యుడవయ్యావు. నీ కోరిక నెరవేరేట్టు వరమిస్తున్నాను వినుదేవతలకు, గ్రహాలకూ, నక్షత్ర తారాగణములకు పైన ధ్రువస్థానం ఉన్నది. అది నీకు ఇస్తున్నాను. ఆ దివ్యపదమందు నీ తల్లితో నక్షత్ర రూపాన కల్పాంతం వరకు ఉండు. కల్పాంతమందు మోక్షం ఇస్తాను అని ఆనందంగా పలికి మహావిష్ణువు అంతర్హితుడయ్యాడు.ఆ సమయమందు నర సుర కిన్నర సిద్ధసాధ్యాదులు స్తుతిస్తూ ఉండగా తల్లితో దివ్యవిమానారూఢుడై ధ్రువుడు పై స్థానానికి వెళ్లాడు. ముందు సూర్య మండలమునకు తరువాత చంద్ర, నక్షత్ర, బుధ, అంగారక, శుక్ర, బృహస్పతి, శనైశ్చరమండలాలకు వెళ్లి వారి మన్ననలు పొంది సప్తర్షి మండలం దర్శించాడు. వారి అనుగ్రహముతో ధ్రువస్థానానికి చేరి అక్కడ మహాభాగ్యముతో లోకాలకు తలకట్టై నేటికీ సకలజన మాననీయుడై విరాజిల్లుతూ ఉన్నాడుఈ ధ్రువచరిత్ర చదివినవారు, విన్నవారు యశస్ఫూర్తితో సకుటుంబముగా సుస్థిర నివాసులై శ్రీమంతులై రాణిస్తారు.ఆ ధ్రువునకు శంభువు అనే భార్యయందు శిష్టి, భవ్యుడు అని ఇద్దరు కొడుకులు. శిష్టికి సుచ్ఛాయ అనే భార్యయందు రిపుడు, రిపుంజయుడు, విప్రుడు, వృకలుడు, వృకతేజుడు- అని అయిదుగురు కొడుకులు.రిపునకు బృహతియందు చాక్షుషుడు - వానికి పుష్కరిణియందు చాక్షుషమనువు పుట్టాడు. వానికి సద్వలయందు ఊరుడు, పూరుడు, శతద్యుమ్నుడు, తపస్వి, సత్యభాక్కు, శుచి, అగ్నిష్టోముడు, అతిరాత్రుడు, సుద్యుమ్నుడు, అభిమన్యుడు అని పదిమంది కొడుకులు పుట్టారుఊరునకు ఆగ్నేయి అనే కాంతయందు అంగుడు, సుమనసుడు, స్వాతి, క్రతువు, అంగిరసుడు, శిబి అని ఆర్గురు సుతులు జన్మించారు. వారిలో అంగునకు సునీథ అనే యిల్లాలి యందు వేనుడు అనే కొడుకు పుట్టాడు. ఆ వేనుని కుడి భుజమును మునులు మథించగా దానినుండి పృథువు అనే కొడుకు పుట్టి సాటిలేని భుజవిక్రమముతో రాజలోకమును వశపరచుకొని నేలనేలిన చక్రవర్తి అయి భూమిని గోవుగా చేసి పాలు పితికి ఆ పాలతో సచరాచర భూతకోటికి సంజీవన స్థితిని కలిగించాడు అని చెప్పగా శిష్యుడు గురువుకి నమస్కరించి - గురుదేవా! మునులు వేనుని భుజం మథించడం, పృథువు జన్మించడం, ఆ రాజు భూమిని ఆవును చేసి పిదకడం ఈ విషయం విస్తరించి చెప్పవలసిందని అడగగా పరాశరుడు చెప్పాడు

# మనిషి నూరేళ్ల జీవితాన్ని అర్థవంతంగా జీవించండి.

మనిషికి మనషిక ఒత్తిడి అనే మాట ఇవాళ సహజంగా ప్రతి చోటా మాట్లాడుకునే మాట. సంతోషం, ఓపిక, ఓర్పు, నేర్పు, ఉల్లాసం ఉండాల్సిన బదులు వాటి స్థానాల్లో కోపం, అసూయ, ద్వేషం, ఏకాగ్రత లోపించడం, ఒత్తిడికి గురి కావడం, ఆందోళన చెందడం, భయపడడం ఇవి నేడు మానవ జీవితాన్ని నిర్వీర్యం చేస్తున్నాయి. అయితే ఇవన్నీ మనిషి తనకు తానుగా తెచ్చుకుంటున్నవే. తన శక్తిని సామర్థ్యాన్ని తక్కువగా అంచనా వేసుకుని ప్రతి పనిని కూడా నెగిటివ్గా ఆలోచించడం వలన ఇవన్నీ దాపరిస్తున్నాయి. సానుకూల దృక్పథాన్ని అవలంబించి, ప్రతి పని నాతో సాధ్యమేనని, ఈ విషయంలో గెలిచి తీరుతానని, సానుకూల ఆలోచనలను కలిగి ఉంటే జీవితం నందనవనమే. అయితే కావాల్సింది అసూయ ద్వేషాలు, కుట్రలు కుతంత్రాలను విడిచిపెట్టడం మాత్రం అవసరం. కానీ నేటి మానవులు వీ టిని పట్టుకొని వేలాడుతున్నారు కనుకనే ఒత్తిడికి గురవుతున్నాడు జాగ్రత్త యువతా! ఆందోళన చెందడం వల్ల శారీరక మానసిక సమస్యలు ఉత్పన్నం కావడం అవి క్రమంగా పరిణామ క్రమంలో సంతాన ఉత్పత్తి సామర్థ్యాన్ని దెబ్బతీసే స్థాయికి చేరడంతో పాటు శారీరక బలాన్ని కూడా కుదించి వేసి బలహీనులను తయారు చేస్తుంది. ముఖ్యంగా స్త్రీ పురుషుల్లో ఇద్దరిని కూడా మానసిక ఒత్తిడి నిరాశపరిచి ఆందోళన గురిచేసినప్పటికీ మగవాళ్లపై మరింత దుష్ప్రభావాలు ఎక్కువ అని వైద్య పరిశోధనలు తెలియజేస్తున్నాయి. అధిక ఒత్తిడి పైన జరిపిన అనేక పరిశోధనల్లో అమెరికాలోని సెంట్రల్ ఫ్లోరిడా విశ్వవిద్యాలయం కాలేజ్ ఆఫ్ మెడిసిన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జామిన్ బ్రహ్మబట్ పరిశోధన ప్రకారంగా ఒత్తిడి వల్ల సంతానోత్పత్తికి దారి తీసే వీర్యకణాల సంఖ్య పడిపోయి క్రమంగా బలహీనంగా కదలడానికి సహసంబంధం ఉందని, పురుషులు నిరంతరం ఒత్తిడి కి లోనవడం వీర్యకణాల ఆరోగ్యం పై దుష్ప్రభావం అధికంగా కలవడానికి దోహదపడుతుందని ఒత్తిడిని తగ్గించుకోకపోతే భవిష్యత్తు జీవితం అంధకారమని ఈ పరిశోధన హెచ్చరిస్తున్నది.

**వైద్య పరిశోధనలు ఒత్తిడి వల్ల అనర్థాలు** శాస్త్ర సాంకేతిక రంగాలలో కొనసాగిన పరిశోధనల సారాంశాన్ని జనానికి సంబంధితులకు ముఖ్యంగా ప్రస్తుతం యువతి యువకులకు తెలియజేయడం ద్వారా జరుగుతున్న పొరపాట్లు చేస్తున్న తప్పులు సవరించుకోవలసినటువంటి పరిస్థితులను అంచనా వేయడానికి ఆస్కారం ఉంటుంది. ముఖ్యంగా యువతి యువకులకు ప్రధానమైనటువంటి సంతాన సమస్యను ఫోకస్ చేస్తూ జీవితమే నిర్వీర్యమయ్యే ప్రమాదం ఉన్నదని తెలిపే ఈ పరిశోధన చాలా అత్యంత బాధాకరం. అందుకే యువతి యువకుల్లారా జాగ్రత్త మీ ఒత్తిడిని నివారించుకోండి. పురుషులకు సంబంధించిన అంశం ఈ వ్యాసంలో ప్రధానంగా ఫోకస్ చేసినప్పటికి సంతానోత్పత్తి ఉబయుల కృషి ఫలితమే కదా! ఆ అవగాహనా ఇరువర్గాలకు ఉండాలని కోరుకుంటూ సంతానోత్పత్తితో హాయిగా సాగిపోండి.తాత్కాలికంగా ఒత్తిడితో పెద్దగా ప్రమాదం లేదు కానీ రోజులు వారాలు నెలపాటు కంటిన్యూగా ఒత్తిడి జరిగినట్లయితే నిద్ర దెబ్బ తినడంతో పాటు శక్తి సన్నగిల్లి మానసిక స్థితిలో మార్పు జరిగి బరువు పెరగడంతో పాటు లైంగిక వాంఛ సామర్థ్యం తగ్గిపోయే ప్రమాదం ఉందని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. ఇదే క్రమంలో కొందరు దుర్ వ్యసనాలకు కూడా పాల్పడి తమ అస్తిత్వాన్ని బాధ్యతలను కోల్పోతే మరింత కష్టమే కదా! సాధారణంగా ఒత్తిడి కలిగినప్పుడు శరీరము కార్టీ సాల్ అడ్రినలిన్ వంటి హార్మోన్లను విడుదల చేస్తుంది ఈ విడుదలయ్యే హార్మోన్లు నిరంతరం ఒత్తిడి వల్ల మంచికి బదులుగా చెడు చేసే అవకాశం ఎక్కువగా ఉండడమే ఇందుకు ప్రధాన కారణం అని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు.సంతానోత్పత్తిలో ప్రధాన భాగమైనటువంటి శుక్రకణాల ఉత్పత్తి, పరిపక్వత,వీర్యంలో కలిసిపోవడానికి సుమారు రెండు మూడు నెలల సమయం పడుతుంది. ఈ పరిస్థితుల్లో దీర్ఘకాలిక అలసట నిద్రలేమి ఒత్తిడి గనుక ఉన్నట్లయితే శుక్రకణాల ఉత్పత్తిని నేరుగా దెబ్బతీసే ప్రమాదం ఎక్కువ.అధిక ఒత్తిడి స్థాయి వల్ల శుక్రకణాల సంఖ్య తగ్గిపోవడం, బలహీనపడడం, బలహీనంగా కదలడం, ఆకారం కోల్పోవడం వంటి దుర్లక్షణాలకు దారితీస్తుందని పరిశోధనలు తెలుపుతున్నాయి. ఒక పరిశోధన ప్రకారంగా మధ్యస్థాయి ఒత్తిడి ఉన్న వారితో పోలిస్తే అధిక స్థాయి ఒత్తిడి ఉన్న వాళ్ళలో వీర్యకణాల సాంద్రత సంఖ్య పెద్ద మొత్తంలో తగ్గినట్లు పరిశోధన తేలింది. ఈ పరిస్థితుల్లో అర్థవంతమైనటువంటి జీవితం గడపడం ద్వారా తనకు తన కుటుంబానికి సమాజానికి గుర్తింపు తీసుకు రావలసినటువంటి సందర్భంలో యువత ఈ రకంగా నిర్వీర్యం కావాల్సిందేనా? పరిష్కారాలు లేవా? కష్టతరంగానైనా ఆచరిస్తే ఫలితాలు లేకపోలేదు కదా!జీవిత భాగస్వామిలో ఈ అవగాహన కల్పించడం ద్వారా పరిస్కారాన్ని మరింత దగ్గరగా చూడవచ్చు. ఒక్కసారి ఆలోచిద్దాం. ఒత్తిడిని నివారించుకోవడం ద్వారా సంతాన ఉత్పత్తి శక్తిని పెంచుకోవడానికి మార్గాలుప్రధానంగా నిద్ర లేకపోవడం, డ్రగ్స్కు అలవాటు పడడం, మద్యం తాగడం, వంటివి ప్రధానంగా ఒత్తిడికి కారణాలు. స్నేహ సంబంధాలు కూడా ఈ ఒత్తిడి శక్తిని మరింత పెంచే ప్రమాదం లేకపోలేదు. కారణాలు విశ్లేషించుకుని అందుబాటులో ఉన్న అంశాలను ఆచరించి జీవితాన్ని ఫ లవంతం చేసుకుందాం.-- టీవీ కంప్యూటర్ సెల్ఫోన్ వంటి డిజిటల్ వ్యాపకమనేది ప్రధానంగా ఒత్తిడి కలిగించే పెద్ద శక్తులు. వీటి బారిన పడకుండా సాధ్యమైనంత తగ్గించుకోవడమే శరణ్యం.--- వీర్యకణాల ఉత్పత్తి సంతాన సాఫల్యతకు ప్రధానమైనటువంటి టెస్టోస్టిరాన్ హార్మోన్ను నిద్ర ప్రభావితం చేస్తుంది. ఏడు నుండి తొమ్మిది గంటలు నిద్ర ఉంటే హార్మోన్ ఉత్పత్తికి డోకా ఉండదు.-- ప్రస్తుత యువత శారీరక వ్యాయామం కంటే ప్రధానంగా ఒకే దగ్గర కూర్చుని టీవీ సెల్ ఫోన్ కంప్యూటర్ కి అలవాటు పడ్డ రోజులివి. అలా కాకుండా క్రమం తప్పని శారీరక శ్రమకు అలవాటు పడితే బరువు తగ్గించుకోవచ్చు. హార్మోన్ల ఉత్పత్తి గణనీయంగా యంగా పెరుగుతుంది. శారీరక శక్తి పటిష్టమవుతుంది. అధిక బరువు వీర్యకణాల ఉత్పత్తిని ప్రేరేపించే అవకాశం ఉంది అందుకే బరువు తగ్గించుకోవడం చాలా అవసరం.-- నికోటిన్, గంజాయి, ఆల్కహాల్ డ్రగ్స్, వైన్స్ వీర్యకణాలు తగ్గిపోవడానికి బలహీనంగా కదలడానికి అసాధారణ కణ ఆకృతులకు కారణమవుతున్నాయి కనుక వెంటనే రద్దు చేసుకోవాలి. ఒత్తిడి దీర్ఘకాలికంగా గనక కొనసాగినట్లయితే దాని ప్రభావం సంతానోత్పత్తి సమర్థత పైన పడుతుంది. అందువల్ల ఒత్తిడి కారణాలను గుర్తించి అది పెరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడంలో యువత ముఖ్యంగా భార్యాభర్తలు కుటుంబ సభ్యులు కూడా సహకరించవలసినటువంటి అవసరం ఉంటుంది. ఒత్తిడి ప్రధానంగా యువకుల పైన ప్రత్యక్ష ప్రభావాన్ని చూపినప్పటికీ దానివల్ల జరిగే పరిణామాలు సంబంధాలు స్త్రీ పురుషులు ఇద్దరికీ కూడా సంబంధించిన అంశాలుగా చూడవలసి ఉంటుంది. అందుకే యువతి యువకులుగా భార్యాభర్తలు గా కలిసి ఉన్న సందర్భంలో నిరాశ నిస్పృహ ఒత్తిడికి గురైన సందర్భాల్లో ఈ అవగాహన ఉంటే పరస్పరం సహకరించుకోవడానికి, క్రమంగా తగ్గించుకోవడానికి, ఉత్సావంతమైన వాతావరణాన్ని కల్పించడానికి అవకాశం ఉంటుంది.అందుకే ఈ లక్షణాలు ఈ ప్రభావాలు వైరుధ్యాలు స్త్రీ పురుషులు ఇద్దరికీ కూడా అవగాహన కలిగి ఉండవలసిన అవసరం చాలా ఉన్నది. పురుషుల్లో ఒత్తిడి వల్ల వీర్యశక్తి క్రమంగా నశిస్తుందని చెప్పుకున్నాం మరి స్త్రీలలో ఒత్తిడి కూడా నెగిటివ్ ఆలోచనలకు అయిష్టతకు ఆందోళనకు దారి తీసినప్పుడు కూడా స్త్రీ పురుషులు ఇద్దరి మధ్యన సఖ్యత లేకుంటే అది కూడా అనర్థమే కదా! అంటే ఒత్తిడి పురుషుల్లోనే కాదు స్త్రీలలో కూడా అనర్థ హేతువే. ఆ రకంగా ఈ సమస్యను ఉమ్మడి సమస్యగా ఆలోచిస్తేనే పరిష్కారం దొరుకుతుంది.

# అమెరికాలో తెలుగమ్మాయికి ప్రతిష్ఠాత్మక అవార్డు

అమెరికాలో మరో తెలుగు తేజం తన ప్రతిభతో మెరిసింది. పల్నాడు జిల్లాకు చెందిన అనన్య గోలి అనే విద్యార్థిని టెక్నాలజీ రంగంలో విశేష ప్రతిభ కనబరిచి అరుదైన గౌరవాన్ని అందుకుంది. మిన్నెసోటా టెక్నాలజీ ఫౌండేషన్ ఏటా అందించే 'మిన్నెసోటా ఆస్పిరేషన్స్ ఇన్ కంప్యూటింగ్' (వీఊూఱజ) అవార్డుల్లో భాగంగా అనన్య 'స్టేట్ ఆనరబుల్ మెన్షన్' పురస్కారానికి ఎంపికైంది.హైస్కూల్ విద్యార్థుల్లో కంప్యూటింగ్, టెక్నాలజీ నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు, సామాజిక సేవ వంటి అంశాల్లో చూపిన ప్రతిభకు ఈ అవార్డును అందిస్తారు. ముఖ్యంగా టెక్ రంగంలో బాలికలను, ఇతర వర్గాల వారిని ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. ఈ ఏడాది ఈ గౌరవానికి ఎంపికైన ఎనిమిది మంది విద్యార్థుల్లో అనన్య ఒకరిగా నిలవడం విశేషం. అనన్య తల్లిదండ్రులు గోలి కృష్ణ చైతన్య, సంప సిన్హా. వీరి స్వస్థలం పల్నాడు జిల్లాలోని సత్తెనపల్లి. సాఫ్ట్‌వేర్ నిపుణులైన వీరు 2014లో అమెరికాలో స్థిరపడ్డారు. అనన్య ప్రస్తుతం మిన్నెసోటాలోని ఈడెన్ ప్రైరీ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతోంది. నేషనల్ సెంటర్ ఫర్ విమెన్ & ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (చీజఔ×) అనుబంధ సంస్థ అయిన మిన్నెసోటా టెక్నాలజీ ఫౌండేషన్ ఈ అవార్డులను నిర్వహిస్తోంది. చిన్న వయసులోనే టెక్నాలజీలో తెలుగు బాలిక గుర్తింపు సాధించడం పట్ల పలువురు అభినందనలు తెలుపుతున్నారు.



# యమునా పుష్కరాలు

## జూన్ 2 నుంచి 13 వరకు

గురుడు (బృహస్పతి) కర్కాటక రాశిలోకి ప్రవేశించిన సమయంలో యమునా నదికి పుష్కరాలు ప్రారంభమవుతాయి. ఈ నది ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, హర్యానా, ఢిల్లీ మరియు ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల గుండా ప్రవహిస్తుంది. ప్రతీ 12 సంవత్సరాలకు ఒకసారి, అత్యంత వైభవంగా జరిగే ఒక్కొక్క పవిత్ర నదీ ఉత్సవమునే పుష్కరాలందురు. ఈ సంవత్సరము - యమునా పుష్కరాలు - జూన్ 2 నుండి జూన్ 13 వరకు, ఘనంగా జరుగనున్నాయి.భక్తులు ప్రధానంగా ఈ క్రింది పవిత్ర ప్రాంతాలలో పుష్కర స్నానాలు ఆచరిస్తారు:ప్రయాగ్‌రాజ్ (త్రివేణి సంగమం)మథుర (శ్రీకృష్ణుడి జన్మస్థలం)ఢిల్లీఆగ్రాకల్పి, హమీర్‌పూర్‌పుష్కరాల ప్రాముఖ్యత: యమునా నదిని - పరమేశ్వరుడు, సూర్యుడు, యముడు, శనైశ్చరులతో ముడిపడిన అత్యంత పవిత్రమైన నదిగా భావిస్తారు. ఈ పుష్కర సమయములో యమునా నదిలో స్నానం చేయడం, పితృతర్పణాలు ఇవ్వడం మరియు దానధర్మాలు చేయడంవల్ల సమస్త పాపాలు తొలగిపోయి, పితృదోషాలు నివారించబడతాయని హిందూ ధర్మ శాస్త్రాలు చెబుతున్నాయి.

